
'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+8 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 230

శుక్రవారం 10-11-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL






శుక్రవారం 10-11-2023

సత్యమేవ జయతే


# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+8 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 230

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'


బజాజ్ ఎలక్ట్రానిక్స్
LG
20% CASHBACK UPTO MAX ₹20,000*
10/0 EMI
EMI STARTING FROM ₹1999
Life's Good.
SAMSUNG BESPOKE
Elegant colours Incredible Combinations
Designed for you, by you
20% CASHBACK UPTO MAX ₹15,000*
FINANCE 9/0 & 12/0
On Selected Models*
Haier
OPEN THE DOOR TO MORE WITH
3-DOOR CONVERTIMAX
SIDE BY SIDE REFRIGERATOR
20% 24 1 EMI OFF 0 DOWN PAYMENT ₹994
BOSCH
Invented for life
India's only* flexible refrigerator for its diverse needs.
Flexible #LikeABosch
₹ 6,000 Instant discount on selected models.*
8 EASY EMI* Zero Down Payment
Zero cost on EMI*
AIR CONDITIONERS
RANGE STARTS FROM ₹30,490/-*
LG SAMSUNG DAIKIN Haier BLUE STAR VOLTAS Panasonic GENERAL
LG
INSTANT CASHBACK MAX ₹12,000*
10/0 EMI
EMI STARTING FROM ₹1,499/-
THE BIGGEST & THE BEST OFFER
ARIEL FREE
BUY LG FRONT LOAD WASHING MACHINE
ON SELECTED MODELS* 8 Kgs & ABOVE FLWMS
Life's Good.
SAMSUNG
AI Ecobubble™ HYGIENE STEAM Quality Wash
20% CASHBACK UPTO MAX ₹12,000*
FINANCE 9/0 & 12/0
20 YEARS MOTOR WARRANTY
IFB
EXECUTIVE MXC 9014
CAPACITY : 9 KGS
DEEP CLEAN POWERED BY AI TECHNOLOGY
Upto 15% CASHBACK UPTO MAX ₹7,500*
FIXED EMI STARTING FROM ₹2,222/-
BOSCH
Invented for life
Inspired by innovation, designed for fabric care.
Bosch Over 100 Years in India
₹ 6,000 Instant discount on selected models.*
8 EASY EMI* Zero Down Payment
Zero cost on EMI*
Haier
WASHING ASSURANCE 30-DAY
MONEY BACK GUARANTEE*
DIRECT MOTION WASHING MACHINES
22.5% 18 0 DOWN PAYMENT ₹994
WASHING MACHINES
RANGE STARTS FROM ₹11,990/-*
LG SAMSUNG Panasonic Haier Whirlpool IFB BOSCH
iPhone 13 MRP ₹59,900/- EFFECTIVE PRICE ₹28,900/-* PER DAY EMI ₹42/-
iPhone 14 MRP ₹69,900/- EFFECTIVE PRICE ₹33,000/-* PER DAY EMI ₹51/-
iPhone 15 MRP ₹79,900/- EFFECTIVE PRICE ₹45,900/-* PER DAY EMI ₹70/-
APPLE ADAPTER FREE* On iPhone 15
Price After Store Discount, Exchange Value, Exchange Bonus & Bank Cashback.
SAMSUNG
Galaxy S23 Ultra RETAIL PRICE ₹1,24,999/- OFFER PRICE ₹59,999/-* OWN NOW @ ₹83/- DAY
Galaxy S23 FE 5G NEW LAUNCH NOW AVAILABLE OWN NOW AT ₹49,999/-* OWN NOW @ ₹67/- DAY
UPGRADE BONUS OF ₹5,000/-
Galaxy A34 5G RETAIL PRICE ₹35,499/- OFFER PRICE ₹25,999/-* OWN NOW @ ₹49/- DAY
Galaxy A14 5G RETAIL PRICE ₹18,499/- OFFER PRICE ₹13,499/-* OWN NOW @ ₹31/- DAY
Water & Dust Resistant (IP67) Corning Gorilla Glass 5
vivo
V29 Series Delight Every Moment RANGE STARTS FROM ₹32,999/-* ADDITIONAL UPTO ₹3,500/- CASHBACK
Y200 5G It's My Style RANGE STARTS FROM ₹21,999/-* ADDITIONAL UPTO ₹2,500/- CASHBACK
OPPO
F23 5G 8GB + 256GB MRP ₹28,999/- EFFECTIVE PRICE ₹21,490/-*
A78 5G 8GB + 128GB MRP ₹22,999/- EFFECTIVE PRICE ₹17,490/-*
10% ADDITIONAL CASHBACK NO COST EMI UPTO 3 MONTHS
mi
Redmi Note 12 Pro 5G Super OIS. Supernote 6GB + 128GB MRP ₹27,999/- EFFECTIVE PRICE ₹17,999/-* INCLUDING ₹3,000/- CASHBACK
Redmi Note 12 Super Note Super Design 6GB + 64GB MRP ₹18,999/- EFFECTIVE PRICE ₹10,499/-* INCLUDING ₹1,500/- CASHBACK
OnePlus Nord Ce3 Lite 5G MRP ₹21,999/- OFFER PRICE ₹21,499/-* ADDITIONAL ₹1,500/- INSTANT BANK DISCOUNT ON
acer ASPIRE 3 - Intel 12th Gen i3 | 8GB + 512 GB ₹48,999/- ₹35,199/-* EMI ₹196
hp FR5011TU i5 | 12th Gen | 16GB + 512GB ₹71,641/- ₹56,490/-* EMI ₹78
DELL 5430 i7 | 13th Gen | 16GB + 1TB SSD ₹1,11,697/- ₹80,990/-* EMI ₹225
ASUS TUF GAMING F15 i5 | 11th Gen | 8GB + 512 GB 4 GB RTX 2050 GRAPHICS CARD ₹77,990/- ₹56,900/-* EMI ₹211
hp VICTUS FA0353TX GAMING i7 | 12th Gen | 16GB + 512 GB 4 GB RTX 3050 GRAPHICS CARD ₹1,01,705/- ₹79,990/-* EMI ₹111
MacBook Air M1 ₹99,900/- ₹44,900/-* EMI ₹68
*NOTE : CASHBACK ON SELECTED CREDIT CARDS ONLY. *PRICE POST EXCHANGE BONUS, BANK CASHBACK, STORE DISCOUNT AS APPLICABLE.
FREE BAG* + GET ACCESSORIES WORTH ₹4,990/- AT JUST ₹1,690/-*
విజయవాడ: వినాయక థియేటర్ దగ్గర, బందరు రోడ్, గుణదల | మీనాక్షి టవర్స్, ఏలూరు రోడ్, సూర్యారావు పేట |
71-2-9, మోహన్ దాస్ థియేటర్ ప్రక్కన, వెంకటేశ్వరపురం, పటమట | మచిలీపట్నం: ఓల్డ్ D. No. 11/313, సిరి ఎస్టేట్, చెమ్మన్నగిరి పేట
గిఫ్ట్ కార్డ్స్, కార్పొరేట్ బుకింగ్‌లు లేదా బల్క్ ఆర్డర్‌ల కోసం, దయచేసి మాకు ఈమెయిల్ చేయండి corporatesales@bajajelectronics.in




సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+8 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 230

శుక్రవారం 10-11-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL





**జ్యోతి సురేఖకు స్వర్ణం, రజతం**

ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో మెరిసిన ఏపీ క్రీడాకారిణి - స్పోర్ట్స్‌లో



**ఈక్విటీ ఫండ్స్‌లో పెట్టుబడులు**

అక్టోబర్‌లో ఇన్వెస్టర్ల నుంచి రూ.20 వేల కోట్లు రాక - బిజినెస్‌లో



**వచ్చే నెల్లో శీతాకాల సమావేశాలు**

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 4 నుంచి 22వ తేదీ వరకు జరుగుతాయని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు.

వివరాలు 6లో ▸



**నాకు ఒక్క ఇల్లూ లేదు**

దేశంలోని పేదలకు తమ ప్రభుత్వం 4 కోట్ల ఇళ్లు నిర్మించి ఇచ్చిందని, తన కోసం ఒక్క ఇల్లూ కట్టుకోలేదని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



**65 శాతానికి రిజర్వేషన్లు**

ప్రభుత్వ విద్యాసంస్థలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లను 50 నుంచి 65 శాతానికి పెంచే బిల్లును బిహార్ అసెంబ్లీ ఆమోదించింది.

వివరాలు 6లో ▸



**గాజా సిటీపై దండయాత్ర**

గాజా సిటీని ఇజ్రాయెల్ సైన్యం చుట్టుముట్టింది. 100కుపైగా హమాస్ సొరంగాలను పేల్చేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది.

వివరాలు 6లో ▸

# జనం పట్టిన జెండా

## జగన్నినాదాల నడుమ ఘనంగా ప్రారంభమైన 'వై ఏపీ నీడ్స్ జగన్'

### తొలి రోజు 660 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో కార్యక్రమానికి శ్రీకారం

- భారీ సంఖ్యలో పాల్గొన్న పార్టీ మద్దతుదారులు, సీఎం జగన్ అభిమానులు
- ప్రజాప్రతినిధులకు ఘనస్వాగతం పలికిన సర్పంచులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ప్రజలు
- సంక్షేమాభివృద్ధి పథకాలతో చేసిన మంచిని వివరించే బోర్డులు, ప్రధాన కూడళ్లలో పార్టీ జెండాల ఆవిష్కరణ
- నాలుగున్నరేళ్లలో ప్రతి ఇంటికి, రాష్ట్రానికి సీఎం జగన్ చేసిన మంచిని వివరించిన నేతలు
- హామీల అమలులో సీఎం జగన్ నిబద్ధత.. చంద్రబాబు–పవన్ వంచనను ఎండగట్టిన వైనం
- తాము, తమ కుటుంబం, గ్రామం, నియోజకవర్గం, రాష్ట్రం బాగుండాలంటే జగనే కావాలంటూ నినదించిన ప్రజానీకం
- రాత్రికి గ్రామాల్లోనే బస చేసిన నేతలు.. నేడు ఉదయం ఇంటింటా ప్రచారానికి శ్రీకారం



విశాఖలోని అక్కయ్యపాలెంలో భారీ ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

సాక్షి, అమరావతి: సంక్షేమమే అభివృద్ధి అని నిరూపించిన సంక్షేమ ప్రదాతకు నీరాజనం పలికారు. విద్య – వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులతో మేలు చేసిన ప్రజానేతకు బ్రహ్మరథం పట్టారు. వ్యవసాయాన్ని పండుగగా మార్చి రైతును రాజుగా చేసిన రైతు బాంధవుడికి జేజేలు పలికారు. పోర్టులు, రహదారులతో పారిశ్రామికాభివృద్ధిని పరుగులెత్తిస్తూ ఉపాధి కల్పిస్తున్న ప్రగతిశీలిపై ప్రశంసల వర్షం కురిపించారు. తాము, తమ కుటుంబం, గ్రామం, మండలం, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రం ప్రగతిపథంలో

మిగతా 8వ పేజీలో ▶



కాకినాడ జిల్లా దొండవాకలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా, పార్టీ శ్రేణులు

కృష్ణా జిల్లా పామర్రులో జరిగిన సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



# బడుగుల రాజ్యమిది

'సీఎం జగన్ రాష్ట్రంలో బడుగుల రాజ్యాన్ని స్థాపించారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దపీట వేశారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ ఇవ్వనన్ని పదవులు, పథకాలు అందించారు. ఈ వర్గాలు ఎల్లవేళలా సంతోషంగా ఉండాలంటే మళ్లీ జగన్ సీఎం కావాలి' అని అనకాపల్లి సామాజిక సాధికార యాత్ర సభలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు.

2లో

### సామాజిక న్యాయంలో చరిత్ర సృష్టించిన జగన్

'సామాజిక న్యాయంలో సీఎం జగన్ దేశంలోనే చరిత్ర సృష్టించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అక్కున చేర్చుకున్నారు. సంక్షేమ పథకాలతో అభివృద్ధిలోకి తీసుకువచ్చారు' అని పామర్రు సభలో మంత్రి జోగి రమేశ్ అన్నారు.

### పెత్తందారీ వ్యవస్థపై జ'గన్'

'చంద్రబాబు హయాంలో పెచ్చరిల్లిన పెత్తందారీ వ్యవస్థను సీఎం జగన్ సమూలంగా పెకలించివేశారు. బడుగులకు రాజ్యాధికారంలో సముచిత స్థానం కల్పించారు. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత పేదల జీవితాల్లో వెలుగులు వచ్చాయి' అని కావలి సభలో మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పారు.

## న్యూస్‌రీల్

### చంద్రబాబుకు దక్కని ఊరట



ఫైబర్‌నెట్ కేసులో ముందస్తు బెయిల్ కోసం చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ఈనెల 30కి వాయిదా వేసింది. స్కిల్ స్కామ్ కేసులో బాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై తీర్పు దీపావళి సెలవుల తర్వాతేనని సుప్రీంకోర్టు తెలిపింది.

వివరాలు 9లో ▸

### ప్రజాప్రతినిధులపై కేసుల విచారణకు ప్రత్యేక బెంచ్‌లు



ప్రజాప్రతినిధులపై నమోదైన క్రిమినల్ కేసుల్లో విచారణపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎంపీలు, ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసుల్లో విచారణను వేగవంతం చేయడానికి ప్రత్యేక బెంచ్‌లు ఏర్పాటు చేయాలని హైకోర్టులను ఆదేశించింది.

వివరాలు 6లో ▸

### బాబుకు బెయిలొచ్చాక సభలు పెడతాం



చంద్రబాబు తాత్కాలిక బెయిల్‌పై ఉన్నారని, పూర్తిస్థాయి బెయిల్ వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా సభలు నిర్వహిస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు చెప్పారు. రాష్ట్రమైనా, దేశమైనా, ప్రపంచంలో ఎక్కడైనా జనసేనతో కలిసే పనిచేస్తామన్నారు.

వివరాలు 9లో ▸

### ఎంపీ మహువాను బహిష్కరించాలి



పార్లమెంట్‌లో ప్రశ్నలడిగేందుకు వ్యాపారవేత్త నుంచి డబ్బులు తీసుకున్నారంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాపై అనర్హత వేటువేయాలని లోక్‌సభ స్పీకర్‌కు ఎథిక్స్ కమిటీ సిఫారసు చేసింది.

వివరాలు 6లో ▸



ఇదండీ సంగతి




సార్! మీరు దోశ వేయకుండా ఉంటేనే ఓటేస్తారట సార్!

ఏపీ కార్ల్‌లో టెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



# అభివృద్ధికి నిదర్శనం

## పులివెందులలో రూ.64.54 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన సీఎం వైఎస్ జగన్

### సుందర శ్రీకృష్ణ దేవాలయాన్ని ప్రారంభించి స్వామివారి దర్శనం

సాక్షి ప్రతినిధి, కడప: రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం వైఎస్సార్ జిల్లా చేరుకున్న ముఖ్యమంత్రి జగన్ తొలిరోజు పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో రూ.64.54 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ దేవాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఏపీ కార్ల్‌లో అగ్రికల్చర్, హార్టికల్చర్ కాలేజీలతోపాటు అత్యాధునికంగా నిర్మించిన ల్యాబ్‌ను ప్రారంభించారు. శ్రీస్వామినారాయణ గురుకుల పాఠశాలకు భూమి పూజ నిర్వహించి ఆదిత్యా బిర్లా గార్మెంట్స్ తయారీ యూనిట్‌ను సందర్శించారు. అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనంగా తీర్చిదిద్దిన పులివెందుల పట్టణం దేశానికే ఆదర్శప్రాయమని

మిగతా 8వ పేజీలో ▶

# స్వలాభం కోసం ధర్నా నాటకం



పాలకొల్లులో ఇళ్లు పొందిన నివాసితులతో టీడీపీ నేత ఓవరాక్షన్

రుణాలపై రెండేళ్లు మారటోరియం.. లేదా ఇళ్లు ఇచ్చేవరకు ఈఎంఐ లేదు

ఆలోగా ఇళ్లు కేటాయించకపోతే ప్రభుత్వమే ఈఎంఐ చెల్లింపు

పాలకొల్లులో 6,144 టిడ్కో ఇళ్ల నిర్మాణం

వీటిలో 2,208 గృహాలు ఉచితంగా ఇచ్చినవే..

3,936 మంది లబ్ధిదారులకు 11 బ్యాంకుల నుంచి రుణాలు

వీరిలో 14 నెలలపాటు వాయిదాలు చెల్లించని వారు 27 మంది

9లో

## ఫ్యాక్ట్‌చెక్

### పశువుల రీసైక్లింగ్‌కు ఆస్కారమే లేదు

- ముందుకొచ్చిన చేయూత లబ్ధిదారులకే రుణాలు
- వాళ్లకు నచ్చిన చోట నచ్చిన జీవాల కొనుగోలుకు వెసులుబాటు
- పొరుగు రాష్ట్రాల నుంచి ఒక్క పశువు కూడా కొనలేదు.. రాష్ట్రంలో ఉన్న ప్రతి పశువుకు ఇనాఫ్ ట్యాగ్ వేశాం
- ఈనాడు కథనానికి పశుసంవర్థక శాఖ ఖండన

5లో

### కనీస జ్ఞానం లేకుండా రాస్తే ఎలా?



- సీఎంవో పేరు ఎవ్వరైనా చెబుతారా?
- రాజకీయంగా బురద జల్లేందుకే ఇసుకపై 'ఈనాడు' అసత్య కథనాలు
- దానిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం: గనుల శాఖ సంచాలకుడు వీజీ వెంకటరెడ్డి

5లో

అనకాపల్లిలో జరిగిన సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



# బడుగుల రాజ్యమిది

## సీఎం జగన్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే ప్రాధాన్యం

- ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఈ వర్గాలకు పెద్దపీట
- ఈ వర్గాలు ఎల్లవేళలా మంచిగా ఉండాలంటే మళ్ళీ జగన్ సీఎం కావాలి
- ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తే ఒక్కో గిరిజనుడు ఒక్కో అల్లూరి సీతారామరాజవుతాడు
- అనకాపల్లి సామాజిక సాధికార సభలో డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాక్షి, అనకాపల్లి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో బడుగుల రాజ్యాన్ని స్థాపించారని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. బడుగు, బలహీనవర్గాలకు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా పెద్దపీట వేసిన తొలి సీఎం వైఎస్ జగన్ అని చెప్పారు. గురువారం అనకాపల్లిలో జరిగిన సామాజిక సాధికార సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర కేబినెట్లో 25 మంది మంత్రులకుగాను 17 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలేనని, ఇతర అన్ని పదవుల్లోనూ ఈ వర్గాలకే సీఎం జగన్ ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ ఇవ్వనన్ని పదవులు, పథకాలు అందించి సామాజిక సాధికారత తీసుకొచ్చారన్నారు. బీసీలకు రూ.1.62 లక్షల కోట్లు, దళితులకు రూ.61 వేల కోట్లు, గిరిజనులకు రూ.20 వేల కోట్లను వెచ్చించారని తెలిపారు. అడవి బిడ్డ అయిన తనను ఉపముఖ్యమంత్రిని చేసి పక్కనే కూర్చోబెట్టుకున్న నాయకుడు జగనన్న అని కొనియాడారు. దళితులు, గిరిజనులు, బీసీలు, మైనారిటీలు ఎల్లవేళలా మంచిగా ఉండాలంటే మళ్ళీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని చెప్పారు. గిరిజనులు సాధారణంగా సౌమ్యంగా ఉంటారని, ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తే వారిపై ఒక్కొకరు ఒక్కో అల్లూరి సీతారామరాజులా పోరాడతారని హెచ్చరించారు.



అనకాపల్లి సామాజిక సాధికార యాత్ర సభలో ప్రసంగిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

### జగన్ చెప్పారంటే చేస్తారు: బూడి

చెప్పిన మాట తూచా తప్పకుండా చేసే సీఎం వైఎస్ జగన్ అని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చెప్పారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99.5% అమలు చేయడమే కాకుండా, చెప్పని అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను సీఎం జగన్ అమలు చేస్తున్నారని తెలిపారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అవ్వా తాతలకు వచ్చే నెల నుంచి రూ.3 వేల పింఛను అందించనున్నారన్నారు. బడుగు బలహీనవర్గాల పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించాలన్న ఆకాంక్షతో వారికి యూనిఫాం, నాణ్యమైన భోజనం, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్యాదీవెన వంటి పథకాలే కాకుండా అంతర్జాతీయ స్థాయి విద్యను అందిస్తున్నారని తెలిపారు. 45 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు మూడు విడతల చేయూత అందించారని, నాలుగో విడత సంక్రాంతి పండుగ తర్వాత అందించనున్నారని చెప్పారు.

### గర్వంగా మీ వద్దకు వచ్చాం: మంత్రి ధర్మాన

నాలుగున్నరేళ్ల పాలనలో మేనిఫెస్టోలో హామీలన్నీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నెరవేర్చడంతో.. బడుగు వర్గాలకు అందించిన సాధికారతను కాలర్ ఎగరేసి గర్వంగా చెప్పుకునేందుకు మీ ముందుకు వచ్చామని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు మహిళా సాధికారత కూడా నెరవేరిందన్నారు. ఈ ప్రభుత్వంలో స్త్రీని అత్యంత శక్తివంతురాలుగా చేసి, వారి ఖాతాల్లోకే సంక్షేమ పథకాల నగదు జమయ్యేలా చేశారన్నారు. తాను పస్తు ఉండి ఇంటిల్లిపాదికీ అన్నం పెట్టేదే స్త్రీ మూర్తి అని, ఇంటిలో ఇల్లాలి చేతిలో డబ్బులుంటే ఆ ఇంట్లో వెలుగులుంటాయని నమ్మిన సీఎం జగన్ అని చెప్పారు.

### అనేక కులాలకు గుర్తింపు: మంత్రి గుడివాడ

ఇప్పటివరకు గుర్తింపు లేని అనేక కులాలకు గుర్తింపు తెచ్చిన సీఎం జగన్ మాత్రమేనని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. నాలుగున్నరేళ్లలో అనకాపల్లి నియోజకవర్గంలో రూ.880 కోట్లతో సంక్షేమ పథకాలను అందించామంటే ఆ ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. 20 వేల మంది పేదలకు సొంతింటి కల నెరవేరిందన్నారు. జగనన్న పాలనలో ప్రతి పేదోడు తలెత్తుకు జీవిస్తున్నాడని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటే మన పిల్లల భవిష్యత్తు బావుంటుందని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు చెప్పారు. మాయలోడు చంద్రబాబు వలలో పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, అల్లూరి సీతారామరాజు ఆశయాలను నెరవేరుస్తూ సామాజిక న్యాయం సాధించిన ఘనత సీఎం జగన్‌దే అని ఎంపీ డాక్టర్ బి.వి. సత్యవతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయంలో చరిత్ర సృష్టించిన జగన్

## ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అక్కున చేర్చుకొన్న ముఖ్యమంత్రి

- ఈ వర్గాలను అభివృద్ధిలోకి తెచ్చి సామాజిక సాధికారత సాధించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్
- కేబినెట్ సహా అన్ని పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకే పెద్ద పీట
- మహిళలకు 50 శాతం పదవులు
- సీఎం జగన్ పాలన ఓ చరిత్రగా నిలిచిపోతుంది
- పామర్రు సామాజిక సాధికార బస్సుయాత్ర సభలో మంత్రి జోగి రమేష్



కృష్ణా జిల్లా పామర్రులో జరిగిన సామాజిక సాధికార యాత్ర సభలో ప్రసంగిస్తున్న ఎంపీ నందిగం సురేశ్

పామర్రు: సామాజిక న్యాయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే చరిత్ర సృష్టించారని మంత్రి జోగి రమేష్ చెప్పారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అక్కున చేర్చుకొని, అనేక కార్యక్రమాలతో ఈ వర్గాలను అభివృద్ధిలోకి తీసుకొచ్చి సామాజిక సాధికారత సాధించిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ఏ రాష్ట్రంలో, ఏ ముఖ్యమంత్రీ ఈ ఘనత సాధించలేదన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా గురువారం కృష్ణాజిల్లా పామర్రులో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కేబినెట్ సహా అన్ని పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సీఎం జగన్ పెద్ద పీట వేశారని, మహిళలకు 50 శాతం పదవులిచ్చారని అన్నారు. ఇది ఓ చరిత్రగా నిలిచిపోతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలు ఊపిరిగా ఉన్న సీఎం వైఎస్ జగన్‌ని ప్రజా క్షేత్రంలో ఎవరూ ఓడించలేరని, పవన్ కళ్యాణ్ షణ్ముఖ వ్యూహం, చంద్రబాబు, లోకేశ్, రామోజీ, రాధాకృష్ణతో కలిసి ఎన్ని వ్యూహాలు పన్నినా జగన్ ముందు పనిచేయవన్నారు. చంద్రబాబు బీసీలను ఓటు బ్యాంకుగానే వాడుకొన్నారని, సీఎం జగన్ నలుగురు బీసీలను రాజ్యసభకు పంపించి చరిత్ర సృష్టించారని చెప్పారు. రాజ్యసభ సీటిస్తానని ఎస్సీ వర్గానికి చెందిన వర్ల రామయ్యకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు.. అదే సీటును వంద కోట్లకు కనకమేడల రవీంద్రకుమార్‌కు అమ్ముకున్నారని తెలిపారు. ఇలా అడుగడుగునా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అవమానించిన చంద్రబాబును మరోసారి చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీలంటూ అక్కున చేర్చుకున్న సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలను కోరారు.

### ఉన్నత స్థితికి బడుగు వర్గాలు: మంత్రి నాగార్జున

మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ అంబేడ్కర్, పూలే, జగజ్జీవన్‌రామ్, సాహూ మహరాజ్, అబ్దుల్ కలామ్ వంటి మహనీయుల ఆలోచనా విధానాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలను ఉన్నత స్థితికి చేరుస్తున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కోసం లక్షల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీ చూడకుండా, రూపాయి లంచం లేకుండా పేదవారి చెంతకు సంక్షేమ పథకాలను చేరుస్తున్నారని అన్నారు. 31 లక్షల మంది పేద అక్కచెల్లెమ్మలకు ఇళ్ళ పట్టాలిచ్చి వారి కుటుంబాలకు గూడు కల్పించిన సీఎంగా దేశంలోనే రికార్డు సృష్టించారన్నారు. అంతర్జాతీయ స్థాయి విద్యను, అత్యాధునిక కార్పొరేట్ వైద్యాన్ని పేదవారికి అందిస్తున్న ఏకైక సీఎం జగన్ అని చెప్పారు. 2014లో 648 వాగ్దానాలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. పైగా, రుణాలు మాఫీ చేస్తానని రైతులు, మహిళలను మోసం చేశారని, ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఎందుకూ పనికిరారని అవహేళన చేశారని తెలిపారు. మన విలువలు కాపాడుకోవడానికి 2024లో తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

### బాబును ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఎప్పటికీ క్షమించరు : ఎంపీ సురేష్

సంక్షేమ పథకాలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సోమరిపోతులవుతారన్న చంద్రబాబును ఈ వర్గాలు ఎప్పటికీ క్షమించబోవని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ చెప్పారు. ఆరు లక్షల కోట్లు అక్రమంగా సంపాదించిన చంద్రబాబు సోమరిపోతు కాదా అని ప్రశ్నించారు. రెండెకరాల నుంచి లక్షల కోట్లు ఎలా సంపాదించారో చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు చెబితే వారు కూడా కోటీశ్వరులు అవుతారని అన్నారు. రూ.370 కోట్లు అవినీతికి పాల్పడిన చంద్రబాబు జైలుకు వెళితే టీడీపీ ఆందోళనలు చేయడం సిగ్గుచేటన్నారు. నిజం గెలవాలి అని చంద్రబాబు సతీమణి భువనేశ్వరి చెబుతున్నారని, నిజం గెలిస్తే చంద్రబాబు జీవితాంతం జైలులోనే ఉంటారని అన్నారు.

### బడుగులను అందలమెక్కిస్తున్న సీఎం జగన్: ఎంపీ మోపిదేవి

అనేక పథకాలతో రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలను సీఎం జగన్ అందలమెక్కిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదిగేలా కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ గతంలో పెన్షన్ కావాలంటే నాయకులకు దండాలు పెడితేనో, టీడీపీ కండువాలు కప్పుకుంటేనే మంజూరయ్యేదన్నారు. సెంటర్‌లో కనబడి దండం పెట్టకపోతే పెన్షన్ రద్దయ్యేదని చెప్పారు. సీఎం జగన్ పాలనలో కులం, మతం, రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, సింహాద్రి రమేష్‌బాబు, పేర్ని నాని, ముస్తాఫా, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక పాల్గొన్నారు.

# చైతన్య ప్రతీక

## రాష్ట్రంలో విజయవంతంగా సామాజిక సాధికార బస్సు యాత్ర

సాక్షి, అమరావతి/సాక్షి, అనకాపల్లి/పామర్రు/సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించేలా విప్లవాత్మక సంస్కరణలతో బడుగు, బలహీన వర్గాల్లో సీఎం వైఎస్ జగన్ తెచ్చిన చైతన్యానికి ప్రతీకగా సామాజిక సాధికార బస్సు యాత్ర సాగుతోంది. గురువారం పామర్రు, కావలి, అనకాపల్లిలో జరిగిన బస్సు యాత్రకు ప్రజలు అఖండ స్వాగతం పలికారు. శుక్రవారం పల్నాడు జిల్లా పెదకూరపాడు, మన్యం జిల్లా పార్వతీపురం, అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గాల్లో సామాజిక సాధికార యాత్ర జరగనుంది. పామర్రులో ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన బస్సు యాత్ర, సభకు ఇసకేస్తే రాలనంతగా ప్రజలు వచ్చారు. రోడ్లన్నీ జనంతో నిండిపోయాయి. అనకాపల్లిలో జరిగిన సామాజిక సాధికార యాత్ర, సభకు జనం ప్రభంజనమై కదలివచ్చారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి యాత్రను ప్రారంభించారు. కశింకోట మండలం తేగాడ మీదుగా అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియం వరకు యువత బైక్ ర్యాలీ నిర్వహించారు. తేగాడలో వైఎస్సార్ జగనన్న ఇళ్ల మెగా కాలనీని మంత్రులు ప్రారంభించారు. ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో రూ.65 లక్షలతో నాడు–నేడు కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సచివాలయ భవనం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభించారు. కావలిలో జరిగిన యాత్రకు ప్రజలు నీరాజనాలు పలికారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ యాత్రకు ఊహించని విధంగా ప్రజలు రావడంతో ప్రధాన కూడళ్లు, రోడ్లు నిండిపోయాయి.



కావలిలో జరిగిన సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం



# పెత్తందారీ వ్యవస్థపై జగన్

## చంద్రబాబు హయాంలో పెచ్చరిల్లిన పెత్తందార్లు

**ఆ వ్యవస్థను పెకలించివేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్**

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సీఎం వెన్నుదన్నుగా నిలిచారు
- రాజ్యాధికారంలో సముచిత స్థానం
- సీఎంగా జగన్ వచ్చాకే పేదల జీవితాల్లో వెలుగులు
- కావలి సామాజిక సాధికార సభలో మంత్రి సీదిరి అప్పలరాజు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాష్ట్రంలో చంద్రబాబు హయాంలో పెచ్చరిల్లిన పెత్తందారీ వ్యవస్థను సీఎం జగన్ సమూలంగా పెకలించివేశారని మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు వెన్నుదన్నుగా నిలవడమే కాకుండా రాజ్యాధికారంలో సముచిత స్థానం కల్పించారని అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అంటరానివారుగా చిత్రీకరించి పెత్తందార్ల కాళ్ల కింద ఉంచితే, సీఎం జగన్ అదే పేదలకు పట్టం కట్టారని తెలిపారు. కావలిలో గురువారం నిర్వహించిన సామాజిక సాధికార సభలో మంత్రి మాట్లాడారు. 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు విపరీతమైన అహంకారంతో మత్స్యకారులను, బీసీలను, ఎస్సీలను, ఎస్టీలను తీవ్రంగా అవమానించారని గుర్తు చేశారు. మత్స్యకారుల తోకలు కత్తిరిస్తానని, ఎస్సీ, ఎస్టీలుగా ఎవరూ పుట్టాలని కోరుకోరని బహిరంగంగా అవమానించడంతో పాటు బీసీలు జడ్జీలుగా పనికిరారని ఏకంగా లేఖ రాసిన దుర్మార్గుడు చంద్రబాబు అని తెలిపారు. ఆయన పదవీ కాలంలో పేదలకు, అట్టడుగు వర్గాలకు పనికివచ్చేలా ఒక్క పనీ చేయలేదన్నారు. జన్మభూమి కమిటీలనే అసాంఘిక శక్తులను పేదల నెత్తిన పెట్టి స్వైరవిహారం చేయించాడని అన్నారు. ప్రజలు బాబు పాలనను ఛీకొట్టి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అధికారం అప్పగించిన తరువాత పేదల జీవితాల్లో వెలుగులు వచ్చాయని చెప్పారు. రేషన్‌కార్డు, పింఛను, ఇంటి స్థలం, సంక్షేమ పథకాలు ఏది కావాలన్నా అర్హత ఉంటే చాలు నేరుగా వలంటీర్లు ఇళ్ళ వద్దకు వెళ్ళి అందిస్తున్నారని, ఈ ఘనత సీఎం జగన్‌దేనని చెప్పారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

### సామాజిక న్యాయానికి రోల్ మోడల్ జగన్ : ఎంపీ మస్తాన్‌రావు

సామాజిక న్యాయానికి, సాధికారతకు సీఎం వైఎస్ జగన్ దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచారని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. ఎనిమిది మంది రాజ్యసభ సభ్యుల్లో నలుగురు బీసీలు ఉన్నారన్నా, కేబినెట్‌లో 17 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలే ఉన్నారంటే అందుకు జగన్‌మోహన్ రెడ్డి దార్శనికతే కారణమన్నారు.

### అణగారిన వర్గాలను అక్కున చేర్చుకున్న ఘనత సీఎం జగన్‌దే: జూపూడి ప్రభాకర్

రాష్ట్రంలో అణగారిన వర్గాలను అక్కున చేర్చుకుని అందలం ఎక్కించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే సాధ్యమైందని ప్రభుత్వ సలహాదారు (సామాజిక న్యాయం) జూపూడి ప్రభాకర్ అన్నారు. గత ప్రభుత్వ హయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను అధికార మదంతో అణగదొక్కితే.., సీఎం జగన్ మాత్రం ఈ వర్గాలను ఆదరించి, అభివృద్ధిలోకి తెస్తున్నారని తెలిపారు.

### జగన్‌తోనే బడుగు, బలహీన వర్గాల సంక్షేమం: ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం సీఎం జగన్‌తోనే ప్రారంభమైందని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌ను మళ్ళీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు.

### కనకపట్నంగా మారనున్న కావలి: ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి

సీఎం వైఎస్ జగన్ పాలనలో కావలి కనకపట్నంగా మారనుందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి అన్నారు. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, దామవరం ఎయిర్‌పోర్టులతో నియోజకవర్గం రూపురేఖలు మారనున్నాయని తెలిపారు. పారిశ్రామిక ప్రగతి కూడా ఊపందుకుంటుందని వివరించారు.

### 21న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రారంభం

మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా ఈనెల 21న సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను ప్రారంభించనున్నట్లు మంత్రి అప్పలరాజు అన్నారు. ఈ హార్బర్ అందుబాటులోకి వచ్చిన తరువాత మత్స్యకారుల జీవితాల్లో గణనీయమైన మార్పులు వస్తాయన్నారు. రాష్ట్రం సాధిస్తున్న ప్రగతి, సామాజిక సాధికార బస్సు యాత్రలకు వస్తున్న స్పందనను చూసి టీడీపీ, ఆపార్టీకి వంతపాడుతున్న పచ్చమీడియాకు నిద్రపట్టడం లేదన్నారు.

### పేదల సంక్షేమమే సీఎం జగన్ అజెండా: ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సముచిత స్థానం కల్పించడంతో పాటు పేదల సంక్షేమమే ఏకైక అజెండాగా వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ తెలిపారు. రాష్ట్రంలో సామాజిక సాధికారతతో పాటు సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలంతా అండగా నిలిచి, రానున్న ఎన్నికల్లో 175 స్థానాలను బహుమానంగా అందించాలని ప్రజలను ఆయన కోరారు. వెనుకబడిన వర్గాలు ఎల్లవేళలా మంచిగా ఉండాలంటే మళ్లీ వైఎస్ జగనే ముఖ్యమంత్రి కావాలని హఫీజ్‌ఖాన్ అన్నారు.

ఎవరు ఆయన ప్రసన్నతను కోరుతూ, ఉదయం, సాయంత్రం తమ ప్రభువును ప్రార్థిస్తున్నారో, వారి సహచర్యంలోనే, సహనం వహించి ఉండు. ఇహలోక ఆడంబరాలను అపేక్షించి నీ దృష్టిని వారి నుండి దాటనివ్వకు.

– ఇస్లాం ధర్మం



సాక్షి

శుక్రవారం, 10 నవంబర్ 2023

# ఇది లోతైన సమస్య!

మేధ అవసరం. సవ్యంగా వాడితే ఆధునిక సాంకేతికత అందించిన కృత్రిమ మేధ (ఏఐ) కూడా అవసరాలు తీర్చవచ్చు. కానీ, దాన్ని అపసవ్యంగా వాడి, అసత్య ప్రచారానికీ, అసభ్య వీడియోలకూ వినియోగిస్తే ఏమవుతుందో నాలుగైదు రోజులుగా తాజా ఉదాహరణలతో చూస్తున్నాం. లిఫ్టులో అడుగిడుతున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సరైన ఓ బ్రిటీష్ ఇండియన్ మహిళ వీడియోను తీసుకొని, ఆమె ముఖం బదులు ప్రముఖ సినీ నటి రష్మికా మందన్న ముఖాన్ని తగిలించిన డీప్ ఫేక్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారి, వివాదం రేపింది. నటి కత్రినా కైఫ్ పైనా ఇలాగే మరో నకిలీ వీడియో బయటకొచ్చింది. పెరిగిన ఏఐ సాంకేతిక వినియోగంతో ఈజీగా మారి, ఇంటర్నెట్‌ను ముంచెత్తుతున్న ఈ డీప్ ఫేక్‌లపై మళ్ళీ చర్చ రేగింది. వ్యక్తిగత స్వేచ్ఛ, గోప్యత, గౌరవం మొదలు జాతీయ భద్రత దాకా అన్నిటికీ ముప్పుగా మారుతున్న ఈ సాంకేతికతకు ప్రభుత్వం ముకుతాడు వేయాల్సిన అవసరాన్ని తెరపైకి తెచ్చింది.

రకరకాల సాంకేతిక విధానాల ద్వారా బొమ్మలు, వీడియోలు, ఆడియోల్లో ఒక మనిషి స్థానంలో మరో మనిషి రూపాన్నీ, గొంతునూ అచ్చు గుద్దినట్టు ప్రతిసృష్టించి, డిజిటల్‌గా తిమ్మినిబమ్మిని చేయడమనే 'డీప్ ఫేక్' ఇప్పుడు ప్రపంచమంతటినీ పట్టిపీడిస్తున్న చీడ. నిజానికి, ఫోటో–షాపింగ్ ద్వారా బొమ్మలు మార్చే పద్ధతి చాలా కాలంగా ఉన్నదే. కానీ, శక్తిమంతమైన మెషిన్ లెర్నింగ్, కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఇట్టే బురిడీ కొట్టించేలా వీడియోలు, ఆడియోలు చేయడం డీప్ ఫేక్‌ను పదునైన అస్త్రంగా మార్చేశాయి. అసలు ఏదో, నకిలీ ఏదో కనిపెట్టేందుకు పలు పద్ధతులు లేకపోలేదు. అయితే, అసలు సంగతి వివరించేలోగా సోషల్ మీడియా పుణ్యమా అని నకిలీ సమాచారం క్షణాల్లో లోకాన్ని చుట్టేస్తోంది. చివరకు నాసిరకం డీప్‌ఫేక్‌లు సైతం జనం మనసులో అనుమానాలు రేపి, అసలు సిసలు సమాచారాన్ని వెనక్కి నెట్టేస్తున్నాయి. వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. పోనుపోనూ సాంకేతికత పదును తేరి, అందరికీ అందుబాటులోకి వస్తే, డీప్‌ఫేక్‌లు నైసు తేలతాయి. అప్పుడిక అసలు, నకిలీలలో తేడాలు పసిగట్టడం ఇంకా కష్టం.

ఇవాళ కంపెనీలు, రాజకీయ పార్టీలు, నేతలు తమకంటూ సొంత ఇమేజ్ సృష్టించుకోవడానికీ, పెంచుకోవడానికీ, చివరకు ప్రత్యర్థులపై బురదచల్లడానికి ఫేక్ న్యూస్‌ను ఆసరాగా చేసుకుంటున్న తీరు చూస్తున్నాం. ఫలితంగా, అవి జనం మానసిక స్థితిపై ముద్ర వేసి, వారు తీసుకొనే నిర్ణయాలను ప్రభావితం చేయడమూ జరుగుతోంది. సమాచారం కోసం ఆన్‌లైన్‌పై అధికంగా ఆధారపడడం, సామాన్యుల్లో సైతం ఇంటర్నెట్ వినియోగం పెరిగాక వచ్చిన కొత్త తలనొప్పులివి. బాట్లు, ట్రోల్స్, ప్రభావం చూపే ప్రచారాలు... ఇలా పేర్లు ఏమైనా, అన్నిటి పనీ ఒకటే! ఆన్‌లైన్‌లో తమకు కావాల్సినట్టు కథనాలు వండివార్చడమే! మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్స్ వగైరా ఆధునిక సాంకేతికతల పుణ్యమా అని త్వరలోనే పూర్తిగా ఏఐ సృష్టించిన వార్తా కథనాలు, పాడ్ కాస్ట్‌లు, డీప్ ఫేక్ చిత్రాలు, వీడియోలతో కూడిన డిజిటల్ ప్రపంచాన్ని మనం పంచుకోవాల్సిన పరిస్థితి. మనం ఊహించలేనంత స్థాయిలో, వేగంతో ఇవన్నీ డిజిటల్ ప్రపంచాన్ని ముంచెత్తనున్నాయి. ఓ అధ్యయనం ప్రకారం 2018 నాటికి కనిపెట్టిన డీప్‌ఫేక్‌లు 10 వేల లోపే! ఇవాళ ఆన్‌లైన్‌లో వాటి సంఖ్య లక్షల్లోకి చేరింది.

కొత్త కృత్రిమ మీడియా సమాచారం ఆందోళనకరం. నిరుడు ఉక్రెయిన్‌పై దాడిని సమర్థించుకొనేందుకు రష్యా డీప్ ఫేక్‌లను వాడే ప్రమాదం ఉందని పాశ్చాత్య దేశాలు అనుమానించాయి. ఈ ఏడాది మే నెలలో వైట్‌హౌస్ సమీపంలో పొగ వస్తున్న డీప్‌ఫేక్ చిత్రం దెబ్బకు స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. డీప్‌ఫేక్ కాకున్నా, రచయితల సమ్మె వేళ స్వర్గీయ తారల్ని తెరపై పునఃసృష్టించే పనికి హాలీవుడ్ స్టూడియోలు దిగడమూ నైతికతపై చర్చ రేపింది. సైబర్ ఆర్థిక నేరాలు, అసలును పోలిన నకిలీ సృష్టితో శీలహననం నుంచి దేశ భద్రత దాకా సాంకేతికత నీలినీడ పరుస్తోంది. సినీ తారలు ఇవాళ ఎదుర్కొన్న ఇబ్బంది సామాన్యులకు ఎదురవడానికి ఎంతో కాలం పట్టదు. ఈ ఏడాది ప్రపంచంలో 5 లక్షల డీప్‌ఫేక్ ఆడియో, వీడియోలు సోషల్ మీడియాలో షేరవుతాయని అంచనా. పైగా, డీప్‌ఫేక్ వీడియోల్లో 98 శాతం ఆడవారిపై చేసినవే. బాధిత ప్రపంచ దేశాల్లో 6వ స్థానం మనదే! ఆ మాటకొస్తే, 2020లోనే అజ్ఞాత సేవగా సాగిన 'డీప్ న్యూడ్' గురించి పరిశోధకులు బయటపెట్టారు. ఒక వ్యక్తి ఫోటోలను వారి అంగీకారంతో సంబంధం లేకుండా, క్రమం తప్పక అందించడం ద్వారా నకిలీ నగ్నచిత్రాలను సృష్టించే ఆ సర్వీస్‌పై రచ్చ రేగింది. పలు పాశ్చాత్య దేశాల్లో అరెస్టులు, దర్యాప్తులు, చట్టాల్లో మార్పులు జరిగాయి.

కాలంతో పాటు సాంకేతికత మారి, జనజీవితంపై దాడి చేస్తున్న సమయంలో మన ప్రభుత్వాలు అవసరమైన కట్టుదిట్టాలు, చట్టాలు చేయకపోవడం సమస్య. ఫిర్యాదు చేసిన 24 గంటల్లో సోషల్ మీడియా సంస్థలు సదరు మార్ఫింగ్ కంటెంట్‌ను తొలగించాలన్న రూలు ఇప్పటికే ఉంది. కానీ, డీప్ ఫేక్‌లను ముందే అరికట్టే చర్యలు అవసరం. అమెరికా లాంటి చోట్ల అరకొర చట్టాలతోనైనా ఆపే ప్రయత్నం జరుగుతోంది. బ్రిటన్‌లో డీప్‌ఫేక్ అశ్లీల వీడియోల తయారీ చట్టరీత్యా నేరం. చైనాలో ఏకంగా నిషేధమే ఉంది. వీడియోను మార్చినా, మార్పు చేసిన వీడియో అని రాయాల్సిందే. యూరోపియన్ యూనియన్ లాంటివీ కఠిన నియమాల రూపకల్పనకు కిందా మీదా పడుతున్నాయి. మన దేశంలోనూ అలాంటి ప్రయత్నం తక్షణమే జరగాలి. బాహ్య ప్రపంచంలో లానే వర్చ్యువల్ లోకంలోనూ వనితలను లక్ష్యంగా చేసుకొని, వారిపై సాగుతున్న ఈ హేయమైన దాడిని అడ్డుకుంటే అది సభ్య సమాజానికే అవమానం.

## గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.ద్వాదశి ఉ.11.22 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** హస్త రా.11.55 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** ఉ.6.54 నుండి 8.41 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.22 నుండి 9.05 వరకు, తదుపరి ప.12.06 నుండి 12.53 వరకు, **అమృతఘడియలు:** సా.5.24 నుండి 7.09 వరకు.

**సూర్యోదయం :** 6.05
**సూర్యాస్తమయం:** 5.23
**రాహుకాలం :** ఉ.10.30 నుండి 12.00 వరకు
**యమగండం :** ప.3.00 నుండి 4.30 వరకు

# చంద్రబాబు అవినీతి ప్రస్థానం

అభిప్రాయం



డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి

**"ఎక్కడి నీచు లెక్కడి హీనులెంతటి తులువలు / ఎంతటి భ్రష్టు లెచ్చటి దుష్టు లెక్కడి నష్టజాతకులీ నాయకులు / నా తెలుగు జాతికి శాపంగా దాపురించారో" అంటారు మహారథి. ఈ మాట అక్షరాలా మన నారా చంద్రబాబు నాయుడికి వర్తిస్తుంది. మధిర సుబ్బన్న దీక్షితులు రాసిన కాశీమజిలీ కథల్లో పాఠకులను భయపెట్టే ఒక మహావట వృక్షం ఉంటుంది. అంతకంటే భయంకరమైన అవినీతి వృక్షం తెలుగు జాతికి సంక్రమించింది. ఒకే పెరడులో పెరిగి శాఖోపశాఖలుగా విస్తరించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిని ఎదగనీయకుండా వ్యవస్థల్ని కూడా భయపెడుతున్న ఈ 'నారా' అవినీతి వృక్షం మూలాల్లోకి వెళ్లి ఒక్కసారి పరిశీలిద్దాం.**

చంద్రబాబుకు నారావారి పల్లెలో ఒక చిన్న పూరిల్లు, రెండెకరాల పొలం మాత్రమే ఉంది. అనుకోకుండా 1978లో కాంగ్రెస్ పార్టీ చీలిపోయి 'ఇందిరా కాంగ్రెస్' ఏర్పడింది. అప్పుడున్న పరిస్థితుల్లో ఇందిరాగాంధీ ఎవ్వరడిగినా టిక్కెట్ ఇచ్చింది. ఆ విధంగా 'నారా'వారు టిక్కెట్ సంపాదించి ఆమె ప్రభంజనంలో ఎమ్మెల్యేగా గెలిచాడు. అప్పుడతని నెల జీతం 350 రూపాయలు. పాకాల నారాయణస్వామి, గల్లా రాజగోపాల్ నాయుడు ఆర్థిక సాయం అందించడంతో ఎమ్మెల్యేగా గెలుపొందాడు. అయితే రాజకీయాల్లో సీనియారిటీ, సిన్సియారిటీ పనికి రాదనుకున్నాడు. మంత్రి కావాలనే ఆశతో అన్ని అడ్డదారులు తొక్కటం ప్రారంభించాడు. అమాయకుడైన అంజయ్యగారి అల్లుణ్ణి, పట్టుకొని, అతనిని ప్రలోభపెట్టి చేసి 1980లో మంత్రి పదవి కొట్టేశాడని ఆ రోజుల్లోనే ఒక కాంగ్రెస్ నాయకుడు ఆక్షేపించాడు. మంత్రిగా అతని జీతం 2,500 రూపాయలు. అదే విధానంలో సంజయ్ గాంధీతో పరిచయం పెంచుకున్నాడు.



ఇక మంత్రి పదవి చేపట్టిన దగ్గర్నుండి అతని అవినీతి యాత్ర ప్రారంభమైంది. తిరుపతిలో 1970–80లలోనే విష్ణుప్రియ హోటల్ కొన్నాడు. ఆ తరువాత భువనేశ్వరి కార్బైడ్ ఫ్యాక్టరీని ప్రారంభించాడు. సినిమాటోగ్రఫీ మినిస్టర్ అవ్వడంతో ఆ రోజుల్లో సినిమావాళ్ళ దగ్గర కూడా డబ్బులు కాజేసేవాడని స్వయంగా దాసరి నారాయణ రావుగారు నాతో చెప్పారు. ఆ పరిచయాలతోనే 1981లో ఎన్టీఆర్ కుమార్తె భువనేశ్వరితో అతని వివాహం జరిగింది.

### 'ఇంత డబ్బు నీకెక్కడిది?'

1982 ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించినపుడు ఇతడు కాంగ్రెస్‌లోనే ఉండి ఎన్టీఆర్‌ను ఓడిస్తానని ప్రగల్భాలు పలికాడు. తెలుగుదేశం పార్టీ 200 సీట్లతో గెలవటంతో అప్పటికప్పుడు పార్టీలో చేరతానని వచ్చేశాడు. అప్పటికే అతని మీద అనేక కథలు ప్రచారంలో ఉన్నందువల్ల ఎన్టీఆర్ తిరస్కరించారు. అప్పుడు గర్భిణిగా ఉన్న భువనేశ్వరిని ముందుపెట్టి ఎన్టీఆర్ మీద ఒత్తిడి తెచ్చి పార్టీలో చొరబడ్డాడు.

కార్యకర్తగా చేరిన చంద్రబాబు నంబర్ 2 పొజిషన్ కోసం అప్పటి వరకు ఆ స్థానంలో ఉన్న నాయకులందరినీ ఏదో ఒక వంకతో బయటకు పంపేశాడు. నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, జానారెడ్డి, ఉపేంద్ర, కె.ఇ. కృష్ణ మూర్తి, వసంత నాగేశ్వరరావు... వీరంతా ఎన్టీఆర్‌కు అత్యంత విశ్వాసపాత్రులుగా మెలిగినవారు. బయటకు వెళ్లాక చంద్రబాబు నీచ రాజకీయాన్ని గురించి తీవ్రంగా విమర్శ చేయటం గమనించదగిన అంశం. అప్పటినుండి పార్టీలో 'ఏకులా వచ్చి మేకులా' తయార య్యాడు. ఎన్టీఆర్‌కు రాజకీయ అవగాహన లేకపోవటంతో పార్టీ బాధ్యతనంతా అతనికి అప్పజెప్పటంతో పార్టీ వ్యవహారాలే కాక ప్రభుత్వంలో కూడా రాజ్యాంగేతర శక్తిగా తయారయ్యాడు. దానికి తోడు ఎన్టీఆర్ అతనిమీద ఉంచిన అపారమైన విశ్వాసంతో ఎవరు తనను కలిసినా 'బాబును కలవండి' అని చెప్పటంతో పార్టీలో, ప్రభుత్వంలో అతనికి హద్దు లేకుండా పోయింది. జూబ్లీహిల్స్‌లో 1,200 గజాలు కొని మంచి భవనం కట్టించాడు. ఆ గృహ ప్రవేశానికి ఎన్టీఆర్ గారిని కూడా ఆహ్వానించాడు. ఆ భవనం చూసి ఆశ్చర్యపోయిన ఎన్టీఆర్ 'ఇంత డబ్బు నీకెక్కడిది? ఎలా కట్టించావు?' అని అడిగితే దానికి సమాధానం చెప్పకుండా తప్పించుకున్నాడు.

### ఇంటా బయటా చర్చ

చంద్రబాబు అవినీతి మీద 'ఈనాడు' పేపరు ప్రభుత్వాన్ని అనేకసార్లు హెచ్చరించింది. బ్లాటింగ్ పురుషోత్తం (మద్రాసు) వద్ద రెండున్నర కోట్లు ముడుపులు తీసుకున్న విషయం పార్టీలో, బయటా పెద్ద చర్చనీయాంశమైంది. అప్పటికి నష్టాల్లో నడుస్తున్న 'విష్ణుప్రియ' హోటల్‌ను సి.ఎం. బలరామిరెడ్డికి బలవంతంగా అంటకట్టి, కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం అతనిని కడప జడ్పీ ఛైర్మన్‌గా చేశాడు. అదే విధంగా మూతపడివున్న భువనేశ్వరి కార్బైడ్ ఫ్యాక్టరీని రేణుకా చౌదరికి అంటగట్టి ఎన్టీఆర్‌ను బలవంతంగా ఒప్పించి రెండవసారి రాజ్యసభకు పంపించాడు.

1988లో హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్ ప్రకారం సాలీనా వ్యవసాయంపై వచ్చే ఆదాయం 36,000 రూపాయలుగా చూపించాడు. వ్యవసాయ భూమి తప్ప తనకు వేరే ఆస్తిపాస్తులుగానీ, ఆదాయ మార్గాలుగానీ లేవని వెల్లడించాడు. అప్పుడు భార్య భువనేశ్వరి ఆస్తి సుమారు 400 గ్రాముల బంగారం, 50,000 రూపాయల నగదు. తరువాత ఏ పదవిలో లేడు గనుక సంపాదించే అవకాశమే లేదు.

1

1989 ఎన్నికల్లో తన ఆదాయం 2,16,000, అగ్రికల్చర్ ఆదాయం 36,000గా చూపించాడు. 1992లో 14 కోట్ల 75 లక్షల పెట్టుబడి అంచనాలతో 'హెరిటేజ్ గ్రూపు' సంస్థను స్థాపించటం జరిగింది. దాని పెట్టుబడులకు కూడా పార్టీలో అసెంబ్లీ టిక్కెట్లు ఇప్పిస్తానని పార్టీ మనుషుల చేత లక్షల రూపాయల షేర్లు కొనిపించాడు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు లక్షల రూపాయల ముడుపులు తీసుకొని కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు అప్పజెప్పాడని నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి బహిరంగంగానే విమర్శించాడు.

నెల్లూరు జిల్లా బాలాయపల్లెలో 600 ఎకరాల్లో టేకు మొక్కలు నాటి వాటిని సొంతం చేసుకోవటమే కాకుండా, యానాం చుట్టుపక్కల బినామీ పేర్లతో కొన్ని వందల ఎకరాలు కొన్నాడని పార్టీ వాళ్ళే ఒకరికొకరు చెప్పుకున్న విషయం.

ఇక హెరిటేజ్ పబ్లిక్ ఇష్యూలలో ఆరున్నర కోట్ల రూపాయలు సమీకరించాడు. ఈ పరిశ్రమలో తనకు 76 లక్షల 15 వేల రూపాయల విలువ గల వాటాలున్నట్టు, భార్య భువనేశ్వరికి ఒక కోటి 21 లక్షల 31 వేల రూపాయల విలువైన వాటాలున్నట్టు, లోకేష్ పేర 3 లక్షల 15 వేల రూపాయల వాటాలు న్నట్టు 1994లో ప్రకటించాడు. అప్పటికే జూబ్లీహిల్స్‌లో ఒక భవనం, పంజాగుట్టలో ఒక భవనం ఉన్న విషయం గమనించాలి. ఏ పదవీ లేకుండా 1992 నాటికే అతని కుటుంబ ఆస్తులు పెరిగాయన్నది స్పష్టంగా తెలుస్తున్నది.

### వెన్నుపోటు తర్వాత లేని హద్దు

1995 ఆగస్టు నెలలో ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి పదవి నుండి దించేసి సెప్టెంబర్ 1వ తేదీన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుండి అతని ఆస్తులు ఆకాశమే హద్దుగా పెరిగిపోవటం, దేశంలోనే నంబర్‌వన్ స్థాయి అవినీతి పరునిగా విమర్శలు రావడం జరిగింది. తెహల్కా డాట్‌కామ్ మొదలు అనేకమంది రాజకీయ నాయకులు, మీడియా అతని అవినీతిని ప్రశ్నించటం జరిగింది.

1995లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యిన దగ్గర్నుండి పారదర్శకత, నిజాయితీ గురించి ఎక్కువగా ఉపన్యాసాలివ్వడం ప్రారంభించాడు. శాసనసభలో ఎథిక్స్ కమిటీ ఏర్పాటుకు దోహదకారులైన తోటి శాసన సభ్యుల వలే తను కూడా తన ఆస్తిపాస్తుల వివరాలు, కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలు ప్రతి సంవత్సరం ప్రకటించడం మొదలు పెట్టాడు. అతని ప్రకటన ప్రకారం చంద్రబాబు కుటుంబ ఆస్తుల విలువ 30 కోట్ల వరకు చేరింది.

ఆ ప్రకటనలో నెల్లూరు జిల్లా బాలాయపల్లి మండలం 'నిందలి గ్రామం'లో తన పేర 26.43 ఎకరాలు, భార్యకు 10.23 ఎకరాలు, కుమారునికి 9.32 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్టు ప్రకటించాడు. వివిధ కంపెనీలలో కుమారుడికి ఒక కోటి 67 లక్షల 15 వేల రూపాయల విలువగల వాటాలు, భార్య భువనేశ్వరి పేరున మొత్తం 3 కోట్ల 4 లక్షల 1 వేయి రూపాయల విలువ గలిగిన వాటాలు, తనకు ఒక కోటి 40 లక్షల 15 వేల 65 రూపాయల విలువ కలిగిన వాటాలు ఉన్నట్లు చెప్పాడు. భవనాలు, వాహనాలు, బ్యాంక్ బ్యాలెన్స్‌లు మొదలైన వివరాలు కూడా వెల్లడి చేశాడు. వాటి విలువను తక్కువగా చూపించడం గమనార్హం. 1994లో ప్రకటించిన హెరిటేజ్ డైరీ ప్రాస్పెక్టస్‌లో కూడా తనకు వేరే కంపెనీలతో లావాదేవీలు గానీ ఇతరత్రా ఆదాయ వనరులు గానీ లేనట్లు ప్రకటించి, కంపెనీల రిజిస్ట్రార్ సమక్షంలో అంతకుముందు తాను ఆర్థికపర, క్రిమినల్ నేరారోపణలను ఎదుర్కొనలేదని పేర్కొన్నాడు. మరి 1988లో సాలీనా తన గరిష్ఠ ఆదాయం లక్షన్నర రూపాయలే అని చెప్పిన పెద్ద మనిషికి ఒక్కసారిగా ఇన్ని ఆస్తులు అకస్మాత్తుగా ఎలా పెరిగాయి? ఆనాటి ప్రశ్నకు ఈరోజు సీఐడీ కేసుల ద్వారా సమాధానం లభించింది.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ ఛైర్‌పర్సన్

### ఆస్తులు ఎలా పెరిగాయో సంజాయిషీ ఇవ్వాలి!

చంద్రబాబు పేర్కొన్న ఆస్తిపాస్తులు ఎలా వచ్చాయో ప్రజలకు సంజాయిషీ ఇవ్వాల్సిందిగా అప్పటి పీసీసీ అధ్యక్షులు డాక్టర్ రాజశేఖర రెడ్డిగారు డిమాండ్ చేయటం జరిగింది. అతడిని ప్రాసిక్యూట్ చేసేందుకు అనుమతించాల్సిందిగా 1999 జూన్ 5న రాజశేఖర రెడ్డి నాయకత్వంలో పలువురు కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర గవర్నర్‌కు ఒక విజ్ఞాపన పత్రం సమర్పించారు. నిజానికి 90 మంది శాసన సభ్యులకు నాయకుడైన రాజశేఖర రెడ్డి గారి విజ్ఞాపనకు గవర్నరు ప్రతిస్పందించటం కనీస ధర్మం. అప్పటికే ప్రతి వ్యవస్థను తనకు అనుకూలంగా మార్చుకోవటంలో చంద్రబాబు సిద్ధహస్తుడయ్యాడు. గవర్నర్ మారు మాట్లాడలేదు.

గత్యంతరం లేని పరిస్థితిలో 1999 జూలై 12వ తేదీన హైకోర్టును ఆశ్రయించి ముఖ్యమంత్రిని ప్రాసిక్యూట్ చేసేందుకు చట్టప్రకారం అవసరమైన అనుమతి ఇవ్వాల్సిందిగా గవర్నర్‌ను ఆదేశించాలని కోరారు. అందుకు హైకోర్టు 1999 నవంబర్ 2వ తేదీన ఒక సుదీర్ఘ తీర్పులో తన నిస్సహాయతను వ్యక్తం చేస్తూ దరఖాస్తును కొట్టేసింది. గవర్నర్ గారి పదవీ బాధ్యతల నిర్వహణ మీద సమీక్ష జరిపే అధికారం రాజ్యాంగం ప్రకారం కోర్టులకు ఉండదని ఆ జడ్జిమెంట్ సారాంశం.

హైకోర్టు తీర్పు మీద (నేడు టీడీపీ పార్టీలో ఉన్న) కన్నా లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ సీనియర్ లీడర్ 'ఆమోస్' గార్లు సుప్రీం కోర్టుకు అప్పీల్ చేశారు. అయినప్పటికీ సుప్రీంకోర్టు హైకోర్టులోనే తేల్చుకోమని ఆ కేసు కొట్టేసింది. దాని మీద వారు హైకోర్టులో ఏ కేసు వేసినప్పటికీ తమకు న్యాయం జరగట్లేదనీ, చంద్రబాబుకు అనుకూలంగా తీర్పులొస్తున్నాయనీ నివేదించినప్పటికీ అత్యున్నత న్యాయస్థానం వినిపించుకోలేదు. అడ్వకేట్ జనరల్ రామచంద్రరావు ఈ కేసును వాదిస్తూ, రాష్ట్ర హైకోర్టు మీద చంద్రబాబు నాయుడి ప్రభావం పనిచేస్తున్నదంటూ బ్రిటన్‌లోని 'ససెక్స్' విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ జేమ్స్ మైనర్ ఇచ్చిన రిపోర్టును ప్రస్తావించినా బెంచ్ తన అభిప్రాయాన్ని మార్చుకోలేదు.

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

# శిశువుల చిత్రనిద్రలో బాంబుల చప్పుడు

తూర్పు తీరం



కె.ఎన్. మల్లీశ్వరి

ఒళ్ళంతా బూడిద వర్ణం నిండిపోయిన ఆ బాలుడు గూడు చెదిరిన పిట్టలా రోడ్డుమీద అయోమయంగా గిరికీలు కొడుతున్నాడు. భయమో, ఏడుపో, ఆందోళనో, వెతుకులాటో తెలీని ఆ పదేళ్లవాడిని ఎవరో ఆపి, ఏదో అడుగుతున్నారు. తన ఖాళీచేతుల వంక చూసుకుంటూ, "ఇపుడే బాల్ ఇద్దామని వచ్చాను, వాడు కారుకింద దాక్కున్నాడు. ఇంతలో మాకు దగ్గరలో బాంబు వేశారు వాళ్ళు. మా మేనల్లుడి వీపుకి గాయం అయింది. వాడిని మోసుకుని ఇంటికి వెళ్ళాను. మా పొరుగువాళ్ళు అక్కడికి వచ్చారు. వాళ్ళకి బుజ్జి బాబు ఉన్నాడు. వాడి తలంతా పగిలిపోయి మెదడు బైటకి వచ్చింది. మేము ఎలా బతకాలి, ఇది జీవితం కాదు" మాటల శిథిలాలను వదిలి మళ్ళీ పరుగందుకున్నాడు.

శోక సముద్రపు అలలా, తీరంలాంటి తండ్రి గుండెకి తలని మోదుతూ ఎగిరెగిరి పడుతున్నది ఎనిమిదేళ్ళ పిల్ల. "మా తాతయ్యని, నాన్నమ్మని, చిన్నాన్నని, వాళ్ళ పిల్లల్ని కూడా చంపేశారు. వాళ్ళు అమరులయ్యారట, కానీ మా అమ్మని తమ్ముడిని ఎలా చంపుతారు, అమ్మ లేకుండా నేనుండలేను" ఆ చిన్న గొంతులో ఎవరం వినగూడని ఉద్వేగం.

లోకపు భయం అంతా ఒకముద్దలా మార్చి రెండు కళ్ళలో కూరినట్లు, ఆసుపత్రి బల్లమీద కూర్చున్న రెండు మూడేళ్ల చిన్నవాడు లోకపు నాగరికతని ముక్కలు ముక్కలు చేసేశాడు. వాడి పసినిద్రని చెల్లాచెదరు చేసిన బాంబుదాడి బీభత్సం అంతా ఆ విప్పార్చిన కళ్లలో కనిపించింది. అది చూసి తట్టుకోలేని డాక్టర్ వాడిని దగ్గరికి తీసుకుని "నాన్న దగ్గరికి తీసుకువెళ్లనా?" అనడగగానే భయం బద్దలయి, కుళ్ళి కుళ్ళి ఏడ్చాడు.

పాలస్తీనా మీద ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధంలో ఇప్పటి లెక్కల ప్రకారం దాదాపు అయిదు వేలమంది పాలస్తీనా చిన్నారులు చనిపోయారు. ప్రతి పది నిమిషాలకూ ఒక చిన్నారిని మరణంలోకి నెట్టి వేస్తున్నది మాయదారి యుద్ధం. గాయపడినవారి లెక్కకి అంతే లేదు. శిథిలాల కిందన, రోడ్ల మీదా, ఆసుపత్రులలో, శిబిరాలలో నెత్తురోడుతున్న పిల్లలు... పిల్లలు... పసికూనలు! ఏడుస్తూ అరుస్తూ, కాళ్లతో చేతులతో అందరినీ విసిరికొడుతూ, భయంతో నక్కి నక్కి దాగుతూ, ప్రతినలు పూనుతూ, అయినవారి శవయాత్రల్లో కక్కటిల్లిపోతూ, ఆసుపత్రుల్లో కింక పెడుతూ, శూన్యంలోకి చూస్తూ, నిశ్చేష్టులవుతూ, లోకపు నిర్దయని ఛీత్కరిస్తూ – పాలస్తీనా బాల్యం, హృదయమున్నవారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది. బిడ్డ గుక్కపట్టి ఏడిస్తేనే కిందుమీదులయ్యే సున్నితమైన పెంపకాల మధ్య ఈ సామూహిక రోదనలు వినడం అత్యంత విషాద సందర్భం. ఇజ్రాయెల్‌కూ, తమ మత ప్రయోజనాలకూ కొమ్ము కాసే ఒక తరహా మీడియా, పసిపిల్లల బాధాకర వీడియోలను నటనలుగా వక్రీకరిస్తున్నది. వేలాది పిల్లల ఆర్తనాదాలలోని సహజత్వాన్ని పరీక్షకు పెట్టేంత బండబారిపోయామా!

లోకంలో ఎక్కడైనా పిల్లల భద్రతకి అన్నిటికన్నా ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. ఎందుకంటే భావి పౌరుల ఎదుగుదలని బట్టే సమాజపు ఎదుగుదల ఉంటుంది కనుక. పిల్లల మనసు తెల్ల కాయితం లాంటిది. దాని మీద వారు తొలిగా అమ్మ, నాన్న, తోబుట్టువుల బొమ్మలు గీసుకుంటారు. ఆ మూలన సూర్యుడు, దానిమీద అడ్డంగా ఎగురుతున్న రెండు పక్షులు, ఒక స్కూలు, నలుగురు స్నేహితులు, కాసిన్ని ఆటపాటలు. ఇంతకి మించిన భారాన్ని వారి చిట్టి మనసులు మోయలేవు. ప్రపంచవ్యాప్తంగా జాతి, వర్ణ, కుల, సామాజిక, ఆర్థిక, ఇతరేతర వివక్షలకి తగిలిన గాయాలను పిల్లలు శతాబ్దాలుగా మోసుకు తిరుగుతున్నారు. వీటికి అదనం యుద్ధాల వంతు. ఇపుడు లక్షలాది పాలస్తీనా చిన్నారుల తెల్లకాయితాల మీద యుద్ధం – ఎరుపు, బూడిద రంగుల హర్రర్ వాల్వీయ్‌ను చిత్రిస్తుంది.



వేలాది చిన్నారుల్లో, వారి మొహాల్లో, హావభావ కవళికల్లో కొట్టొచ్చినట్లు కనపడుతున్నవి, షాక్, ట్రామా. ఇవి సబ్ కాన్షియస్ మీద వేసే ముద్రలు సామాన్యమైనవి కావు. కూడూ, గూడూ, దుస్తులూ హాయిగా అమిరాక కూడా మన అభిప్రాయాలు, విశ్వాసాలే గొప్పవని నమ్మి, వాటిని గెలిపించడం కోసం ఎంతకైనా తెగించే నాగరిక లోకమిది. ఇక బతుకే ఊగిసలాటలో పడిన పసిపిల్లలు, భవిష్యత్తులో శాంతి కాముకులవుతారని నమ్మగలమా! రక్తపాతం సృష్టించిన వారు పశ్చాత్తాపంతోనో, తమ ప్రాణాల మీది తీపితోనో శాంతి మంత్రం జపించవచ్చు గాక. కానీ బాధితులను శాంతిగా ఉండమని చెప్పడమంత లౌక్యం, అమానుషం మరొకటి ఉండదు.

పిల్లల విషయంగా పాలస్తీనా భవిష్యత్తులో ఎదుర్కోబోతున్న సమస్యలు రెండు. మానసిక కల్లోలాలను అదుపు చేసుకోలేక పిల్లలు స్వీయహింసకి పాల్పడడం, లేదా ఇతరుల పట్ల, ముఖ్యంగా తమని వేధించినవారి పట్ల హింసాత్మకంగా ప్రవర్తించడం. కుక్కలు, తూనీగలు, పురుగులు, పిట్టల వంటివాటిని– పిల్లలు తెలిసీ తెలియక హింసిస్తుంటారు. ప్రాణుల పట్ల దయగా ఉండా లని రేపుమాపు ఎవరైనా బోధించబోతే వారు తప్పక ఒక ప్రశ్న అడుగుతారు, 'పాలస్తీనా ప్రజలు ప్రాణులు కారా?' అని. ఇంత నలుగుడు పడి మనమేమి చేయగలం? నాలుగు కొవ్వొత్తులు, ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలపడం, నాలుగు అక్షరాలు రాయడం, మీతో మేమున్నామని పాలస్తీనీయులకు తెలపడం, నలుగురు కూచుని నవ్వేవేళల –యుద్ధంతో ఛిద్రమవుతున్న బాలలు తలపున పడి చాటుగా కళ్ళు తుడుచుకోవడం తప్ప, మనమేమి చేయగలం!

వ్యాసకర్త జాతీయ కార్యదర్శి, ప్రరవే
malleswari.kn2008@gmail.com

# యుగ యుగాల ప్రాధాన్యం

దీపం పరబ్రహ్మ స్వరూపం. జ్ఞానానికి చిహ్నం. నిర్లక్ష్యం అనే చీకటిని పారదోలే దివ్య జ్యోతి. దీపావళి అంటే దీపాల వరుస. దీపకాంతి చీకటిని పారదోలినట్టే, జ్ఞానం నిర్లక్ష్య ధోరణిని నిర్మూలిస్తుంది. అందుకే అన్నింటా విలువైన జ్ఞాన సముపార్జన కోసం, అన్ని పవిత్ర సందర్భాల్లోనూ మన ఆలోచనలకు, పనులకు సాక్ష్యంగా జ్యోతి వెలిగిస్తాం. ఏ శుభకార్యం మొదలుపెట్టినా ముందుగా జ్యోతి వెలిగించి ప్రారంభించే సంప్రదాయం మనది. దీపపు కుందిలో పోసే నెయ్యి లేదా నూనె, వత్తి మనలోని కోరికలు, అహంభావ ధోరణులకు సంకేతం. భగవంతుని ముందు దీపం వెలిగించగానే మనలోని కోరికలు నెమ్మదిగా ఆవిరవుతూ, అహం కాలిపోతూ ఉంటుందని అర్థం చేసుకోవాలి.

భారతీయ సంప్రదాయంలో దీపానికి విశేష ప్రాధాన్యం ఉంది. నిజానికి దీపావళి మూడు రోజుల పండుగ. కొన్నిచోట్ల ఈ పండుగను ఐదు రోజులు కూడా జరుపుకుంటారు. ఆశ్వయుజ మాసం కృష్ణపక్షంలో వచ్చే ఈ పండుగ మొదటిరోజు నరక చతుర్దశి, రెండో రోజు దీపావళి, మూడో రోజు బలిపాడ్యమిగా జరుపుకుంటారు. ఐదు రోజులు పండుగ చేసుకునే వారు ధనత్రయోదశి, నరక చతుర్దశి, దీపావళి, బలిపాడ్యమి, యమ ద్వితీయ.. ఇలా జరుపుకుంటారు. జ్ఞానానికి, ఐశ్వర్యానికి, ఆనందానికి ప్రతీకగా నిలిచే జ్యోతి మహాలక్ష్మి స్వరూపం. అలాంటి దీపావళి నాడు జ్యోతిని లక్ష్మీదేవిలా భావించి గృహిణులు లక్ష్మీపూజ నిర్వహిస్తారు.

ఆశ్వయుజ శుక్ల చతుర్దశిని నరక చతుర్దశిగా జరుపుకొంటారు. నరకాసుర సంహారానికి గుర్తుగా ఆశ్వయుజ బహుళ అమావాస్యను ఆనందోత్సాహాల మధ్య దివ్వెల వెలుగుల దీపావళి పండుగ జరుపుకుంటున్నారు. టపాకాయలు కాలుస్తూ, మిఠాయిలు తిని బంధుమిత్రులతో సరదాగా, ఆనందంగా గడుపుతారు.

దీపావళి నాడు మహాలక్ష్మీదేవిని పూజించి అర్చిస్తారు. దీపావళి పర్వదినాన ప్రత్యేకించి లక్ష్మీదేవిని పూజించడానికి కారణాలు వివరించే పలు పురాణ గాథలు ఉన్నాయి. ఏ ఇంట్లో దీపావళి నాడు దీపం వెలిగించి లక్ష్మీదేవిని పూజిస్తారో ఆ ఇంట దేవి స్థిరంగా ఉంటుందనేది నమ్మకం.

శ్రీమహా విష్ణువు వామనావతారుడై కృతయుగంలో రాక్షసరాజు బలి చక్రవర్తిని పాతాళానికి అణచివేశాడు. అది బలి పాలన అంతమైన రోజు. త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు రావణాసురుణ్ణి వధించి తిరిగి ఆ రోజు అయోధ్యలో ప్రవేశించిన సుదినం. ద్వాపర యుగంలో నరకాసురుణ్ణి వధించిన రోజు. కలియుగంలో విక్రమశక స్థాపకుడైన విక్రమార్కుడు పట్టాభిషిక్తుడైన రోజు. ఈ నాలుగు యుగాలలో సంభవించిన విజయాలకు సూచికగా దీపావళి పర్వదినం జరుపుకుంటున్నాం.

– నందిరాజు రాధాకృష్ణ, సీనియర్ జర్నలిస్ట్ । 98481 28215

## ఎన్‌పీఎం పరీక్షల ఫలితాల రీకౌంటింగ్‌కు 14 వరకు గడువు

**సాక్షి, అమరావతి:** జనరల్ నర్సింగ్, మిడ్‌వైఫరీ, నర్సింగ్ ప్రాక్టీషనర్ ఇన్ మిడ్‌వైఫరీ(ఎన్‌పీఎం) కోర్సుల పరీక్షల ఫలితాలను బుధవారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) కార్యాలయం విడుదల చేసింది. రీ–కౌంటింగ్ కోసం అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు విధించారు. రీ–కౌంటింగ్ కోరుకునే అభ్యర్థులు పేపర్‌కు రూ.100 చొప్పున చెల్లించాలి. ప్రభుత్వాస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు, నర్సుల్లో నైపుణ్యాల పెంపునకు ఎన్‌పీఎం కోర్సును వైద్యశాఖ ప్రారంభించింది. ఈ కోర్సులో భాగంగా ప్రభుత్వాస్పత్రుల్లోని 60మంది స్టాఫ్ నర్సులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం పరీక్షలు నిర్వహించారు.

# జగనన్న ఆరోగ్య సురక్ష

31 వ రోజు

నిర్వహించిన మొత్తం శిబిరాలు
**12,240**

నమోదైన ఓపీలు
**59,30,972**

నిర్వహించిన వైద్య పరీక్షలు
**6,43,86,724**

మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు రిఫర్ చేసినవారి సంఖ్య
**86,109**


నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఓపీ తీసుకుంటున్న ప్రజలు


పల్నాడు జిల్లా నరసరావుపేట ప్రకాష్‌నగర్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువు-2 సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం


ఎన్టీఆర్ జిల్లా విజయవాడ 27వ డివిజన్ దుర్గాపురంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

# కనీస జ్ఞానం లేకుండా రాస్తే ఎలా?

- సీఎంవో పేరు ఎవరైనా చెబుతారా
- రాజకీయంగా బురద జల్లేందుకే ఇసుకపై 'ఈనాడు' అసత్య కథనాలు
- దానిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం
- గనులశాఖ సంచాలకులు వీజీ వెంకటరెడ్డి


ఇసుకకు టెండర్ పెట్టింది
సీఎంవోనా?

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో పారదర్శకంగా నిర్వహిస్తున్న ఇసుక గనులపై దురుద్దేశ్యంతో ప్రభుత్వంపై బురద జల్లుతూ తప్పుడు కథనాలు ప్రచురిస్తున్న ఈనాడు దిన పత్రికపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు రాష్ట్ర గనులశాఖ సంచాలకులు వీజీ వెంకటరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఇసుక ఆపరేషన్స్‌పై ఆ పత్రిక ''ఇసుకకు టెండరు పెట్టింది సీఎంఓనా?'' అంటూ ప్రచురించిన కథనం పూర్తిగా అవాస్తవమని గురువారం ఒక ప్రకటనలో ఆయన ఖండించారు. అనుమతుల్లేకుండానే పలు జిల్లాల్లో అక్రమ దందా అంటూ అర్థంలేని రాతలు రాయడంపై ఆయన మండిపడ్డారు. నిజానికి.. ఇసుకపై రాష్ట్ర ప్రభుత్వం ఒక పారదర్శక విధానాన్ని అమలుచేస్తోందని, దానిపై అపోహలు కలిగించేలా ఇసుక తవ్వకాలు చేసే వారు సీఎంఓ పేరు చెబుతున్నారంటూ పొంతనలేని అంశాలతో అసత్య కథనాన్ని వండివార్చడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు.

**మళ్లీ టెండర్లు అయ్యేవరకూ జేపీనే..**

గతంలో రాష్ట్రవ్యాప్తంగా మూడు ప్యాకేజీల్లో ఇసుకకు టెండర్లు నిర్వహించామని.. ఈ టెండర్లలో జేపీ సంస్థ సక్సెస్‌ఫుల్ బిడ్డర్‌గా ఎంపికైన విషయాన్ని వెంకటరెడ్డి గుర్తుచేశారు. ఈ సంస్థ ఆధ్వర్యంలోనే గత రెండేళ్లుగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, తిరిగి టెండర్లు నిర్వహించే వరకు ఇదే సంస్థ రాష్ట్రంలో ఇసుక ఆపరేషన్స్ నిర్వహిస్తుందన్నారు. మరోవైపు.. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎంఎస్‌టీసీ ద్వారా ఇసుక ఆపరేషన్స్ కోసం మరోసారి టెండర్ల ప్రక్రియ జరుగుతోందని, అప్పటివరకు పాత కాంట్రాక్టింగ్ ఏజెన్సీ ద్వారానే ఇసుక ఆపరేషన్స్ జరుగుతాయని, గతంలోనూ ఇదే విషయాన్ని స్పష్టంగా చెప్పినా అవే తప్పుడు కథనాలను ప్రచురించడం ఈనాడు దురుద్దేశ్యాన్ని తెలియజేస్తోందని వెంకటరెడ్డి పేర్కొన్నారు.

**అభూతకల్పనలతో రాయొచ్చా?..**

ఇక వర్షాకాలంలో ఇసుక ఆపరేషన్స్ నిలిచిపోయినందున ఎండాకాలంలో జేపీ సంస్థ ద్వారా తవ్వి, స్టాక్ యార్డ్‌లలో నిల్వచేసిన ఇసుక విక్రయాలు కొనసాగుతున్నాయన్నారు. అలాగే, తిరిగి ఇసుక తవ్వకాలు చేసేందుకు వీలుగా అనుమతి ఉన్న రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు పాత కాంట్రాక్టింగ్ ఏజెన్సీ సిద్ధమవుతోందని, దీన్ని వక్రీకరిస్తూ బయటి వ్యక్తులు ఎవరో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని, సీఎంఓ నుంచి తమకు అనుమతి ఉందని వారు చెబుతున్నారంటూ ఈనాడు అభూత కల్పనలతో కథనాన్ని ప్రచురించడం ఎంతవరకు సమంజసమంటూ ఆయన ప్రశ్నించారు. ఇసుక ఆపరేషన్స్‌కు గనుల శాఖ నుంచి అనుమతులు మంజూరవుతాయని.. మైనింగ్ రంగంలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఇది తెలుసునన్నారు. అటువంటిది సీఎంఓ అనుమతితో ఇసుక తవ్వుతున్నామని ఎవరైనా ఎలా చెబుతారని, ఒక్క ఈనాడుకు మాత్రమే ఇలా చెబుతున్నారా? అంటూ ఆయన ప్రశ్నించారు. ఒక అంశంపై రాసే సందర్భంలో కనీస పరిజ్ఞానం కూడా లేకుండా అసత్య కథనాలను ప్రచురించడాన్ని ఆయన తప్పుబట్టారు.

**గతంలోని అక్రమాలు ఈనాడుకు కనిపించలేదా?**

గతంలో ఉచిత ఇసుక విధానం పేరుతో పెద్దఎత్తున ఇసుక మాఫియా జేబులు నింపుకున్న రోజుల్లో ఈనాడుకు ఆ అక్రమాలు కనిపించలేదా అంటూ వెంకటరెడ్డి ప్రశ్నించారు. సీఎం జగన్ అత్యంత పారదర్శకంగా ఇసుక విధానాన్ని తీసుకొచ్చి, ప్రజలకు అందుబాటు ధరలో, వర్షాకాలంలోనూ ఇసుక కొరతలేకుండా ఇసుకను అందిస్తుంటే ఈనాడు తట్టుకోలేక తప్పుడు వార్తలను వండివారుస్తోందన్నారు. నిజానికి.. ఎలాంటి విమర్శలకు అవకాశంలేకుండా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ, మినీరత్నగా గుర్తింపు పొందిన ఎంఎస్‌టీసీ ద్వారా ఇసుక టెండర్లు నిర్వహిస్తున్నామని.. ఆసక్తి ఉన్న ఎవరైనా ఈ టెండర్లలో పాల్గొనేందుకు అవకాశముందని ఆయన పేర్కొన్నారు. వాస్తవాలిలా ఉంటే.. జిల్లాల్లో అక్రమ ఇసుక దందా జరుగుతోందని, పులివెందుల నేత సోదరుల ఆధ్వర్యంలో తవ్వకాలు జరుగుతున్నాయని.. జిల్లాకో ఇన్‌చార్జిని నియమించారంటూ ఈనాడు అబద్ధాలను పోగేసి అవాస్తవాలతో కూడిన కథనాన్ని ప్రచురించిందన్నారు. ఇకనైనా ఇటువంటి తప్పుడు కథనాలను మానుకోకపోతే ఈనాడుపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



# పశువుల రీసైక్లింగ్‌కు ఆస్కారమే లేదు

**ఈనాడు కథనానికి పశుసంవర్థక శాఖ ఖండన**

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో పశువుల రీ సైక్లింగ్‌కు ఏమాత్రం ఆస్కారంలేదని పశుసంవర్థక శాఖ డైరెక్టర్ డాక్టర్ రెడ్నం అమరేంద్రకుమార్ స్పష్టంచేశారు. జగనన్న పాల వెల్లువ పథకం కింద వైఎస్సార్ చేయూత లబ్ధిదారులు చేసిన పశువుల కొనుగోళ్లలో ఎలాంటి కుంభకోణాలు జరగలేదని గురువారం ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ స్కీంపై అవగాహనలేకుండా కొన్ని రాజకీయ పార్టీల నేతలు ప్రకటనలు ఇవ్వడం.. వాటి ఆధారంగా కొన్ని పత్రికలు ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకుని కనీసం క్రాస్‌చెక్ కూడా చేసుకోకుండా దుష్ప్రచారం చేయడం సరికాదని ఆయనన్నారు. చేయూత పథకం ద్వారా లబ్ధిపొందిన వారిలో ఎవరైతే పాడి పశువుల యూనిట్లు కావాలని దరఖాస్తు చేసుకున్నారో, వారికి మాత్రమే పశువుల కొనుగోలు కోసం రుణాలు మంజూరు చేశారన్నారు. ఎస్‌ఎల్‌బీసీ సమావేశాల్లో ప్రభుత్వపరంగా చేసిన విజ్ఞప్తి మేరకు బ్యాంకర్లు ముందుకొచ్చి అర్హులైన ప్రతీ ఒక్కరికీ రుణాలు మంజూరు చేశారన్నారు. ఈ సమావేశాల్లో కానీ, మరెక్కడా కానీ పశువుల రీసైక్లింగ్ చేస్తున్నట్లుగా ఏ ఒక్కరూ ఆరోపించలేదని అమరేంద్రకుమార్ తెలిపారు.

**ప్రభుత్వ ప్రమేయమేమీలేదు..**

ఇక లబ్ధిదారుల ఇష్ట ప్రకారమే బ్యాంకర్లు రుణాలు మంజూరు చేస్తున్నారే తప్ప ఇందులో ప్రభుత్వ ప్రమేయం ఏమీలేదని స్పష్టం చేశారు. ఒక్కో యూనిట్ ఖరీదు రూ.75వేలు కాగా.. చేయూత పథకం కింద లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసిన మొదటి విడత సొమ్ము రూ.18,750ను నేరుగా బ్యాంకు ఖాతాకు జమచేయగా, మిగిలిన 56,250ను బ్యాంకులు రుణాలుగా మంజూరు చేశాయన్నారు. ఈ మొత్తాన్ని తిరిగి వాయిదా పద్ధతిలో తిరిగి చెల్లించే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందన్నారు. ఇక ఏటా చేయూత పథకం కింద ప్రభుత్వం జమచేసే మొత్తాన్ని రుణవాయిదాల రూపంలో లబ్ధిదారులు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. పశువుల ఎంపిక, కొనుగోలులో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా లబ్ధిదారుల ఇష్టప్రకారమే రైతుల నుంచి రైతు పశువులను నేరుగా కొనుగోలు చేసుకున్నారని, ఇందులో ప్రభుత్వానికి ఎలాంటి ప్రమేయం లేదన్నారు. ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం సబ్సిడీ రూపంలోగానీ, గ్రాంట్ రూపంలోగానీ సబ్సిడీ విడుదల చేయలేనప్పుడు కుంభకోణాలు, స్కాంలు జరగడానికి ఆస్కారం ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. పాడి పశువుల కొనుగోలు పూర్తిగా స్థానికంగానే జరుగుతున్నందున కొత్తగా పాడి సంపద పెరిగిన దాఖలాల్లేవన్నారు.

**ఇనాఫ్ ట్యాగ్స్‌తో రీసైక్లింగ్‌కు ఆస్కారంలేదు..**

పథకంలో లబ్ధిదారులు కొనుగోలు చేసిన ప్రతీ పశువుకూ ఇనాఫ్ ట్యాగ్స్ ఉన్నాయని, అలాంటప్పుడు పాడి పశువుల రీసైక్లింగ్‌కు ఆస్కారం ఎక్కడ ఉంటుందని అమరేంద్రకుమార్ ప్రశ్నించారు. పథకంలో లబ్ధిదారులు పాడి పశువులను ఇతర రాష్ట్రాల నుంచికాకుండా, రాష్ట్ర పరిధిలోనే తమకు నచ్చిన పశువును నేరుగా రైతు నుండే కొనుగోలు చేశారన్నారు. కాబట్టి పాడి పశువుల సంఖ్యలోగానీ, పాడిలో కానీ ఎలాంటి వ్యత్యాసం కానీ, స్థూల పాల దిగుబడిలో ఎటువంటి పెరుగుదల ఉండదని స్పష్టంచేశారు.

ప్రజాప్రతినిధులపై క్రిమినల్ కేసుల్లో

# విచారణకు ప్రత్యేక బెంచ్‌లు

- హైకోర్టులకు సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశం
- ఇలాంటి కేసుల విచారణలో జాప్యం వద్దని వెల్లడి



**న్యూఢిల్లీ:** ప్రజాప్రతినిధులపై నమోదైన క్రిమినల్ కేసుల్లో విచారణకు సంబంధించి సుప్రీంకోర్టు కీలకమైన ఆదేశాలు జారీ చేసింది. ఎంపీలు, ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసుల్లో విచారణను వేగవంతం చేయడానికి ప్రత్యేక ధర్మాసనాలు(బెంచ్‌లు) ఏర్పాటు చేయాలని హైకోర్టులను ఆదేశించింది. దేశవ్యాప్తంగా ప్రజాప్రతినిధులపై 5 వేలకుపైగా క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వీటిపై విచారణ మందకొడిగా సాగుతోంది. తీవ్రమైన నేరాలకు పాల్పడేవారిని జీవిత కాలం ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని సీనియర్ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ప్రజాప్రతినిధులపై క్రిమినల్ కేసుల్లో విచారణను వేగంగా పూర్తిచేయడానికి కచ్చితమైన మార్గదర్శకాలు జారీ చేయడం క్లిష్టమైన ప్రక్రియ అని అభిప్రాయపడింది. ప్రజాప్రతినిధులపై క్రిమినల్ కేసులను వేగంగా పరిష్కరించే బాధ్యతను హైకోర్టులకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎంపీలు, ఎమ్మెల్యేలపై క్రిమనల్ కేసుల విచారణకు కొన్ని మార్గదర్శకాలను సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. ఇలాంటి కేసుల వివరాలను జిల్లా కోర్టులు, ప్రత్యేక కోర్టుల నుంచి సేకరించి, హైకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని తెలియజేసింది. తీవ్రమైన నేరాల విషయంలో విచారణను వాయిదా వేయకూడదని ట్రయల్ కోర్టులకు తేల్చిచెప్పింది. క్రిమినల్ కేసుల సత్వర పరిష్కారానికి వెబ్‌సైట్‌ను, సాంకేతిక పరిజ్ఞానాన్ని సిద్ధం చేసుకోవాలని పేర్కొంది. ప్రజాప్రతినిధులు తీవ్ర నేరాలను పాల్పడినట్లు అభియోగాలు నిరూపితమైతే ఎంపీ లేదా ఎమ్మెల్యే ఎన్నికల్లో వారు పోటీ చేయకుండా జీవితకాలం నిషేధం విధించడంపై విచారణ జరుపుతున్నామని స్పష్టం చేసింది. ఈ అంశంపై తాము ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలియజేసింది.

# ఎంపీ మహువా మొయిత్రాను బహిష్కరించాలి

- డబ్బులు తీసుకుని ప్రశ్నలు అడిగారన్న ఆరోపణలపై ఎథిక్స్ కమిటీ సిఫారసు



**న్యూఢిల్లీ:** టీఎంపీ ఎంపీ మహువా మొయిత్రాపై అనర్హత వేటువేయాలని లోక్‌సభ ఎథిక్స్ కమిటీ సిఫారసు చేసింది. అదానీ గ్రూప్‌నకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో ప్రశ్నలడిగేందుకు వ్యాపారవేత్త హీరా నందానీ నుంచి డబ్బులు తీసుకున్నారంటూ ఆమెపై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ అంశాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఎథిక్స్ కమిటీకి పంపారు. బీజేపీ ఎంపీ వినోద్‌కుమార్ సోంకార్ సారథ్యంలో గురువారం సమావేశమైన 10 మంది సభ్యుల ఎథిక్స్ కమిటీ 479 పేజీల నివేదిను ఆమోదించింది. పదిహేను రోజుల వ్యవధిలో ముగ్గురిని ప్రశ్నించి దీనిని తయారు చేశామని సోంకార్ చెప్పారు. ఎంపీ మొయిత్రాను సస్పెండ్ చేయాలన్న సిఫారసును కమిటీలోని నలుగురు వ్యతిరేకించగా ఆరుగురు బలపరిచారని తెలిపారు. కాగా, ఒక ఎంపీపై అనర్హత వేటు వేయాలంటూ ఎథిక్స్ కమిటీ సిఫారసు చేయడం ఇదే మొదటిసారని చెబుతున్నారు. దీనిపై ఎంపీ మొయిత్రా స్పందిస్తూ.. ఇదంతా ముందుగానే ఖరారు చేసిన 'మ్యాచ్ ఫిక్సింగ్' అంటూ వ్యాఖ్యానించారు. ఇప్పటికి తనను బహిష్కరించినా, వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీతో మళ్లీ సభలోకి అడుగుపెడతానన్నారు. ఈ నివేదికను ఎథిక్స్ కమిటీ పార్లమెంట్ ముందుంచుతుంది. అనంతరం చర్చ, ఆపైన చర్యలపై ఓటింగ్‌కు పెడతారు. ఎంపీ మహువా మొయిత్రా లంచం తీసుకున్నారంటూ అక్టోబర్ 14న బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే, లాయర్ జై అనంత్ దేహద్‌రాయ్‌తో కలిసి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఫిర్యాదు చేయడంతో వివాదం మొదలైంది. ఇలా ఉండగా, తమ ఎంపీ మొయిత్రాను టీఎంసీ గట్టిగా సమర్థించింది. బీజేపీ సారథ్యంలోని కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రశ్నించిన వారిని వేధిస్తోందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ విమర్శించారు. ఆరోపణలు రుజువు కాకుండానే పార్లమెంటరీ కమిటీ ఆమెపై చర్యలకు ఎలా సిఫారసు చేస్తుందని ప్రశ్నించారు.

## క్లుప్తంగా...

### డిసెంబర్ 4 నుంచి శీతాకాల సమావేశాలు

**సాక్షి, న్యూఢిల్లీ:** పార్లమెంట్ శీతాకాల సమావేశాల తేదీలు ఖరారయ్యాయి. డిసెంబర్ 4న మొదలై డిసెంబర్ 22వ తేదీ వరకు ఈ సమావేశాలు జరుగుతాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి గురువారం తెలిపారు. మొత్తం 19 రోజుల వ్యవధిలో 15 సిట్టింగ్‌లుంటాయని 'ఎక్స్'లో చెప్పారు. డబ్బులు తీసుకుని పార్లమెంట్‌లో ప్రశ్నలడిగినట్లు ఆరోపణలెదుర్కొంటున్న టీఎంసీకి చెందిన ఎంపీ మహువా మొయిత్రాపై ఎథిక్స్ కమిటీ విచారించి అందజేసిన నివేదికపై ఈ సమావేశాల్లో చర్చించి, ఆమెను బహిష్కరించే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

### బిహార్‌లో 65 శాతానికి రిజర్వేషన్లు

**ఆమోదించిన అసెంబ్లీ**

**పట్నా:** బిహార్‌లో ప్రభుత్వ విద్యాసంస్థలు, ఉద్యోగాల్లో కుల రిజర్వేషన్లను 50 నుంచి 65 శాతానికి పెంచేందుకు ఉద్దేశించిన బిల్లుకు రాష్ట్ర అసెంబ్లీ ఆమోద ముద్ర వేసింది. దీంతో, రాష్ట్రంలో అన్ని రిజర్వేషన్లు కలిపి 75శాతానికి చేరినట్లయింది. గురువారం అసెంబ్లీలో బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం నితీశ్ కుమార్ మాట్లాడుతూ.. ఆర్థికంగా బలహీన వర్గాలకు కేటాయించిన 10శాతం రిజర్వేషన్‌తో కలిపి ఇప్పుడు రిజర్వేషన్లు మొత్తమ్మీద 75 శాతానికి చేరుకున్నాయి'అని అన్నారు. అంతకుముందు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, అత్యంత వెనుకబడిన కులాలు(ఈబీసీలు), ఇతర వెనుకబడిన కులాల(ఓబీసీల)కు ప్రస్తుతమున్న 50% రిజర్వేషన్లను 65%కి పెంచుతూ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానించింది. సమగ్ర కులగణన ఆధారంగా విద్యా సంస్థలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల పెంపుపై ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులకు సభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది.

### బరితెగించిన పాక్ రేంజర్స్

**సరిహద్దు వెంట కాల్పుల్లో కానిస్టేబుల్ వీరమరణం**



**జమ్మూ/అర్నియా:** కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడుస్తూ పాకిస్తాన్ రేంజర్స్ జరిపిన కాల్పుల్లో సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) హెడ్ కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయారు. జమ్మూకశ్మీర్‌లోని సాంబా జిల్లాలోని రామ్‌గఢ్ సెక్టార్‌లో భారత్–పాక్ సరిహద్దు వెంట గురువారం ఈ ఘటన జరిగింది. సరిహద్దు ఔట్‌పోస్ట్ వద్ద ఉన్న 50ఏళ్ల లాల్‌ఫామ్ కీమాపై కాల్పులు జరపడంతో రక్తమోడుతున్న ఆయనను వెంటనే స్థానిక ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం జమ్మూలోని జీఎంసీ ఆస్పత్రికి తరలించినా ప్రాణాలు దక్కలేదని ఆర్మీ అధికారులు వెల్లడించారు. 'పాక్ రేంజర్ల కాల్పులకు దీటుగా బీఎస్ఎఫ్ బలగాలు కాల్పుల మోత మోగించాయి. సమీపంలోని జెర్డా గ్రామంపైనా పాక్ రేంజర్లు కాల్పులు జరిపారు' అని ఆర్మీ ఒక ప్రకటనలో పేర్కొంది.

### ఎన్నికల్లో ఓడిపోతే మళ్లీ ఉద్యోగం

**రాజస్తాన్ ప్రభుత్వ వైద్యుడికి హైకోర్టు వెసులుబాటు**

**జైపూర్:** రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్రభుత్వ డాక్టర్ దీపక్ ఘోగ్రా(43)కు రాష్ట్ర హైకోర్టు అనుమతి మంజూరు చేసింది. ఒకవేళ ఎన్నికల్లో ఓడిపోతే ఆయన మళ్లీ ఉద్యోగంలో చేరడానినికి అంగీకరించింది. దీపక్ భారతీయ ట్రైబల్ పార్టీ టికెట్‌పై దుంగార్పూర్ స్థానం నుంచి పోటీకి దిగుతున్నారు. పరాజయం పాలైతే ఉద్యోగంలో చేర్చుకోవాలంటూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు సానుకూలంగా స్పందించింది. ఎన్నికల్లో దీపక్ ఓడిపోతే మళ్లీ ఉద్యోగంలో చేర్చుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది.

### అయోధ్యలో 'ఆదిత్య' మంత్రివర్గ సమావేశం

**అయోధ్య:** రాష్ట్ర రాజధాని లక్నోలో కాకుండా అయోధ్యలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఏర్పాటుచేశారు. అయోధ్యలో కేబినెట్ భేటీ జరగడం ఇదే తొలిసారి. అత్యంత అరుదైన సందర్భాల్లోనే ఇలా రాష్ట్ర రాజధానికి బదులు వేరే చోట కేబినెట్ సమావేశమవుతుంది. అయోధ్యలో భవ్య రామమందిరం ప్రారంభోత్సవానికి అంగరంగ వైభవంగా సంసిద్ధమవుతున్న వేళ అదే పట్టణంలో సీఎం మంత్రివర్గాన్ని సమావేశపరచడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# గాజా సిటీపై దండయాత్ర

### నగరం చుట్టూ మోహరించిన ఇజ్రాయెల్ సైన్యం

- అల్–షిఫా, అల్–ఖుద్స్ ఆసుపత్రులపై దాడులకు సన్నాహాలు
- గాజాలో మిలిటెంట్ స్థావరాలపై క్షిపణి దాడులు

**ఖాన్ యూనిస్:** హమాస్ మిలిటెంట్లపై ఇజ్రాయెల్ యుద్ధం మరో మలుపు తిరిగింది. గాజాస్ట్రిప్‌లో అతిపెద్ద నగరమైన గాజా సిటీని ఇజ్రాయెల్ సైన్యం చుట్టుముట్టింది. హమాస్ స్థావరాలే లక్ష్యంగా వైమానిక దాడులు తీవ్రతరం చేసింది. బుధవారం అర్ధరాత్రి నుంచి పెద్ద సంఖ్యలో క్షిపణులు ప్రయోగించింది. 100కుపైగా హమాస్ సొరంగాలను పేల్చేశామని, పదుల సంఖ్యలో మిలిటెంట్లు హతమయ్యారని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇజ్రాయెల్ పదాతి దళాలు ఉత్తర గాజాలోని గాజా సిటీలోకి అడుగుపెట్టాయి. వీధుల్లో కవాతు చేస్తూ మిలిటెంట్ల కోసం గాలిస్తున్నాయి. గాజా సిటీలో రోగులు, క్షతగాత్రులతోపాటు వేలాదిగా పాలస్తీనియన్లు ఆశ్రయం పొందుతున్న అల్–షిఫా హాస్పిటల్ యుద్ధక్షేత్రంగా మారింది. ఆసుపత్రి చుట్టూ ఇజ్రాయెల్ సేనలు మోహరించాయి. అల్–షిఫా హాస్పిటల్‌లోనే హమాస్ ప్రధాన కమాండ్ సెంటర్ ఉందని, సీనియర్ మిలిటెంట్లు ఇక్కడి నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నారని, దాన్ని ధ్వంసం చేసి తీరుతామని సైన్యం తేల్చిచెప్పింది. ప్రస్తుతం ఇజ్రాయెల్ జవాన్లు ఆసుపత్రి చుట్టూ 3 కిలోమీటర్ల దూరంలోనే మోహరించారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే ఆసుపత్రిలోకి చొచ్చుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. గాజాలోని అల్–ఖుద్స్ హాస్పిటల్‌పైనా సైన్యం దృష్టి పెట్టింది. ఇక్కడ వంద మందికిపైగా క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారు. హమాస్ మిలిటెంట్లు అల్–ఖుద్స్ ఆసుపత్రి ప్రాంగణంలో మకాం వేశారని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. క్షతగాత్రుల ముసుగులో తప్పించుకుంటున్నారని చెబుతోంది. ఆసుపత్రుల్లో మిలిటెంట్లు ఉన్నారన్న ఇజ్రాయెల్ వాదనను హమాస్ ఖండించింది.



గాజా స్ట్రిప్‌లో హమాస్ ఆయుధ కర్మాగారంగా భావిస్తున్న ఓ అపార్ట్‌మెంట్‌ను పరిశీలిస్తున్న ఇజ్రాయెల్ సైనికుడు

**వెస్ట్‌బ్యాంక్‌పై దాడి.. 11 మంది మృతి**

గాజాలో ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో మృతి చెందిన పాలస్తీనియన్ల సంఖ్య గురువారం 10,812కు చేరుకుంది. మరో 2,300 మంది శిథిలాల కిందే ఉండిపోయారు. వారు మరణించి ఉంటారని స్థానిక అధికారులు అంచనా వేస్తున్నారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోనూ హింసాకాండ కొనసాగుతోంది. గురువారం వెస్ట్‌బ్యాంక్‌లోని జెనిన్ శరణార్థి శిబిరంపై జరిగిన ఇజ్రాయెల్ దాడుల్లో కనీసం 11 మంది పాలస్తీనియన్లు మృత్యువాత పడ్డారు. మరో 20 మంది గాయపడ్డారు. పలు భవనాలు ధ్వంసమైనట్లు తెలుస్తోంది.

**ఆ ఫొటో జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలి**

అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడిని చిత్రీకరించిన ఫొటో జర్నలిస్టుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఇజ్రాయెల్ గురువారం డిమాండ్ చేసింది. గాజాకు చెందిన ఈ జర్నలిస్టులు అంతర్జాతీయ మీడియా సంస్థల తరఫున పనిచేస్తున్నారు. హమాస్ దాడిని కెమెరాలతో చిత్రీకరించారు. ఫొటోలు తీశారు. మీడియాకు విడుదల చేశారు. హమాస్ దాడి గురించి వారికి ముందే సమాచారం ఉందని, అందుకే కెమెరాలతో సర్వసన్నద్ధమై ఉన్నారని ఇజ్రాయెల్ ఆరోపించింది. మానవత్వంపై జరిగిన నేరంలో వారి పాత్ర ఉందని మండిపడింది. వారి వ్యవహార శైలి పాత్రికేయ ప్రమాణాలకు విరుద్ధమని ఆక్షేపించింది. సదరు ఫొటోజర్నలిస్టులు పనిచేస్తున్న మీడియా సంస్థకు ఇజ్రాయెల్ లేఖలు రాసింది.



గాజా స్ట్రిప్‌లోని బురెయిజ్ శరణార్థి శిబిరం నుంచి దక్షిణ గాజాకు కాలినడకన వలసవెళ్తున్న పాలస్తీనియన్లు

**ఉత్తర గాజా నుంచి దక్షిణ గాజాకు..**

ఉత్తర గాజా–దక్షిణ గాజాను కలిపే ప్రధాన రహదారిని ఇజ్రాయెల్ సైన్యం వరుసగా ఐదో రోజు తెరిచి ఉంచింది. నిత్యం వేలాది మంది జనం ఉత్తర గాజా నుంచి వేలాది మంది దక్షిణ గాజాకు పయనమవుతున్నారు. పిల్లా పాపలతో కాలినడకనే తరలి వెళ్తున్నారు. కొందరు కట్టుబట్టలతో వెళ్లిపోతున్నారు. ఉత్తర గాజాలో హమాస్ స్థావరాలపై దాడులు ఉధృతం చేస్తామని, సాధారణ ప్రజలంతా దక్షిణ గాజాకు వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ సైన్యం సూచించింది. గాజాలో జనం సురక్షిత ప్రాంతాలకు చేరుకోవడానికి, మానవతా సాయం అందించడానికి వీలుగా ప్రతిరోజూ 4 గంటలపాటు దాడులకు విరామం ఇచ్చేందుకు ఇజ్రాయెల్ అంగీకరించిందని అమెరికా జాతీయ భద్రతా మండలి అధికార ప్రతినిధి జాన్ కిర్బీ తెలియజేశారు.

ఆ 8 మందికి మరణశిక్షపై

# భారత్ అప్పీల్

**ఖతర్ ఘటనపై భారత విదేశాంగ శాఖ స్పందన**

**న్యూఢిల్లీ:** తమ దేశంలో గూఢచర్యానికి పాల్పడ్డారనే ఆరోపణలపై ఎనిమిది మంది మాజీ భారతీయ నావికాదళ అధికారులపై ఖతర్ దేశ న్యాయస్థానం విధించిన మరణశిక్షపై అప్పీల్ చేశామని భారత్ గురువారం వెల్లడించింది. సంబంధిత అంశాలను ఢిల్లీలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చీ వివరించారు. 'మంగళవారమే ఆ ఎనిమిది మందితో సంప్రతింపుల జరిపే అవకాశం దోహా నగరంలోని భారతీయ ఎంబసీ దౌత్యాధికారులకు లభించింది. నిర్బంధంలో ఉన్న మాజీ నావికాధికారులతో మనవాళ్లు మాట్లాడారు. వారికి న్యాయ, దౌత్యపరమైన పూర్తి రక్షణ కల్పించేందుకు భారత ప్రభుత్వం కృషిచేస్తోంది' అని బాగ్చీ అన్నారు. వీరికి మరణశిక్ష ఖరారుచేస్తూ ఖతర్ కోర్టు అక్టోబర్ 26వ తేదీన తీర్పు ఇవ్వగానే భారత ప్రభుత్వం ఈ అంశాన్ని తీవ్రమైనదిగా పరిగణించింది. వారికి విముక్తి కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అనుసరించాల్సిన దౌత్య మార్గాలను అన్వేషిస్తోంది. 'అల్ దహ్రా గ్లోబల్ అనే ప్రైవేట్ కంపెనీలో పనిచేసిన వీరిపై ఖతర్ మరణశిక్ష మోపింది. ఈ తీర్పు వివరాలు అత్యంత గోప్యమైనవి. వీటిని కేవలం న్యాయబృందంతోనే భారత్ పంచుకుంటోంది. తదుపరి చర్యలకు సిద్ధమయ్యాం. ఇప్పటికే అప్పీల్ కూడా చేశాం. బాధితుల కుటుంబాలతో మాట్లాడాం. ఇటీవలే వారి కుటుంబసభ్యులను భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ స్వయంగా కలిసి ధైర్యం చెప్పారు'' అని బాగ్చీ చెప్పారు. అసలు వీరు ఏ విధమైన గూఢచర్యానికి పాల్పడ్డారనే వివరాలను ఇంతవరకు ఖతర్ న్యాయస్థానం బహిరంగంగా వెల్లడించలేదు. కేసులోని సున్నితత్వం దృష్ట్యా ఈ అంశంపై భారత్ తరఫున ఉన్నతాధికారులూ బహిరంగంగా ఏమీ మాట్లాడలేదు. 'కేసు సున్నితత్వాన్ని పరిగణనలోకి తీసుకుని ఎవరూ ఈ అంశాన్ని సంచలనాల కోసం లేనిపోని రాద్ధాంతాలు, వక్రభాష్యాలతో నింపేయకండి' అని బాగ్చీ విజ్ఞప్తిచేశారు. మార్చి 25వ తేదీన మాజీ అధికారులపై కేసు నమోదుచేసి ఖతార్ చట్టాల కింద అరెస్ట్‌చేశారు. మరణశిక్షను ఎదుర్కొంటున్న వీరంతా భారత నావికాదళంలో ముఖ్యమైన పదవుల్లో దాదాపు 20 సంవత్సరాలపాటు సేవలందించారు. దళ సభ్యులకు ఇన్‌స్ట్రక్టర్‌లుగా పనిచేశారని మాజీ సైన్యాధికారులు గుర్తుచేసుకున్నారు. వీరి అరెస్ట్ తర్వాత మే నెలలో దోహాలోని అల్ దహ్రా గ్లోబల్ సంస్థ తన కార్యకలాపాలను నిలిపేసింది. అందులో పనిచేసే సిబ్బందిని, ముఖ్యంగా భారతీయులను స్వదేశానికి పంపించేసింది.

- పేదలకు కోట్ల ఇళ్లు కట్టించాను..

# నాకు ఒక్క ఇల్లూ లేదు

- మధ్యప్రదేశ్ ఓటు 'త్రిశక్తి' వంటిది
- కాంగ్రెస్‌కు కనీసం 100 ఏళ్లు అధికారమివ్వకండి
- దేశాన్ని తిరోగమనంలో నడిపించడంలో ఆ పార్టీ దిట్ట
- మధ్యప్రదేశ్ ఎన్నికల ర్యాలీల్లో ప్రధాని మోదీ విమర్శలు



**ఛతర్‌పూర్/సత్నా/నీముచ్(మధ్యప్రదేశ్):** దేశంలోని పేదలకు తమ ప్రభుత్వం నాలుగు కోట్ల పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చిందని, తన కోసం ఒక్క ఇల్లు కూడా కట్టుకోలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మధ్యప్రదేశ్‌ని ఒక్కో ఓటు రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడేందుకు, కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి బలాన్నిచ్చేందుకు, అవినీతి కాంగ్రెస్‌ను మరో 100 ఏళ్లపాటు అధికారానికి దూరం ఉంచేందుకు ఉపయోగపడే 'త్రిశక్తి' వంటిందని పేర్కొన్నారు. దేశాభివృద్ధిని వెనక్కి నడిపించడంలో కాంగ్రెస్‌కు మంచి నైపుణ్యం ఉందని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. అందుకే, అవినీతి కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వరాదని ప్రజలకు పిలుపునిచ్చారు. మధ్యప్రదేశ్‌లోని ఛత్తర్‌పూర్, సత్నా, నీముచ్‌లలో గురువారం జరిగిన ఎన్నికల ర్యాలీల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. 'మా ప్రభుత్వం దేశంలోని పేదలకు నాలుగు కోట్ల పక్కా గృహాలను నిర్మించి ఇచ్చింది. కానీ, నేను ఒక్క ఇల్లు కూడా కట్టుకోలేకపోయాను'అని ఆయన చెప్పారు. 'వాహనం మనల్ని రివర్స్‌గేర్‌లో వెనక్కి తీసుకెళ్లినట్టుగానే కాంగ్రెస్ పార్టీకి సుపరిపాలనను రివర్స్‌గేర్‌లో దుష్పరిపాలనగా మార్చడంలో నైపుణ్యం ఉంది. 100 ఏళ్ల క్రితమే గొప్ప నీటి వనరులున్న బుందేల్‌ఖండ్‌లో నీటి సమస్యలను తీర్చేందుకు రాష్ట్రంలో అధికారంలో ఉండగా కాంగ్రెస్ ఎలాంటి ప్రయత్నమూ చేయలేదు. దీంతో, ఇక్కడి ప్రజలు నీటి కోసం అల్లాడుతున్నారు. అందుకే, ఆ పార్టీకి కనీసం 100 ఏళ్లపాటు అధికారం ఇవ్వరాదు. అప్పుడే అభివృద్ధి సాధ్యం'అని ప్రజలను కోరారు. బానిస మనస్తత్వంతో కూడిన కాంగ్రెస్ దేశ అభివృద్ధిని పట్టించుకోలేదు, దేశ వారసత్వంతోనూ ఆ పార్టీకి సంబంధం లేదని మోదీ అన్నారు. 'కాంగ్రెస్‌కు ఒక పంజా ఉంది. పేదల వద్ద ఉన్న వాటిని గుంజుకోవడానికే దానిని వాడుతుంది. అలాంటి కాంగ్రెస్ పంజా బారి నుంచి మధ్యప్రదేశ్‌ను మనం కాపాడు కోవాల్సిన అవసరం ఉంది'అంటూ ఆ పార్టీ ఎన్నికల గుర్తు హస్తంను ఉద్దేశించి ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

**నకిలీలను తొలగించాం**

ప్రభుత్వ పథకాల ద్వారా పేదల ధనాన్ని కాంగ్రెస్ ప్రభుత్వాలు లూటీ చేశాయని విమర్శించారు.కాంగ్రెస్ జమానాలో డబ్బంతా ఎక్కడికి చేరుతుందో ప్రజలకు అర్థమయ్యేది కాదు. 2జీ, కోల్, కామన్‌వెల్త్, హెలికాప్టర్ల కుంభకోణాల రూపంలో లక్షల కోట్లు దారి మళ్లాయి. వీటన్నిటినీ మోదీ ప్రభుత్వం ఆపు చేసింది. అప్పట్లో దళారులదే రాజ్యంగా ఉండేది. మోదీ ప్రభుత్వం వారి దుకాణాలను మూసివేయించింది. అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వాలు సృష్టించిన దేశంలోని ప్రభుత్వ పథకాల 10 కోట్ల నకిలీ లబ్ధిదారులను తొలగించి ప్రజాధనాన్ని కాపాడామన్నారు. పదేళ్ల కాలంలో రూ.33 లక్షల కోట్లను నేరుగా పేదల బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్లు వివరించారు. ఇందులో ఒక్క రూపాయి కూడా పక్కదారి పట్టలేదని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో పేదల పిల్లలు ఆకలితో అలమటించకుండా చేయగలగడం కేవలం మోదీ వల్ల కాదు, మీ అందరివల్లే ఇది సాధ్యమైందని చెప్పారు. ఓటుతో ప్రజలిచ్చిన అధికారం వల్లనే పేదల ఆకలి తీర్చగలిగినట్లు చెప్పారు.



సాహిత్య అకాడమీ 'బాలల సాహిత్య అవార్డ్'-2023ను ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సుధామూర్తికి అందజేస్తున్న దృశ్యం. గురువారం ఢిల్లీలో ఈ కార్యక్రమం జరిగింది.

# ముగ్గురు జడ్జీలతో ప్రమాణం చేయించిన సీజేఐ



సుప్రీంకోర్టు జడ్జీలుగా ప్రమాణం చేస్తున్న జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్, జస్టిస్ సందీప్ మెహతా

**న్యూఢిల్లీ:** ఢిల్లీ, రాజస్తాన్, గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు గురువారం సుప్రీంకోర్టు జడ్జీలుగా ప్రమాణం చేశారు. వీరి నియామకంతో అత్యున్నత న్యాయస్థానంలో జడ్జీల సంఖ్య పూర్తి స్థాయి 34కు చేరింది. సుప్రీంకోర్టు భవన సముదాయంలో జరిగిన కార్యక్రమంలో మూడు హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ, జస్టిస్ ఆగస్టీన్ జార్జి మసీహ్, జస్టిస్ సందీప్ మెహతాలతో ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ వైవీ చంద్రచూడ్ ప్రమాణం చేయించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. అంతకుముందు, ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శర్మ, రాజస్తాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మసీహ్, గౌహటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మెహతాలను సుప్రీంకోర్టులో జడ్జీలుగా నియమించినట్లు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ 'ఎక్స్'లో ప్రకటించారు. వీరి పేర్లను కొలీజియం ఈ నెల 6న ఎంపిక చేసి కేంద్రానికి సిఫారసు చేసిన విషయం తెలిసిందే.

# రిషి సునాక్ ఇంట దీపావళి వేడుక



లండన్‌లో దీపావళి వేడుక జరుపుకుంటున్న రిషి సునాక్, అక్షత

**లండన్:** భారత సంతతికి చెందిన బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్, అక్షతా మూర్తి దంపతులు 10 డౌనింగ్ స్ట్రీట్‌లోని తమ అధికార నివాసంలో దీపావళి వేడుకలు జరుపుకున్నారు. బుధవారం జరిగిన ఈ వేడుకల్లో పలువురు ప్రవాస భారతీయులు, పార్లమెంటేరియన్లు, పారిశ్రామికవేత్తలు, బాలీవుడ్ ప్రముఖులు పాల్గొన్నారు. ప్రధానిగా సునాక్ బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం సాయంత్రం ప్రధానమంత్రి నివాసాన్ని రంగురంగుల దీపాలతో అలంకరించారు. ప్రధాని రిషి సునాక్, అక్షతామూర్తి దంపతులు కలిసి దీపాలు వెలిగిస్తున్న దృశ్యాలను ప్రధాని కార్యాలయం 'ఎక్స్'లో పోస్టు చేసింది. ప్రధాని రిషి సునాక్ అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

**కమలా హ్యారిస్ నివాసంలోనూ..**

**వాషింగ్టన్:** భారత సంతతికి చెందిన అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ మంగళవారం వాషింగ్టన్‌లోని తన అధికార నివాసంలో దీపావళి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భారతీయ అమెరికన్లు సహా 300 మంది వరకు పాల్గొన్నారు. దీపాలు వెలిగించిన అనంతరం చట్టసభల ప్రతినిధులైన రో ఖన్నా, శ్రీ థానెదార్, రాజా కృష్ణమూర్తి, ప్రమీలా జయపాల్ తదితరులతో ఆమె మాట్లాడారు. ఈసందర్భంగా ఆమె ఇజ్రాయెల్, హమాస్ మధ్య పోరును ప్రస్తావించారు. పాలస్తీనియన్లకు సాయం అందించేందుకు అమెరికా ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

## వైభవంగా లక్ష కుంకుమార్చన



అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్న వేద పండితులు

తిరుచానూరు (చంద్రగిరి): తిరుపతి జిల్లా తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం లక్ష కుంకుమార్చన సేవను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు లాంటి భారీ ఉత్సవాలను నిర్వహించే ముందు లక్ష కుంకుమార్చన నిర్వహిస్తుంటారు. ఈ సేవ ద్వారా అమ్మవారు ప్రసన్నమై.. ఉత్సవాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా జరిగేలా ఆశీర్వదిస్తారని తమ విశ్వాసమని అర్చకులు తెలిపారు. ఆలయంలోని శ్రీకృష్ణ ముఖ మండపంలో శ్రీ పద్మావతి అమ్మవారిని ఆశీనులను చేసి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అర్చకులు శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన సేవ నిర్వహించారు. అర్చకులు లక్ష్మీ అష్టోత్తరం, లక్ష్మీ సహస్ర నామాలను వల్లిస్తూ అమ్మవారిని కుంకుమతో అర్చించారు. ఈ సేవలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీమ థర్మల్ విద్యుత్ కేంద్రానికి 'ఎంవీఆర్' పేరు



డాక్టర్ ఎంవీ రమణారెడ్డి(ఎంవీఆర్)

- దివంగత కార్మిక నేత డాక్టర్ ఎంవీ రమణారెడ్డి సేవలకు గుర్తింపు
- ఆర్టీపీపీ ఇకపై.. డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి/ఎర్రగుంట్ల( వైఎస్సార్ జిల్లా: రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్(ఆర్టీపీపీ) పేరును డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంటుగా పేరు మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులిచ్చింది. కార్మిక నేతగా, ఎమ్మెల్యేగా, రచయితగా రాయలసీమ ప్రాంత అభివృద్ధికి కృషి చేసిన దివంగత నేత డాక్టర్ ఎంవీ రమణారెడ్డి(ఎంవీఆర్) సేవలకు గుర్తింపుగా, రాయలసీమ ప్రాంత నేతల విజ్ఞప్తి మేరకు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారు. వారి ఆమోదంతో వైఎస్సార్ జిల్లా కలమల్లలోని 1650 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల ఆర్టీపీపీ పేరును డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంటుగా మారుస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పేరు మార్పు తక్షణమే అమల్లోకొస్తుందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**మూడు థర్మల్ ప్లాంట్లకు ముగ్గురు ప్రముఖుల పేర్లు**

రాష్ట్రంలో మూడు థర్మల్ పవర్ ప్లాంట్లుండగా, వేర్వేరు రంగాలకు చెందిన వారి పేర్లు వాటికి సార్థక నామధేయాలుగా మారాయి. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ప్లాంట్‌కు మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రమని పేరు పెట్టారు. ఇబ్రహీంపట్నంలోని పవర్ ప్లాంటుకు విద్యుత్ రంగ పితామహుడుగా పేరు పొందిన డాక్టర్ నార్ల తాతారావు పేరు పెట్టారు. తాజాగా ఆర్టీపీపీని కార్మిక నేత ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంటుగా ప్రభుత్వం మార్చింది.

### ఎంవీఆర్ కృషితో సీమలో థర్మల్ ప్లాంట్

వెనుకబడ్డ రాయలసీమ ప్రాంతంలో విద్యుత్ సమస్య పరిష్కారం కోసం థర్మల్ విద్యుత్ కర్మాగారం ఏర్పాటు చేయాలని మొట్టమొదట డిమాండ్ చేసిన నేత డాక్టర్ ఎంవీ రమణారెడ్డి. 1985లో 'రాయలసీమ కన్నీటి గాథ' అనే పుస్తకం ద్వారా ఆయన రాయలసీమ సమస్యలను, గణాంకాలు, సహేతుకమైన ఆధారాలతో రాష్ట్ర ప్రజల దృష్టికి తెచ్చారు. కరువుతో అల్లాడుతున్న సీమకు అన్ని విధాలా అన్యాయం జరుగుతోందని గళమెత్తారు. ఎంవీఆర్ చేసిన డిమాండ్.. ఆర్టీపీపీ స్థాపనకు బాట వేసిందని, ఆ నేతకు నివాళిగా ఆర్టీపీపీ పేరును డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టుగా మార్చాలని రాయలసీమ నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాయలసీమ విమోచన సమితి పేరుతో రమణారెడ్డి, రాయలసీమ సంయుక్త కార్యాచరణ సమితి పేరుతో వైఎస్సార్, మాజీ మంత్రి ఎంవీ మైసూరారెడ్డి, టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి తదితర నేతలంతా అప్పట్లో ఉద్యమం చేపట్టారని సాహితీవేత్త భూమన్ తెలిపారు. ఆర్టీపీపీ పేరును డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంటుగా మార్చడం దివంగత నేతకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అరుదైన గౌరవంగా భావిస్తున్నామని భూమన కరుణాకర్‌రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్యలు ప్రశంసించారు. ఆర్టీపీపీకి డాక్టర్ ఎంవీఆర్ పేరు పెట్టినందుకు ఆయన కుటుంబ సభ్యులతో పాటు పలువురు నేతలు ముఖ్యమంత్రికి, ఇంధన శాఖ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఆర్టీపీపీకి ఎంవీఆర్ పేరు చేర్చడాన్ని రాయలసీమ వాసులు స్వాగతిస్తున్నారు.

## 'ఓటుకు కోట్లు' కేసులో పారిపోయి రాలేదా బాబూ..

1,138వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: 'ఓటుకు కోట్లు' కేసులో అడ్డంగా దొరికిపోయి.. తన అవినీతిని కాపాడుకునేందుకే ఉమ్మడి రాష్ట్ర హక్కులను గాలికి వదిలేసి 10 సంవత్సరాల ముందు హైదరాబాద్ నుంచి చంద్రబాబు పారిపోయి వచ్చిన విషయం నిజం కాదా అని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ప్రశ్నించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం నాటికి 1,138వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడారు. పెత్తందారులకు దోచిపెట్టేందుకే చంద్రబాబు.. తన 14 సంవత్సరాల పాలనలో అహర్నిశలు కృషి చేశాడని విమర్శించారు. దోచుకోవడం, దాచుకోవడమే లక్ష్యంగా పనిచేసిన బాబు ఏపీలో రాజధాని పేరుతో తాత్కాలిక నిర్మాణాలు చేసి నిలువు దోపిడీ చేశాడన్నారు. మూడు శాతం ఉన్న కులవాదులు ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని తప్పుడు ప్రచారాలకు దిగడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. పేదల ఆర్థిక, రాజకీయ ఎదుగుదల ద్వారానే సామాజిక సాధికారత సాధ్యమని నమ్మినందునే తాము సుదీర్ఘ పోరాటం చేస్తున్నామని స్పష్టం చేశారు. అన్ని ప్రాంతాలు, అన్ని కులాలు, అన్ని మతాలు సమాన హక్కులు పొందినప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ పరిఢవిల్లుతుంది కానీ, ఓ సామాజిక వర్గమే ఎదగాలని కోరుకోవడం మంచిది కాదన్నారు. ఏపీలో మూడు రాజధానుల దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుండటం శుభపరిణామమన్నారు. కులం, మతం, పార్టీ, ప్రాంతీయ భేదాలు లేకుండా నాలుగున్నరేళ్లుగా ఏపీలో ప్రతి పేదవాడికి అర్హతే ప్రామాణికంగా సంక్షేమం, అభివృద్ధి చేరువవుతుందని తెలిపారు. ఈపూరి ఆదాం, పల్లె బాబు, పులి దాసు, మాదిగాని గురునాథం, కొలకలూరి లోకేశ్, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ మీదుగా వెళ్లే పలు రైళ్ల రద్దు



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో జరుగుతోన్న నిర్వహణ పనుల కారణంగా పలు రైళ్లను పూర్తిగాను, పాక్షికంగాను రద్దు చేసి కొన్ని రైళ్లను దారి మళ్లించినట్లు విజయవాడ డివిజన్ పీఆర్‌వో నుస్రత్ మండ్రుపక్కర్ గురువారం తెలిపారు.

**రద్దైన రైళ్లు:** ఈ నెల 13–19 వరకు కాకినాడ టౌన్–విశాఖ (17267/17268), గుంటూరు–రాయగడ (17243), విజయవాడ–తెనాలి (07279/07575), విజయవాడ–ఒంగోలు (07461/07576), విజయవాడ–గూడూరు (07500/07458), బిట్రగుంట–విజయవాడ (07977/07978), రాజమండ్రి–విశాఖ (07466/07467), మచిలీపట్నం–విశాఖ (17219), గుంటూరు–విశాఖ (17239), 14–20 వరకు విశాఖ–మచిలీపట్నం (17220), రాయగడ–గుంటూరు (17244), 13, 14, 15, 17, 18 తేదీల్లో విజయవాడ–విశాఖ (22702/22701), విశాఖ–గుంటూరు (17240), ఈ నెల 13–17 వరకు బిట్రగుంట–చెన్నై సెంట్రల్ (17237/17238).

**పాక్షికంగా రద్దైన రైళ్లు:** ఈ నెల 13–19 వరకు మచిలీపట్నం–విజయవాడ (07896/07769), నర్సాపూర్–విజయవాడ (07863), విజయవాడ–మచిలీపట్నం (07866/07770), విజయవాడ–భీమవరం (07283), మచిలీపట్నం–విజయవాడ (07870), విజయవాడ–నర్సాపూర్ (07861) రైళ్లు విజయవాడ–రాయనపాడు మధ్య పాక్షికంగా రద్దు చేశారు.

**దారి మళ్లింపు:** ఈ నెల 13న యర్నాకులం–పాట్నా (22643), 18న భావ్‌నగర్–కాకినాడ పోర్టు (12756),15న బెంగళూరు–గౌహతి (12509), 13, 15, 17, 18 తేదీలలో ఛత్రపతి శివాజీ టర్మినల్–భువనేశ్వర్ (11019) రైళ్లు విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా దారి మళ్లించారు.

## పద్మావతి అమ్మవారి సేవలో మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే



చంద్రగిరి (తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ మధు స్వాగతం పలికారు. ముందుగా ధ్వజస్తంభంకు మొక్కుకుని, అమ్మవారి మూలమూర్తిని షిండే దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు ప్రసాదాలను అందజేశారు. ఆలయం వెలుపల ఆయనకు బీజేపీ సాంస్కృతిక విభాగం జిల్లా కన్వీనర్ గుండాల గోపినాథ్ రెడ్డి సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

## చిన్న సినిమాలకు అవకాశం కల్పించాలి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సుమన్

తాడేపల్లి రూరల్: తెలుగు సినీ పరిశ్రమ ఏపీలో అభివృద్ధి చెందాలంటే చిన్న సినిమాలకు కూడా అవకాశం కల్పించాలని సినీ నటుడు సుమన్ అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్య నగర్ వద్ద గురువారం ఏపీ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. సుమన్ మాట్లాడుతూ తెలుగు సినిమా పరిశ్రమ మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరముందని, చిన్న సినిమాలకు అవకాశం ఇస్తే ఇండస్ట్రీ పదికాలాలు ఉంటుందన్నారు. చిన్న సినిమాలను ప్రోత్సహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సినిమాలకు ట్యాక్స్, షూటింగ్ బెనిఫిట్స్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. సుమన్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

## 'బీఎన్ఆర్'లో ఆఫర్ల సందడి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ధన్‌తేరాస్, దీపావళి పండుగల సందర్భంగా విజయవాడ ఎంజీ రోడ్‌లోని బీఎస్ఆర్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో ఈ నెల 9వ తేదీ(గురువారం) నుంచి ఆకర్షణీయమైన ఆఫర్లు ప్రారంభమయ్యాయని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బి.రోహిత్‌రెడ్డి, చైర్మన్ బి.నాగిరెడ్డి తెలిపారు. తమ షోరూమ్‌లో ఆకర్షణీయమైన మంత్లీ అడ్వాన్స్ బుకింగ్ ప్లాన్‌లున్నాయని పేర్కొన్నారు. ఈ ఆఫర్‌లో ప్రతి బంగారు వస్తువు కొనుగోలుపై మేకింగ్ చార్జీల్లో ఫ్లాట్ 50 శాతం ఆఫర్ వస్తుందని తెలిపారు. డైమండ్స్ క్యారెట్ రూ.54,000 ప్రారంభ ధరగా ఉంటుందని.. మేకింగ్‌పై 25 శాతం ఆఫర్ లభిస్తుందని పేర్కొన్నారు.

## అమెరికా వర్సిటీలు ఏయూతో కలసి పనిచేయాలి

- యూఎస్ఏలోని కార్మెల్ సిటీ మేయర్ జేమ్స్ బ్రెయినార్డ్
- ఏయూను సందర్శించి ప్రశంసలు



కార్మెల్ సిటీ మేయర్ జేమ్స్ బ్రెయినార్డ్‌ను సన్మానిస్తున్న ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తదితరులు

ఏయూక్యాంపస్: అమెరికా యూనివర్సిటీలు ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కలసి పనిచేయాలని యూఎస్ఏలోని ఇండియానా రాష్ట్రం కార్మెల్ సిటీ మేయర్ జేమ్స్ బ్రెయినార్డ్ అన్నారు. ఆయన గురువారం ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జేమ్స్ బ్రెయినార్డ్ మాట్లాడుతూ ఏయూ అభివృద్ధి కోసం అధికారులు చేస్తున్న కృషి, సాధించిన ప్రగతి చాలా బాగుందని ప్రశంసించారు. తాము విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని, ఫార్మా, వైద్య కళాశాలలు, మెరుగైన వైద్య సదుపాయాలు తమ నగరంలో ఉన్నాయన్నారు. నగరాల నిర్మాణం ఎంతో ప్రత్యేకమైన అంశమని, సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర వంటివి పరిగణనలోనికి తీసుకుని నిర్మించాల్సి ఉందన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సమాన అవకాశాలు కల్పించేవిగా నగరాలు ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా కార్మెల్ సిటీలో వసతులను కల్పిస్తున్నామని చెప్పారు. భారతీయ కళాకారులను తమ దేశానికి ఆహ్వానిస్తామన్నారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఏయూలో నెలకొల్పిన బలమైన స్టార్టప్ వ్యవస్థ, ఇంక్యుబేషన్ కేంద్రంతో అమెరికా విశ్వవిద్యాలయాలు కలసి పనిచేయాలని, ఈ దిశగా జేమ్స్ బ్రెయినార్డ్ కృషిచేయాలని కోరారు. అనంతరం జేమ్స్ బ్రెయినార్డ్‌ను వీసీ సన్మానించారు.

# మనసున్న ప్రజా నాయకుడు సీఎం జగన్

న్యూజిలాండ్ సదస్సులో వక్తలు



శాంతమూర్తి

గుంటూరు (ఎడ్యుకేషన్): మనసున్న ప్రజా నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పలువురు వక్తలు కొనియాడారు. న్యూజిలాండ్‌లోని శాండింగ్రామ్‌లో 'సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం' అనే అంశంపై గురువారం సదస్సు నిర్వహించారు. సదస్సుకు మన రాష్ట్రం నుంచి వెళ్లిన అవర్ స్టేట్ అవర్ లీడర్, వైఎస్సార్ ఇంటెలెక్చ్యువల్ ఫోరం వ్యవస్థాపకుడు జి.శాంతమూర్తి ముఖ్య ప్రసంగం చేస్తూ.. మానవత్వం లేని నాయకులు ఎంత గొప్పవారైనా వ్యర్థమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, నవరత్నాల అమలు, సుదీర్ఘ ప్రజా సంకల్ప యాత్ర వంటి అంశాలకు అక్కడి తెలుగు ప్రజలు, ప్రముఖులకు వివరించారు. సుదీర్ఘ పాదయాత్రతో ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన వైఎస్ జగన్ నిండైన మానవత్వం కలిగిన నాయకునిగా పేద ప్రజల గుండె చప్పుడు విన్నారని చెప్పారు. అధికారంలోకి రాగానే ప్రజల జీవితాలను మార్చే మహత్తరమైన పథకాలకు నవరత్నాల రూపంలో శ్రీకారం చుట్టారని వివరించారు. నాలుగున్నరేళ్లుగా అవినీతికి, రాజకీయ సిఫార్సులకు తావు లేకుండా నేరుగా ప్రజల బ్యాంకు ఖాతాల్లోకి రూ.లక్షల కోట్లు జమ చేశారని వివరించారు. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చిన ఏకైక సీఎంగా నిలిచారని, జగనన్న అమ్మఒడి, ఆరోగ్యశ్రీతో పేదల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడంలో తోడ్పాటు అందించారని చెప్పారు. సదస్సులో ఫోరం సభ్యులు మాట్లాడుతూ.. పేదల కష్టాలను గుర్తించిన నాయకులనే వారు జీవితాంతం గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు.

# ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి కేసులో గ్యాంగ్ లీడర్ అరెస్ట్

- నిందితుడి ఇంట్లో పోలీసుల తనిఖీలు
- రూ.7 లక్షల నగదు, ఎయిర్ పిస్టల్, వాకిటాకీలు తదితర వస్తువుల స్వాధీనం



ఎయిర్‌గన్ చూపుతున్న ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి

నెల్లూరు (క్రైమ్): కావలిలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి ఘటనతో పాటు తక్కువ ధరకే బంగారం, నోట్ల మార్పిడి తదితర నేరాలకు పాల్పడుతున్న గ్యాంగ్‌లీడర్ దేవరకొండ సుధీర్ అలియాస్ అజయ్‌రెడ్డిని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. అతని ఇంట్లో సోదాలు నిర్వహించి ఎయిర్‌గన్‌లు 4, హ్యాండ్‌కప్స్ 4, వాకీటాకీలు 4, కత్తులు రెండు, ఫోల్డింగ్ ఐరన్ స్టిక్‌లు రెండు, జామర్స్ 2, పెద్ద సంఖ్యలో సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్స్, నగదు రూ.7 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో గురువారం జిల్లా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. నిందితుడిపై రాష్ట్రంలోని 10 పోలీస్ స్టేషన్‌లలో 25 కేసులున్నాయని, కావలి టూ టౌన్ పోలీసుస్టేషన్‌లో సస్పెక్టెడ్ షీటు ఉందన్నారు. నిందితుడు అనుచరులతో గ్యాంగ్‌ను ఏర్పాటు చేసి ఏపీ, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో తక్కువ ధరకు బంగారం, నోట్ల మార్పిడి, నకిలీ పోలీసుల అవతారంలో నేరాలు, మోసాలకు పాల్పడుతున్నాడని ఎస్పీ తెలిపారు. ఇటీవల నిందితుడి మోసాలపై పలువురు ఫిర్యాదులు చేయగా.. వాటిపై కేసులు నమోదు చేస్తున్నట్టు చెప్పారు. పరారీలో ఉన్న మిగిలిన వారి కోసం గాలిస్తున్నామని వివరించారు. సమావేశంలో ఏఎస్పీ హిమవతి, కావలి డీఎస్పీ వెంకటరమణ పాల్గొన్నారు.

# అంతర్గత జలరవాణాకు మార్గం సుగమం!

- దేశంలోనే తొలి అంతర్గత జలరవాణా ప్రాజెక్ట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు
- కృష్ణా నదిపై ముక్త్యాల–మాదిపాడు మధ్య రోరో సర్వీసు
- ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఏర్పాటు తర్వాత చేపట్టిన తొలి ప్రాజెక్టు ఇది

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అంతర్గత జలరవాణాను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం తొలి అడుగు వేసింది. దేశంలోనే తొలిసారిగా అంతర్గత జలరవాణా ద్వారా ప్రత్యేకంగా ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీని ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం... సరుకు రవాణా చేసేందుకు కృష్ణానదిపై మొదటి ప్రాజెక్టు ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఎన్టీఆర్ జిల్లాలోని ముక్త్యాల (కృష్ణా నది ఎడమ గట్టు) నుంచి పల్నాడు జిల్లాలోని మాదిపాడు(కృష్ణానది కుడి గట్టు)కు రోల్ ఇన్–రోల్ ఆన్ (రోరో) లేదా ఫెర్రీ (సరుకు రవాణా చేసే ఓడలు) సర్వీసును పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్‌షిప్(పీపీపీ) విధానంలో ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రోరో విధానంలో సరుకు రవాణా చేయడానికి ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించినట్లు ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ సీఈవో ఎస్‌వీకే రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. రోరో అంతర్గత జలరవాణాకు సంబంధించి దేశంలోనే తొలిసారిగా పీపీపీ విధానంలో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రెండు వైపుల నదీ గట్లను పటిష్టం చేసి జెట్టీలతోపాటు అంతర్గత రహదారులను నిర్మించి పదేళ్లపాటు నిర్వహించే విధంగా ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ బిడ్లను ఆహ్వానించింది. ఆసక్తిగల సంస్థలు ఈ నెల 23వ తేదీలోపు బిడ్లను దాఖలు చేయాలి. రోరో సర్వీసు అందుబాటులోకి వస్తే ఫెర్రీల ద్వారా ఒకేసారి 15 వరకు సరుకు రవాణా వాహనాలను తీసుకువెళ్లేందుకు అవకాశం ఏర్పడుతుంది.

**తగ్గనున్న 125 కి.మీ. ప్రయాణ దూరం**

జాతీయ జలరవాణా మార్గం–4లో భాగంగా ముక్త్యాల–మాదిపాడు మధ్య రోరో సర్వీసులను రాష్ట్ర ప్రభుత్వం చేయాలని నిర్ణయించింది. ముక్త్యాలకు సమీపంలోని జగ్గయ్యపేట వద్ద ఉన్న పలు సిమెంట్ పరిశ్రమలు ఏటా 3 మిలియన్ టన్నుల సిమెంట్‌ను రోడ్డుమార్గం ద్వారా రవాణా చేస్తున్నాయి. ఈ రోరో సర్వీసులు అందుబాటులోకి వస్తే 125 కి.మీ. ప్రయాణ దూరం తగ్గుతుందని అంచనా. ముక్త్యాల నుంచి రోజుకు 500 ట్రక్కులు ప్రయాణిస్తున్నట్లు తమ సర్వేలో తేలిందని, రోరో సర్వీసులు ప్రవేశపెట్టడం ద్వారా ఏడాదికి 9.2 మిలియన్ లీటర్ల డీజిల్ వినియోగం తగ్గుతుందని, తద్వారా రూ.103 కోట్ల విదేశీ మారక నిల్వలు ఆదా అవుతాయని ఎస్‌వీకే రెడ్డి తెలిపారు. అంతేకాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఏడాదికి రూ.497 కోట్ల ఆదాయం సమకూరుతుందని చెప్పారు.

## గుర్తు ఇవ్వకపోతే నిరాహార దీక్ష

ప్రజాశాంతి వ్యవస్థాపక అధ్యక్షుడు పాల్



సాక్షి, న్యూఢిల్లీ: తమ పార్టీకి ఎన్నికల గుర్తు కేటాయించకపోతే నిరాహార దీక్ష చేస్తానని ప్రజాశాంతి వ్యవస్థాపక అధ్యక్షుడు పాల్ కేంద్ర ఎన్నికల సంఘాన్ని హెచ్చరించారు. ప్రజాశాంతి పార్టీ ఎన్నికల గుర్తు విషయంలో ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వం ఇబ్బంది పెడుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఓడిపోతారనే భయంతోనే గుర్తు రానివ్వకుండా అడ్డుకుంటున్నారనే అనుమానాలున్నాయని పేర్కొన్నారు. ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘం అధికారుల్ని గురువారం కలిసిన పాల్.. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 119 నియోజకవర్గాల్లో పోటీ చేసే తమ పార్టీకి ఇప్పటి వరకు గుర్తును కేటాయించకపోవడం దారుణమన్నారు. హెలికాప్టర్ లేదా ఉంగరం గుర్తులను ఇస్తామని చెప్పి.. నామినేషన్ చివరి తేదీ వచ్చినా కేటాయించకపోవడం కుట్రలో భాగమేనని ఆరోపించారు. తక్షణం ఎన్నికల గుర్తు కేటాయించి, నామినేషన్లకు రెండు రోజులు గడువు పెంచాలని కోరారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో విశాఖపట్నం ఎంపీగా పోటీ చేస్తానని పాల్ వెల్లడించారు.

## క్లుప్తంగా...

### స్వచ్ఛ దీపావళిలో భాగస్వాములు కావాలి

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు పిలుపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గంధం చంద్రుడు

సాక్షి, అమరావతి: పర్యావరణ హితమైన ఉత్పత్తులతో దీపావళి వేడుక జరుపుకోవాలని, స్వచ్ఛ దీపావళిలో ప్రజలు భాగస్వాములు కావాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు గురువారం పిలుపునిచ్చారు. స్వచ్ఛ భారత్ మిషన్ 2.0లో భాగంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ 'స్వచ్ఛ్ దీపావళి-శుభ్ దీపావళి' ప్రచారాన్ని చేపట్టింది. ఈ నెల 12వ తేదీ వరకు ప్రచారం కొనసాగుతుంది. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, నగరాల్లో ఈ ప్రచారం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు పర్యావరణ అనుకూలమైన మట్టి ప్రమిదలు ఉపయోగించాలని కోరారు. సీవోవో కిరణకుమార్ పాల్గొన్నారు. కాగా, విశాఖ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఉచితంగా మట్టి ప్రమిదలు పంపిణీ చేస్తామని చంద్రుడు చెప్పారు.

### ఇంటర్ 'ప్రత్యేక' విద్యార్థులకు సహాయకులు

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు, ప్రాక్టికల్స్‌కు హాజరయ్యే ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సహాయకుల(స్క్రైబ్)ను అందించనున్నారు. గత పదో తరగతి పరీక్షల్లో వీరి సహాయం తీసుకున్న విద్యార్థులను ఇంటర్మీడియట్‌లో ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ నేరుగా నియమించవచ్చని ఇంటర్ బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పుడు ఇంటర్ పరీక్షల్లో స్క్రైబ్ కావాల్సిన వారికి ఆర్ఐఓలు, డీవీఈఓలు ధ్రువీకరించాలని ఆదేశించారు.

### ఎన్నికల అధికారులతో సీఈసీ బృందం భేటీ

ఏపీ సహా 7 రాష్ట్రాల అధికారుల హాజరు

సాక్షి, చెన్నై: ఆంధ్రప్రదేశ్ సహా 7 రాష్ట్రాల ఎన్నికల ప్రధాన అధికారులతో చెన్నైలో గురువారం కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతినిధుల బృందం సమావేశమైంది. చెన్నై మీనంబాక్కంలోని ఓ హోటల్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు సమావేశం జరిగింది. కేంద్ర ఎన్నికల కమిషన్ సీనియర్ డిప్యూటీ కమిషనర్లు ధర్మేంద్రశర్మ, నితీష్‌వ్యాస్, మనోజ్‌కుమార్ సాహూలతో కూడిన బృందం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ ఎన్నికల అధికారులు, కేంద్ర పాలిత ప్రాంతాలైన పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులు, లక్ష దీవుల ఎన్నికల ప్రధాన అధికారులు, పోలీసుల అధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్రాల వారీగా ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు.

### మూగ జీవాలకూ అత్యాధునిక వైద్యం



సదస్సులో పాల్గొన్న డాక్టర్ కీత్ పొల్సెన్ తదితరులు

సాక్షి, అమరావతి: పశు వైద్య రంగంలో ఎప్పటికప్పుడు నూతన వైద్య విధానాలు అందుబాటులోకి వస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందని యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్ మాడిసన్ ప్రొఫెసర్లు కెయిత్ పొల్సెన్, రియాన్ బ్రేయర్, జాన్‌రెనీ లుండ్, గుడేవిడ్ జోడార్స్కి పేర్కొన్నారు. ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్, ఏపీ పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ వెటర్నరీ క్లినిక్ మెడిసిన్' అనే అంశంపై విజయవాడలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో వారు మాట్లాడుతూ మూగ, సన్నజీవాలకు వచ్చే గుండె జబ్బులు, పక్షవాతం, కిడ్నీ, చర్మ సంబంధిత వ్యాధుల నివారణకు నూతన వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. మూగ జీవాల ఆరోగ్య పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుండటం గొప్ప విషయమని.. పాడి జీవాలకు వైద్య సేవలందించేందుకు మొబైల్ అంబులేటరీ వెహికల్స్, 1962 ద్వారా టెలీ మెడిసిన్ వంటి సేవలు ప్రశంసనీయమన్నారు. పశుసంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎల్.రత్నకుమారి, ఈఎంఆర్ఐ ఏపీ ఆపరేషన్స్ హెడ్ రామకృష్ణవర్మ, వివిధ రాష్ట్రాల పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

### కాలానుగుణంగా వైద్యుల్లో మార్పు రావాలి

వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ బాబ్జీ

సాక్షి, అమరావతి: వైద్య విద్యార్థులు, అధ్యాపకుల్లో కాలానుగుణంగా మార్పు రావాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ బాబ్జీ అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని, పరిశోధనలను అందిపుచ్చుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. విజయవాడలోని విశ్వవిద్యాలయంలో గురువారం రీసెర్చ్ మెథడాలజీ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాబ్జీ మాట్లాడుతూ మన వైద్య కళాశాలల్లో పరిశోధనలను ప్రోత్సహించడం కోసం తద్వారా విద్యార్థులు, అధ్యాపకుల్లో నైపుణ్యాల పెంపునకు రెండు రోజుల వర్క్‌షాప్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. డీఎంఈ డాక్టర్ నరసింహం, విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి పాల్గొన్నారు.

# అభివృద్ధికి నిదర్శనం

▶ మొదటి పేజీ తరువాయి

సగర్వంగా చెబుతున్నట్లు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ముందుగా అన్నమయ్య జిల్లా రాయచోటిలో శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం కుమారుడి వివాహానికి హాజరైన అనంతరం హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 1.30 గంటలకు పులివెందుల భాకరాపురం హెలిప్యాడ్‌కు చేరుకున్న ముఖ్యమంత్రికి ఘన స్వాగతం లభించింది.

## సుందర శ్రీకృష్ణ దేవాలయం ప్రారంభం..

భాకరాపురం రింగురోడ్డు సర్కిల్‌లో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో రూ.4.54 కోట్ల వ్యయంతో అత్యంత సుందరంగా నూతనంగా శ్రీకృష్ణ దేవాలయాన్ని నిర్మించారు. ఆలయం వద్దకు చేరుకున్న సీఎం జగన్‌కు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనాలు అందించారు.



శ్రీకృష్ణ దేవాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న పండితుడు



భాకరాపురం రింగురోడ్డు సర్కిల్‌లో శ్రీకృష్ణ దేవాలయాన్ని ప్రారంభించిన అనంతరం వేద విద్యార్థులను ఆప్యాయంగా పలకరిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



రాయచోటిలో శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానం కుమారుడు వివాహ వేడుకకుహాజరై వధూవరులు మయానా ముషరఫ్ అలీఖాన్, ఖయంఖానీ మిస్బా ఖానంలకు శుభాశీస్సులు అందించిన సీఎం వైఎస్ జగన్



అన్నమయ్య జిల్లా రాయచోటిలో మాజీ ఎంపీపీ గౌస్ మహ్మద్ రఫీ కుటుంబ సభ్యుల వివాహ వేడుకకు హాజరై వధూవరులు మహ్మద్ నిహాజ్, నూర్ ఈ చష్మీలకు శుభాశీస్సులు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



శిల్పారామంలో జ్యూట్ బ్యాగ్ స్టాల్‌ను యజమానురాలు గౌరీతో ప్రారంభింపజేస్తున్న సీఎం జగన్

## ఆహ్లాదకరంగా శిల్పారామం..

పులివెందుల వాసులకు అత్యంత ఆహ్లాదకర, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తూ 38 ఎకరాల్లో రూ.14.04 కోట్లతో నిర్మించిన శిల్పారామంలో ఫేస్ లిఫ్టింగ్ పనులను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఇందులో 28 ఎకరాల్లో శిల్పారామం ఉండగా 10 ఎకరాల్లో ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేశారు. మ్యూజికల్ వాటర్ ఫౌంటెన్ విత్ గ్యాలరీ, హిల్ టాప్ టవర్‌లో 16.5 అడుగుల దివంగత వైఎస్సార్ విగ్రహం, పార్టీ జోన్, జిప్ లైన్ (రోప్ వే), బోటింగ్ ఐలాండ్ పార్టీ జోన్, చైల్డ్ ప్లే జోన్, వాటర్ ఫాల్, ఫుడ్ కోర్టుతోపాటు దివంగత వైఎస్సార్ కూర్చుని ఉన్న భంగిమలో ఐదు అడుగుల విగ్రహంతో ఆకట్టుకునే ఎంట్రీ ప్లాజా, సీసీ రోడ్లు, పార్కింగ్ ఏరియా, ఆహ్లాదకరమైన గ్రీనరీ శిల్పారామంలో ఉన్నాయి.

**ఆకట్టుకున్న ప్రదర్శనలు....**

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శిల్పారామం వద్ద సంప్రదాయ వాయిద్యాలైన సన్నాయి, డోలు బృందంతో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అక్కడ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం సంప్రదాయ బూర వాయిద్యాలు, డప్పు కళాకారుల దరువు, మోరగల్లు ప్రదర్శనలు, తోలు బొమ్మలాట, చెక్క భజనలు, జానపద నృత్యాల నడుమ సీఎం జగన్ పల్లె సంస్కృతి ఉట్టి పడేలా రూపొందించిన ప్రదర్శనలను తిలకించారు. చేతి వృత్తుల కళాకారులు జ్యూట్ బ్యాగ్‌లు, కలంకారీ పెయింటింగ్స్, చీరలు, ఆకట్టుకునే సంప్రదాయ ఆభరణాలను ప్రదర్శించారు. బోటింగ్ వద్ద భారీ స్క్రీన్‌పై క్రికెట్ మ్యాచ్ లైవ్ ప్రసారాలను ఏర్పాటు చేశారు. అక్కడికి సమీపంలోని ఎంబీ థియేటర్ వద్ద పులివెందుల ఉమెన్స్ డిగ్రీ కాలేజీ విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హిల్ టాప్‌పై దివంగత వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం జగన్ శిల్పారామం వ్యూ పాయింట్‌ను పరిశీలించారు. మ్యూజిక్ వాటర్ ఫౌంటెన్‌ను వీక్షించారు. అధికారులతో గ్రూప్ ఫోటో దిగి శిల్పారామం అంతా ఉత్సాహంగా కలియతిరిగారు.



పులివెందులలో శిల్పారామం ప్రారంభించిన అనంతరం బోటింగ్ పాయింట్‌ను పరిశీలిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఆదిత్య బిర్లా గార్మెంట్స్ యూనిట్‌లో ఉద్యోగినితో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

## ఆదిత్యా బిర్లా యూనిట్ సందర్శన...

పులివెందుల పర్యటనలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదిత్య బిర్లా గార్మెంట్స్ యూనిట్‌ను సందర్శించారు. వివిధ గ్రామాలకు చెందిన దాదాపు 500 మంది అందులో పని చేస్తున్నారు. ఈ సందర్భంగా మహిళలతో సీఎం కాసేపు ముచ్చటించారు. గార్మెంట్స్ ఉత్పత్తి వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిన్నప్ప, ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి ధనుంజయరెడ్డి, కలెక్టర్ వి.విజయ్‌రామరాజు, ఎస్పీ సిద్దార్థ్ కౌశల్, జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీస్వామినారాయణ గురుకుల పాఠశాలకు భూమి పూజ

దేశంలో అత్యంత ప్రసిద్ధి చెందిన శ్రీస్వామి నారాయణ అంతర్జాతీయ గురుకుల విద్యాపీఠం ఏర్పాటుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమి పూజ చేశారు. పులివెందులలో ఏపీ కార్ల్ ఎదురుగా 12 ఎకరాల్లో రూ.60 కోట్ల వ్యయంతో శ్రీస్వామి నారాయణ గురుకుల విద్యాపీఠాన్ని నిర్మించనున్నారు. తొలి విడతలో రూ.26 కోట్లు ఖర్చు చేయనున్నారు. 2025 నుంచి అడ్మిషన్లు ప్రారంభం కానున్నట్లు విద్యాపీఠం తెలిపింది. హైదరాబాద్, జడ్చర్ల నుంచి వచ్చిన గురుకుల పీఠానికి చెందిన స్వామీజీలు, విద్యార్థులతో కలసి సీఎం జగన్ గ్రూప్ ఫోటో దిగారు.

## హార్టికల్చర్ కాలేజీ.. అత్యాధునిక ల్యాబ్..

పులివెందులలోని ఏపీ కార్ల్ ప్రాంగణంలో రూ.9.96 కోట్ల 'పాడా' నిధులతో నిర్మించిన అగ్రికల్చర్ అండ్ హార్టికల్చర్ కాలేజీలను ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించారు. 60 సీట్లు బీఎస్సీ అగ్రికల్చర్‌లో, 61 సీట్లతో బీఎస్సీ హార్టికల్చర్ కోర్సులను అందిస్తున్నాయి. అక్కడే ఏపీ కార్ల్‌లో రూ.11 కోట్ల వ్యయంతో నిర్మించిన స్టేట్ ఆఫ్ ఆర్ట్ సెంట్రల్ టెస్టింగ్ లేబొరేటరీని కూడా ముఖ్యమంత్రి ప్రారంభించారు. పాలు, పాల ఉత్పత్తుల తనిఖీ, నాణ్యతా పరీక్షలు, డయాగ్నొస్టిక్ సేవలు, నిర్దిష్ట వ్యాధి కారక క్రిముల ఉత్పత్తులను పరీక్షించడం, ఆహార ధాన్యాలు, తృణధాన్యాలు పప్పుల నమూనాల విశ్లేషణ, ఫార్మా అప్లికేషన్ పరీక్షల నిర్వహణ తదితరాలకు ఈ ల్యాబ్ సేవలు అందిస్తుంది.



పులివెందులలోని ఏపీ కార్ల్ ప్రాంగణంలో అత్యాధునిక స్టేట్ ఆఫ్ ఆర్ట్ సెంట్రల్ టెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభించి పరికరాలను పరిశీలిస్తున్న సీఎం వైఎస్ జగన్

# జనం పట్టిన జెండా



విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు



చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పంలో వై ఏపీ నీడ్స్ జగన్ బుక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్



అనంతపురం జిల్లా రాయదుర్గంలో సంక్షేమ లబ్ధి బోర్డును ఆవిష్కరించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

దూసుకెళ్లాలంటే మాట తప్పని, మడమ తిప్పని యోధుడు 'జగనే కావాలంటూ..' అన్ని వర్గాల ప్రజలు ఒక్కటై నినదించారు. అందరి ఆకాంక్షలను నెరవేరుస్తూ, మనోభావాలను గౌరవిస్తున్న వైఎస్సార్ సీపీ తమదంటూ ప్రజలంతా పార్టీ జెండాను పట్టారు. విజయవాడ, విశాఖలో భారీ ర్యాలీలతో కదం తొక్కారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' (ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే..) కార్యక్రమం ప్రారంభం సందర్భంగా తొలిరోజు గురువారం గ్రామ, వార్డు సచివాలయాల వద్ద నెలకొన్న పండుగ వాతావరణం ఇదీ!

**సాదర స్వాగతాల నడుమ..**

రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా విప్లవాత్మక పరిపాలనతో చేసిన మంచిని వివరించడంతోపాటు అధికారంలో ఉండగా చంద్రబాబు-పవన్ కళ్యాణ్ జోడీ చేసిన మోసాలను గుర్తు చేయడమే లక్ష్యంగా చేపట్టిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం గురువారం 26 జిల్లాల్లో 660 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో భారీ జనసందోహం, జగన్నినాదాల మధ్య ఘనంగా ప్రారంభమైంది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గాల ఇన్‌చార్జులు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, గృహ సారథులు, కార్యకర్తలు, పార్టీ మద్దతుదారులు, సీఎం జగన్ అభిమానులు ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున పాల్గొన్నారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడి నేతృత్వంలో ప్రజాప్రతినిధులు మధ్యాహ్నం గ్రామ సచివాలయాల వద్దకు చేరుకోగానే సర్పంచులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ ప్రజలు సాదరంగా స్వాగతం పలికారు. సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా గ్రామానికి చేసిన మంచిని గణాంకాలతో సహా వివరించేలా సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం భారీ జనసందోహం మధ్య గ్రామ ప్రధాన కూడళ్లలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి నేతలు ప్రసంగించారు.

**వాస్తవాలను వివరించి వంచనలను ఎండగడుతూ**

నాలుగున్నరేళ్లుగా సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా రాష్ట్రాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రగతిపథంలో నిలపడాన్ని నేతలంతా ప్రజలకు వివరించారు. ఆయా గ్రామాలకు చేసిన మంచిని గణాంకాలతో సహా కళ్లకు కట్టినట్లు వెల్లడించారు. ఎన్నికల మేనిఫెస్టోలో 99.5 శాతం హామీలను సీఎం వైఎస్ జగన్ అమలు చేసి మాట నిలబెట్టుకోగా 2014లో చంద్రబాబు వ్యవసాయ, డ్వాక్రా రుణాలను మాఫీ చేయకుండా నిలువుగా మోసగించిన తీరును వివరించారు. ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనన్న భయంతో నాడు అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే చంద్రబాబు మేనిఫెస్టోను మాయం చేయడాన్ని గుర్తు చేశారు. చంద్రబాబు ఇచ్చిన హామీల అమలు పూచీ తనదంటూ 2014లో నమ్మబలికిన పవన్ కళ్యాణ్ అనంతరం దగా చేసిన తీరును ఎండగట్టారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు-పవన్‌లు ఉమ్మడి మేనిఫెస్టోతో వస్తున్నారని, వారికి తగినరీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సుపరిపాలన కొనసాగాలంటే సీఎం జగన్‌ను ఆశీర్వదించి మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

**మా నమ్మకం నువ్వే జగన్ అంటూ నినాదాలు..**

నేతలు పార్టీ జెండాను ఆవిష్కరించి ప్రసంగిస్తున్న సమయంలో పలుచోట్ల మా నమ్మకం నువ్వే జగన్.. జగనన్నే మా భవిష్యత్తు అంటూ ప్రజలు నినదించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్ల మంచి జరిగిందని అనుకుంటేనే ఓటేయాలని సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి చేస్తున్నారని, మంచి చేసిన జగన్ వెంటే తాము నడుస్తామని ప్రజలు స్పష్టం చేశారు. విప్లవాత్మక పరిపాలనను అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్న దుష్ట శక్తుల ఆట కట్టిస్తామంటూ నినదించారు.

**నేడు 721 సచివాలయాల పరిధిలో ప్రారంభం..**

గ్రామాల్లో సమావేశాలు ముగిశాక రాత్రికి వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లలో పార్టీ నేతలు బస చేశారు. శుక్రవారం ఉదయం వలంటీర్లు, గృహ సారథులతో కలిసి ఇంటింటా ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. గ్రామ సచివాలయం పరిధిలోని ప్రతి ఇంటికీ వలంటీర్లు, గృహ సారథులు, పార్టీ మద్దతుదారులు, సీఎం జగన్ అభిమానులు వెళ్లి ప్రచారాన్ని కొనసాగిస్తారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలో వివరిస్తూ 24 పేజీలతో రూపొందించిన పుస్తకాన్ని ప్రతి ఇంటికీ అందించనున్నారు. సీఎం వైఎస్ జగన్ హామీల అమలు తీరు – చంద్రబాబు హామీల అమలు తీరుపై ప్రతి ఇంటా సర్వే నిర్వహిస్తారు. ఆ తర్వాత ప్రజాతీర్పు పుస్తకంలో ఆయా కుటుంబాల అభిప్రాయాన్ని నమోదు చేస్తారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడి నేతృత్వంలోని పార్టీ ప్రతినిధుల బృందం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నేడు 721 సచివాలయాల పరిధిలో ప్రారంభించనుంది.

**విజయవాడ, విశాఖలో భారీ ర్యాలీలు**

'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం సందర్భంగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని 26వ డివిజన్ మారుతీనగర్ 29వ సచివాలయంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కృష్ణా జిల్లా పెడనలో ర్యాలీని మంత్రి జోగి రమేష్ జెండా ఊపి ప్రారంభించారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలంలో ఎమ్మెల్సీ భరత్ 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## సామాజిక న్యాయంలో దేశానికే ఏపీ ఆదర్శం

- సీఎం జగన్ వల్లే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మేలు
- ఆయా కులాల్లో పూర్తిగా పేదరిక నిర్మూలన జరగాలంటే మళ్లీ సీఎంగా జగన్ అవసరం: ఆర్.కృష్ణయ్య



సాక్షి, అమరావతి : ఏపీకి సీఎం వైఎస్ జగన్ నాయకత్వం చాలా అవసరమని, ఆయన వల్లే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మేలు జరుగుతోందని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కితాబిచ్చారు. ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మారేష్ అధ్యక్షతన పలు బీసీ కుల సంఘాల సమావేశం గురువారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ సీఎం జగన్ నాయకత్వంలో ఏపీలో బహుజన ప్రభుత్వం చరిత్ర సృష్టిస్తోందని, బీసీలకు సామాజిక న్యాయం చేకూర్చడంలో దేశంలోని 29 రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లోని పేదరికం పూర్తిగా నిర్మూలన జరగాలంటే ఏపీకి సీఎం జగన్ నాయకత్వం అవసరమని చెప్పారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు సాధించేవరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని, రానున్న శీతాకాల సమావేశాల్లో బిల్లు పెట్టేలా కేంద్రంపై ఒత్తిడి పెంచాలని సూచించారు. మారేష్ మాట్లాడుతూ బహుజనులకు రాజ్యాధికారం కావాలంటే ఏపీకి మళ్లీ వైఎస్ జగన్ సీఎంగా రావాలని చెప్పారు. అట్టడుగు వర్గాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటుంటే ప్రతిపక్షాలు తట్టుకోలేకపోతున్నాయని విషం కక్కుతున్నాయని ధ్వజమెత్తారు. మళ్లీ రానుంది జగన్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని, దేశవ్యాప్తంగా కుల గణన చేయాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీ సబ్ ప్లాన్ చట్టం తేవాలని.. ఇలా 11 తీర్మానాలను సమావేశం ఆమోదించింది.

# పిల్లల ఎత్తును నిర్ణయించేది జన్యుపర అంశాలే కాదు

**సీసీఎంబీ పరిశోధనలో వెల్లడి**

సాక్షి, అమరావతి: మానవుల ఎత్తును జన్యుపరమైన అంశాలే కాకుండా పర్యావరణ పరిస్థితులు కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఐరోపా దేశాలతో పోలిస్తే తక్కువ, మధ్య ఆదాయ దేశాల్లో (ఎల్ఎంఐసీ) పర్యావరణ కారకాలు పిల్లల ఎత్తుకు అవరోధంగా మారుతున్నట్టు ఈ ముఖ్యమైన అన్వేషణలో కొనుగొన్నారు. హైదరాబాద్‌కు చెందిన సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ, అనేక ఇతర జాతీయ, అంతర్జాతీయ సంస్థల విసృత అధ్యయనంలో సరికొత్త విషయాలు వెల్లడయ్యాయి. ఇటీవల ఈ పరిశోధన వివరాలను జర్నల్ నేచర్ కమ్యూనికేషన్స్‌లో ప్రచురించారు. ఈ పరిశోధనలో 35వేల మంది వ్యక్తుల డేటాను శాస్త్రవేత్తలు విశ్లేషించారు.

**పోషకాహార లోపంతో..**

జీవనశైలి, ఆహారం, పర్యావరణం వంటి కారకాలు జన్యువులు పనిచేసే విధానాన్ని ప్రభావితం చేస్తాయని పరిశోధకులు తేల్చారు. బాల్యంలో అనారోగ్యం, పోషకాహార లోపానికి గురైతే తీవ్ర దీర్ఘకాలిక ప్రభావాలు ఉంటాయని చెబుతున్నారు. ఈ బాహ్య జన్యు మార్పులతో జన్యు నియంత్రణ, జన్యు వ్యక్తీకరణలో మార్పులు సంభవిస్తున్నాయి. ఇక్కడ ఎస్ఓసీఎస్3 జన్యువులోని మిథైలేషన్ తక్కువ, మధ్య ఆదాయ దేశాలల్లో పిల్లల ఎత్తుపై అధిక ప్రభావం చూపుతున్నట్టు గుర్తించారు. మిథైలేషన్ అనేది డీఎన్ఏలోని కేవలం రసాయన మార్పు. ఇది అధిక ఆదాయ దేశాల్లో బయటపడినా తక్కువగా పరిమాణంలో ఉంది. సరైన ఆహారం లేకపోవడం, మందులు, ఒత్తిడి, రసాయనాలు, టాక్సిన్‌లకు గురికావడం వంటి బయటి కారకాలతో ఇది ప్రభావితమవుతున్నట్టు తేలింది.

**ధనిక దేశాలతో పోలిస్తే పొట్టిగా..**

ఆసక్తికరంగా 12వేల జన్యు వైవిధ్యాలలో భారతీయుల ఎత్తుకు సంబంధించిన అంశాల ప్రభావం ఐరోపా, అమెరికా దేశాల ప్రజలపై తక్కువగా ఉంది. గతంలో మానవ ఎత్తుపై పరిశోధనలు కేవలం జన్యుపరమైన కారకాల చుట్టూనే కేంద్రీకృతమైంది. అయితే.. ఈ అధ్యయనం బాహ్యాజన్యు కారకాల పాత్రను బయటపెట్టింది. సామాజిక, ఆర్థిక స్థితి, పోషకాహారం, ఇన్ఫెక్షన్ వంటి కారకాలు చిన్నారుల ఆరోగ్యం, ముఖ్యంగా వారి ఎత్తుపై తీవ్ర ప్రభావాన్ని కలిగిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2021 ప్రకారం, ధనిక దేశాలలో కంటే పోషకాహార లోపం, సంబంధిత సమస్యలు ఎక్కువగా ఉన్న దక్షిణాసియా, ఆఫ్రికాలోని పట్టణ ప్రాంతాలలో ఎక్కువ మంది చిన్నారులు ఉండాల్సిన ఎత్తుకంటే తక్కువగా ఉంటున్నట్టు పేర్కొంది.

# స్వలాభం కోసం ధర్నా నాటకం

## పాలకొల్లులో ఇళ్లు పొందిన నివాసితులతో టీడీపీ నేత ఓవరాక్షన్

- బ్యాంకు రుణాలపై రెండేళ్లు మారటోరియం.. లేదా ఇళ్లు ఇచ్చేవరకు ఈఎంఐ లేదు
- ఆలోగా ఇళ్లు కేటాయించకపోతే ప్రభుత్వమే ఈఎంఐ చెల్లింపు
- పాలకొల్లులో 6,144 టిడ్కో ఇళ్ల నిర్మాణం
- వీటిలో 2,208 గృహాలు ఉచితంగా ఇచ్చినవే..
- 3,936 మంది లబ్ధిదారులకు 11 బ్యాంకుల నుంచి రుణాలు
- వీరిలో 14 నెలలపాటు వాయిదాలు చెల్లించని వారు 27 మంది
- వాయిదాలు చెల్లించేందుకు సిద్ధమైనా వీరిని పక్కదారి పట్టించిన 'పచ్చ'బ్యాచ్

**సాక్షి, అమరావతి:** పట్టణ పేదలకు రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు నిష్పాక్షికంగా ఇళ్లను కేటాయిస్తే టీడీపీ నేతలు జీర్ణించుకోలేక దుష్ప్రచారానికి తెగబడుతున్నారు. స్వలాభం కోసం ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. పాలకొల్లు పట్టణ పరిధిలో లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్లపై ఇదే తరహాలో నాటకానికి తెరతీశారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 76,466 ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించి తాళాలు అందించగా వారంతా సంతోషంగా అక్కడ ఉంటున్నారు. వీటిలో 300 చ.అ. విస్తీర్ణం గల ఒక్కో ఇంటిని రూ.6.55 లక్షల వ్యయంతో నిర్మించి ప్రభుత్వం నిరుపేదలకు 33,484 ఇళ్లను ఉచితంగా అందించింది. అలాగే, 430 చ.అ. కేటగిరిలో 14,770 ఇళ్లను నిర్మించి 28,212 ఇళ్లను లబ్ధిదారులకు అందించారు. అలాగే.. 365 చ.అ. ఇంటికి రూ.7.55 లక్షలు ఖర్చవగా, ఇందులో ప్రభుత్వం రూ.4.15 లక్షలు భరిస్తోంది. లబ్ధిదారులు తమ వాటాగా రూ.3.40 లక్షలు చెల్లించాలి. అలాగే, రూ.8.55 లక్షలతో నిర్మించిన 430 చ.అ. ఇళ్లకు ప్రభుత్వం రూ.4.15 లక్షలు, లబ్ధిదారులు తమ వాటాగా రూ.4.40 లక్షలు చెల్లించాలి. రెండు, మూడు కేటగిరీ ఇళ్ల లబ్ధిదారులు, రుణాలు మంజూరు చేసిన బ్యాంకులు, సంబంధిత మున్సిపాలిటీల మధ్య త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. దీని ప్రకారం ఈఎంఐ చెల్లింపు కోసం 24 నెలల మారటోరియం ఉండగా.. 20 ఏళ్ల పాటు రుణ వాయిదాలు చెల్లించాలన్నది నిబంధన. ఇక మారటోరియం గడువు 24 నెలలు ఉన్నప్పటికీ ఆలోగా ఇంటి తాళాలు లబ్ధిదారులకు అప్పగిస్తే రుణ వాయిదాలు వారే అప్పటి నుంచి చెల్లించాలి. ఒకవేళ ఆ గడువులోగా ఇంటిని అప్పగించకపోతే రుణ వాయిదాలను ప్రభుత్వమే చెల్లిస్తుంది. దీని ప్రకారమే ఈ రెండు కేటగిరిల్లో ఇళ్లు పొందిన లబ్ధిదారులు తమ రుణ వాయిదాలను క్రమం తప్పకుండా బ్యాంకులకు చెల్లిస్తున్నారు.

### పాలకొల్లులో జరిగిందిదీ..

ఇక పాలకొల్లు పీఎంఏవై (యూ)–వైఎస్సార్ జగనన్న నగర్‌లో 6,144 ఇళ్లను ఏపీ టిడ్కో నిర్మించింది. ఇందులో 300 చ.అ కేటగిరిలో 2,208 ఇళ్లు, 365/430 చ.అ కేటగిరిలో 3,936 ఇళ్లను నిర్మించారు. గతేడాది ఆగస్టు 5న 1,856 ఇళ్లను లబ్ధిదారులకు అందించారు. వీటిలో 300 చ.అ. కేటగిరిలో 608 ఉండగా, 365 చ.అ. కేటగిరిలో 160, 430 చ.అ కేటగిరిలో 1,088 ఉన్నాయి. ఈ లబ్ధిదారులకు స్థానికంగా ఉన్న 10 జాతీయ బ్యాంకులతో పాటు ఏలూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) నుంచి రుణాలు మంజూరు చేశారు. అయితే, అన్ని బ్యాంకుల్లోను 24 నెలల మారటోరియం, 20 ఏళ్ల చెల్లింపు గడువు ఉండగా.. ఏలూరు డీసీసీబీలో మారటోరియం గడువును 12 నెలలుగాను, 20 ఏళ్ల రీ పేమెంట్‌కు బదులు 84 నెలల గడువు నిర్దేశిస్తూ 59 మంది లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేశారు. వీరికి 2022 ఆగస్టు 5న ఇళ్లు కేటాయించి తాళాలు అందించారు. వారంతా ఇప్పుడు అవే ఫ్లాట్లలో ఉంటున్నారు. అయితే, నిబంధన ప్రకారం ఆయా లబ్ధిదారులు రుణ వాయిదాలు చెల్లించాల్సి ఉండగా, వారిలో 27 మంది దాదాపు 14 నెలలుగా రుణ వాయిదాలు చెల్లించలేదు. దీంతో డీసీసీబీ పాలకొల్లు బ్రాంచ్ అధికారులు నోటీసులు జారీచేశారు. త్రైపాక్షిక ఒప్పందంలో పేర్కొన్న మార్గదర్శకాలు అన్ని బ్యాంకులకు ఒకే రీతిలో ఉండగా, అవే నిబంధనలను అమలు చేయాలని ఏపీ టిడ్కో అధికారులు కోరగా, అందుకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్లు ఏపీ టిడ్కో ఎండీ చిత్తూరి శ్రీధర్ తెలిపారు.

### స్థానిక టీడీపీ నేత తప్పుడు ప్రచారం..

ఈ నేపథ్యంలో.. పాలకొల్లులో 365, 430 చ.అ. విస్తీర్ణం ఇళ్లు పొందిన లబ్ధిదారులు 14 నెలల పాటు ఈఎంఐ చెల్లించనందున నోటీసులు అందుకున్నారు. ఇక్కడే స్థానిక టీడీపీ నేత ఒకరు తన స్వలాభం కోసం తప్పుడు ప్రచారానికి దిగారు. వారంతా వాయిదాలు చెల్లించేందుకు సిద్ధమైతే ఇళ్లను కూడా ఉచితంగా ఇవ్వాలని ధర్నా చేయించారు.

# చంద్రబాబుకి దక్కని ఊరట

- ఫైబర్‌నెట్ కేసు విచారణ 30కి వాయిదా
- స్కిల్ కేసులో తీర్పు దీపావళి తర్వాతేనన్న సుప్రీంకోర్టు



**సాక్షి, న్యూఢిల్లీ:** చంద్రబాబుకు సుప్రీంకోర్టులో మరోసారి ఊరట లభించలేదు. ఫైబర్‌నెట్ కేసులో ముందస్తు బెయిలు కోసం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఈనెల 30కి వాయిదా వేసింది. చంద్రబాబు పిటిషన్ గురువారం జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదీలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించబోతుండగా.. జస్టిస్ అనిరుద్ధ బోస్ జోక్యం చేసుకుని స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో ఎఫ్ఐఆర్ క్వాష్ చేయాలంటూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పు దీపావళి సెలవుల తర్వాత వెలువడే అవకాశముందని లూథ్రానుద్దేశించి చెప్పారు. ఆ కేసులో తీర్పు వెలువడిన తర్వాతే ఫైబర్‌నెట్ కుంభకోణం కేసు విచారించాల్సి ఉంటుందన్నారు. మరోవైపు.. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుకి అక్టోబరు 30న ఏపీ హైకోర్టు నాలుగు వారాల మధ్యంతర బెయిలు ఇచ్చిందని ఏపీ సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఫైబర్‌నెట్ కేసు నవంబరు 23కు వాయిదా వేస్తామని ధర్మాసనం పేర్కొంది. అయితే, మరో తేదీన విచారణ చేపట్టాలని లూథ్రా విజ్ఞప్తి చేశారు. దీంతో నవంబరు 30కు ఫైబర్‌నెట్ కేసు విచారణ వాయిదా వేశారు. అప్పటివరకూ చంద్రబాబును అరెస్టుచేయకూడదని ఆదేశాలివ్వాలని లూథ్రా కోరారు. దీనిపై ఇప్పటికే ఒప్పందం ఉందిగా అని ఏపీ సీఐడీ తరఫు మరో సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ గుర్తుచేశారు. అనంతరం.. అక్టోబరు 30 వరకూ చంద్రబాబును అరెస్టు చేయరని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అలాగే, 'పిటిషనర్ దాఖలు చేసిన మరో పిటిషన్ ఉంది. దాంట్లో రిజర్వు చేసిన తీర్పు ఇదే ధర్మాసనం ఇవ్వాల్సి ఉంది. రెండింటికీ ముడిపడిన అంశాలున్నాయి. అందువల్ల ఈ కేసు నవంబరు 30కు జాబితా చేయాలని ఆదేశిస్తున్నాం'.. అని ధర్మాసనం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఫైబర్‌నెట్ కేసులో సుప్రీంకోర్టు విచారణ సాగుతుండగా చంద్రబాబును అరెస్టుచేయబోమని ఏపీ సీఐడీ ధర్మాసనానికి ఇప్పటికే చెప్పిన విషయం విదితమే.

# బాబుకు బెయిలొచ్చాక సభలు పెడతాం

- జనసేనతో కలిసే ముందుకెళ్తాం
- 17 నుంచి 'భవిష్యత్ గ్యారెంటీ' ప్రచారం
- టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

**సాక్షి, అమరావతి:** చంద్రబాబు ప్రస్తుతం తాత్కాలిక బెయిల్‌పై ఉన్నారని, ఆయనకు పూర్తిస్థాయి బెయిల్ వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా సభలు నిర్వహిస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు చెప్పారు. ఈ సభల్లో చంద్రబాబు, పవన్ పాల్గొంటారని తెలిపారు. గురువారం విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో టీడీపీ–జనసేన జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, ఇరుపార్టీల నాయకులు పాల్గొన్నారు. అనంతరం అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రానికి పట్టిన శని జగన్‌ను వదిలించడమే టీడీపీ–జనసేన మొదటి టార్గెట్ అని చెప్పారు. జనసేనతో కలిసే ముందుకెళ్తామన్నారు. ఈ నెల 14, 15, 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండు పార్టీల ఆత్మీయ సమావేశాలు ఉంటాయని తెలిపారు. రెండు పార్టీల నుండి ముగ్గురేసి నాయకులతో మేనిఫెస్టో కమిటీని ఏర్పాటు చేస్తామని, ఈ కమిటీ తొలి సమావేశం ఈ నెల 13న జరుగుతుందని అన్నారు. 17 నుండి రెండు పార్టీలు భవిష్యత్ గ్యారెంటీ ప్రచారం చేపడతాయన్నారు. ప్రజా సమస్యలపైన 15 రోజులకు ఒకసారి (శుక్ర, శని వారాల్లో) ఆందోళనలు చేస్తామన్నారు. ఈ నెల 18, 19 తేదీల్లో రోడ్ల పరిస్థితిపై ఆందోళన చేపడతామన్నారు. సీట్ల సర్దుబాటుపై సమావేశంలో చర్చించలేదని అచ్చెన్నాయుడు చెప్పారు. రాష్ట్రంలో కరువు లేదని సీఎం వైఎస్ జగన్ చెబుతున్నారని, ప్రతి రైతును ఆదుకునేలా ఉద్యమిస్తామని చెప్పారు.

**ఎన్డీఏ భాగస్వామిగా తెలంగాణలో పోటీ: నాదెండ్ల**

ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్నాం కాబట్టి కలిసి పోరాడదామన్న బీజేపీ నాయకత్వం సూచన మేరకు తెలంగాణాలో మిత్రపక్షంగా పోటీ చేస్తున్నామని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ చెప్పారు.

## తహసీల్దార్, వీఆర్వో డిస్మిస్

**కర్నూలు(సెంట్రల్):** ప్రకాశం జిల్లా దోర్నాల మండలం ఇనముక్కల గ్రామ పరిధిలో భూ అక్రమాలకు పాల్పడిన అప్పటి తహసీల్దార్ కేవీఆర్‌వీ ప్రసాదరావు, వీఆర్వో ఎం.డేనియల్‌ను ఉద్యోగాల నుంచి తొలగించినట్లు సీసీఎల్‌ఏ, ప్రకాశం జిల్లా కలెక్టర్ లోకాయుక్తకు నివేదికను సమర్పించారు. సమగ్ర విచారణ చేసి రెవెన్యూ రికార్డుల్లోని తప్పులను సరిదిద్ది సమర్పించిన నివేదికపై చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి సంతృప్తి వ్యక్తం చేసి కేసును ముగిస్తున్నట్లు ప్రకటించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. 2018లో ప్రకాశం జిల్లా దోర్నాల మండలం ఇనముక్కల గ్రామ పరిధిలోని 777,779/2,8 17/1,383/5, 488/1ఏ, 649/1, 554-5హెచ్, 572-5ఏ,554-1బీ, 554-1ఏ, 542,827-4, 587-3, 527 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూములను అప్పటి తహసీల్దార్ కేవీఆర్‌వీ ప్రసాదరావు, వీఆర్వో ఎం.డేనియల్ తమ బంధువులు, వారికుటుంబ సభ్యులు, మిత్రులు, డబ్బులు ఇచ్చిన వారికి పట్టాలిచ్చారు. అలాగే సర్వే నంబర్లు 231, 228లోనూ.. రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేసి తమ అనుకూల వ్యక్తులకు పట్టాలు ఇచ్చారు. ఈ రెండు ఘటనలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కోరుతూ అప్పట్లో జే వెంకటేశ్వర్లు అనే వ్యక్తి లోకాయుక్తకు ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదుపై స్పందించిన లోకాయుక్త లోతైన విచారణ జరపాలని సీసీఎల్‌ఏ, ప్రకాశం జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్, ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీసర్లను విచారణాధికారులుగా నియమించారు. విచారణలో తహసీల్దార్, వీఆర్వో అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ క్రమంలో అప్పటి దోర్నాల, ప్రస్తుతం మిట్లమండల తహసీల్దార్ అయిన కేవీఆర్‌వీ ప్రసాదరావు, అప్పటి దోర్నాల మండలం ఇనముక్కల, ప్రస్తుతం పామూరు మండలం గోడవాడ గ్రామ వీఆర్వో అయిన ఎం.డేనియల్‌ను ఉద్యోగాల నుంచి తొలగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సీసీఎల్‌ఏ, ప్రకాశం జిల్లా కలెక్టర్ లోకాయుక్తకు గురువారం సమర్పించారు.

## ఏసీబీ వలలో ఎస్‌ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు

**రూ.40 వేలు లంచం తీసుకుంటూ దొరికిన వైనం**



ఏసీబీకి చిక్కిన పోలీసులు

**చుండూరు(వేమూరు):** ఓ కేసులో స్వాధీనం చేసుకున్న కారును విడుదల చేసేందుకు ఎస్‌ఐ, కానిస్టేబుళ్లు లంచం డిమాండ్ చేయగా, గురువారం వారిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని, డబ్బు స్వాధీనం చేసుకున్నారు. బాపట్ల జిల్లా చుండూరు పోలీస్‌స్టేషన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఏసీబీ అధికారుల కథనం మేరకు.. బాపట్లలోని అబ్బురుపేటకు చెందిన బత్తుల గోవింద్ సోషల్ వెల్ఫేర్ వార్డెన్‌గా పనిచేస్తున్నాడు. అతనికి చుండూరు మండలం, కేఏస్ పల్లి గ్రామంలో పొలం ఉంది. ఆ గ్రామంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులు నిర్ణయించి, అక్టోబర్ 7వ తేదీన సర్వే చేయించారు. ఆ సమయంలో అక్కడికి బత్తుల గోవింద్ వచ్చి సర్వేను అడ్డుకున్నాడు. దీంతో తహశీల్దార్ ఫిర్యాదు మేరకు చుండూరు ఎస్‌ఐ బోరుగడ్డ భరత్ కుమార్ కేసు నమోదు చేసి గోవింద్ కారును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం న్యాయమూర్తి ఆదేశాల మేరకు అతడికి స్టేషన్ బెయిల్ ఇచ్చారు. అయితే కేసులో స్వాధీనం చేసుకున్న కారును విడుదల చేసేందుకు, ఇతరత్రా ఇబ్బందులు లేకుండా చూసేందుకు ఎస్‌ఐ భరత్ కుమార్, ఐడీ పార్టీ కానిస్టేబుల్ క్రాంతి, రైటర్ రవీంద్రలకు రూ.70వేలు లంచం ఇచ్చేలా గోవింద్ ఒప్పందం చేసుకున్నాడు. దీన్లో భాగంగా అతడు మొదటి విడతగా రూ.30 ఇవ్వగా, మిగిలిన రూ.40వేల కోసం వారు ఒత్తిడి తెచ్చారు. దీంతో గోవింద్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఐడీ పార్టీ కానిస్టేబుల్ క్రాంతికి గురువారం నగదు ఇస్తుండగా, ఏసీబీ అధికారులు అతడిని పట్టుకున్నారు. ఎస్‌ఐ భరత్ కుమార్, రైటర్ రవీంద్రలను అక్కడే అదుపులోకి తీసుకున్నారు.

## సైనికుడిపై దాడి చేసిన నలుగురు పోలీసుల సస్పెన్షన్

**ఆదేశాలు జారీ చేసిన డీజీపీ రాజేంద్రనాథ్**

**సాక్షి, అమరావతి/తుమ్మపాల (అనకాపల్లి):** అనకాపల్లి జిల్లా పరవాడ సంత వద్ద సైనికుడి పట్ల దురుసుగా ప్రవర్తించి.. దాడికి పాల్పడ్డ నలుగురు కానిస్టేబుళ్లను పోలీసు శాఖ సస్పెండ్ చేసింది. దిశ మొబైల్ యాప్ డౌన్‌లోడ్ విషయంలో గొడవపడి సైనికుడి పట్ల దురుసుగా ప్రవర్తించిన హెడ్ కానిస్టేబుల్ ఎ.దేవుళ్లు, కానిస్టేబుళ్లు ఎం.ముత్యాల నాయుడు, పి.రమేష్, మహిళా పోలీస్ బి.శోభను సస్పెండ్ చేస్తూ పోలీస్ శాఖ నిర్ణయం తీసుకుంది. ప్రజలకు రక్షణగా నిలవాల్సిన పోలీసులు వారిపైనే దాడికి పాల్పడటాన్ని తీవ్రంగా పరిగణించింది. ఈ మేరకు డీఐజీ, ఎస్పీలకు డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం ఆదేశాలు జారీ చేశారు.


**పోలీసులు అనుచితంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవు**



డీఐజీ హరికృష్ణ

విధి నిర్వహణలో పోలీసులు ప్రజల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని విశాఖపట్నం డీఐజీ ఎస్.హరికృష్ణ అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. పరవాడ పోలీసులు ఇండియన్ ఆర్మీలో నాయక్‌గా పనిచేస్తున్న సయ్యద్ అలీముల్లాతో ఈ నెల 7న పరవాడ సంతలో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించి ఓటీపీ అడగ్గా వివాదం చెలరేగిందన్నారు. ఆర్మీ ఉద్యోగి అక్కడ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు నిజమైన పోలీసులా.. దొంగ పోలీసులా అనే అనుమానంతో ఐడీ కార్డులు చూపించాలని అడిగారు. దీంతో కానిస్టేబుళ్లు బి.శోభ, ఎం.ముత్యాలనాయుడు ఆర్మీ జవాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్టేషన్‌కు తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేశారన్నారు. పోలీస్ స్టేషన్‌కు రానని ఆర్మీ ఉద్యోగి ప్రతిఘటించగా.. కానిస్టేబుళ్లు ఫోన్‌చేసి హెడ్ కానిస్టేబుల్ ఎ.దేముళ్లు, పి.రమేష్‌ను ఘటనా స్థలానికి రప్పించి అతడిని బలవంతంగా ఆటోలో ఎక్కించి స్టేషన్‌కు తీసుకెళ్లే ప్రయత్నం చేశారన్నారు. స్థానికులు ఈ ఘటనను వీడియో తీయడంతో సోషల్ మీడియాలో ప్రచారం జరిగిందని, విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ మురళీకృష్ణ ఆర్మీ ఉద్యోగితో మాట్లాడి నలుగురు పోలీస్ సిబ్బందిని తక్షణం ఆర్మ్‌డ్ రిజర్వ్‌కు అటాచ్ చేసి విచారణకు ఆదేశించారని చెప్పారు. డీజీపీ ఆదేశాల మేరకు వారిని సస్పెండ్ చేశామన్నారు.




Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# సాక్షి
## విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

శుక్రవారం । 10 । నవంబర్ । 2023






### కొండలమ్మ సేవలో కృష్ణా జేసీ
గుడ్లవల్లేరు: వేమవరంలోని శ్రీ కొండలమ్మ అమ్మవారిని కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ గురువారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు.



### బాబా సేవలో హైకోర్టు జడ్జి
మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో బాబాను గురువారం ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ కిరణ్మయి దంపతులు దర్శించుకుని పూజలు చేశారు.



### బ్యాడ్మింటన్ రాష్ట్ర జట్ల ఎంపిక
అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్లను ఎంపిక చేశారు.

-2లో▸

## న్యూస్‌రీల్

### 15న దుర్గమ్మకు గాజుల అలంకారం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక శుద్ధ విదియను పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీన ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను గాజులతో విశేషంగా అలంకరించనున్నారు. గాజుల ఉత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారి ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌తో పాటు ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల గాజులతో అందంగా ముస్తాబు చేస్తారు. తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాత సేవ అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఆసక్తి గల దాతలు దేవస్థానానికి గాజులను విరాళంగా అందజేయొచ్చని ఆలయ అధికారులు సూచించారు.

### న్యాయసేవాధికార సంస్థ సేవలను వినియోగించుకోండి



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక సూచించారు. జాతీయ న్యాయసేవాధికార దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక జెండాఊపి ప్రారంభించారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ.. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో సంవత్సర కాలంలో 1,36,623 కేసులను పరిష్కరించామన్నారు. వివిధ ప్రాంతాల్లో 540 న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించి, 389 మంది నిరుపేదలకు న్యాయసహాయం అందించామని వివరించారు. నూతన తరహాలో న్యాయసేవా శిబిరాలను ఏర్పాటు చేసిన న్యాయసేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామన్నారు. 17 మంది బాధితులకు నష్టపరిహారం కింద రూ.41.10 లక్షలు అందజేశామన్నారు. ప్రజలందరూ న్యాయసేవాధికార సంస్థ సేవలు వినియోగించుకోవాలని కోరారు. న్యాయమూర్తులు చిన్నంశెట్టి రాజు, ఎ.నరసింహమూర్తి, చినబాబు, కె.వి.రామకృష్ణయ్య, డాక్టర్ షేక్ మొహమ్మద్ ఫజులుల్లా, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

### డిసెంబర్ 12 నుంచి అమరావతి బాలోత్సవం
కృష్ణలంక(విజయవాడతూర్పు): అమరావతి బాలోత్సవం ఆరో పిల్లల పండుగ డిసెంబర్ 12 నుంచి 14వ తేదీ వరకు నగరంలోని సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో జరుగుతుందని బాలోత్సవం అధ్యక్ష కార్యదర్శులు ఎస్.పి.రామరాజు, ఆర్.కొండలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంతో పాటు నగరం చుట్టుపక్కల, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ విద్యాసంస్థల బాల బాలికల సృజనాత్మకత వెలికి తీయడానికి ఐదేళ్లుగా బాలోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. దేశభక్తి ప్రధాన అంశంగా తీసుకుని బాలోత్సవం నిర్వహిస్తున్నామని చెప్పారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పండుగలో 39 అకడమిక్, 16 సాంస్కృతిక అంశాలలో పోటీలు జరుగుతాయన్నారు. విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

### నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి గుంటూరుకు చెందిన భక్తులు గురువారం రూ.లక్ష విరాళం సమర్పించారు. గుంటూరు ఏటీ అగ్రహారానికి చెందిన బి.బాలిరెడ్డి, కొండ కృష్ణకుమారి కుటుంబం సమేతంగా అమ్మవారి దర్శనానికి విచ్చేశారు. బి.సాయి భరత్‌రెడ్డి పేరిట రూ.1,00,116 విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

# సామాజిక ప్రభంజనం

### హోరెత్తిన జై జగన్ నినాదం
- సామాజిక సాధికార బస్సు యాత్రకు వేలాదిగా తరలి వచ్చిన జనం
- జన సంద్రంగా మారిన పామర్రు నాలుగు రోడ్ల కూడలి
- బహిరంగ సభలో అతిథుల ప్రసంగాలకు విశేష స్పందన

పదం పదం కదంతొక్కి ప్రభంజనమై కదిలింది. సామాజిక సంబరానికి ఊరూవాడా వెల్లువలా తరలివచ్చాయి. ఎటు చూసినా ప్రజా ప్రవాహంతో పామర్రు జనసంద్రమైంది. గురువారం పామర్రులో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర ఉత్సాహంగా సాగింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషిని వివరించేందుకు చేపట్టిన ఈ బస్సు యాత్ర దారి పొడవునా జై జగన్.. జైజై జగన్ నినాదాలతో దద్దరిల్లింది.



సామాజిక సాధికార బస్సు యాత్రలో నాయకుల వెంట తరలివస్తున్న జన సమూహంలో ఓ భాగం

పామర్రు: నియోజకవర్గ కేంద్రమైన పామర్రులో గురువారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రకు పామర్రు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గ్రామంలోని విజయవాడ రోడ్డులో ఉన్న శ్రీ ప్రియ టవర్స్ నుంచి స్థానిక నాలుగు రోడ్ల కూడలి వరకు సాగిన బస్సు యాత్రలో వేలాది మంది నాయకులు, కార్యకర్తలు మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. మంత్రులు మేరుగ నాగార్జున, జోగి రమేష్, ఎంపీలు నందిగం సురేష్, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్సీలు పోతుల సునీత, జంగా కృష్ణమూర్తి, మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యేలు కైలే అనిల్ కుమార్, సింహాద్రి రమేష్‌బాబు, పేర్ని వెంకట్రామయ్య (నాని), ముస్తఫా, పలువురు నాయకులు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి శ్రీ ప్రియ టవర్స్ వద్దకు పాదయాత్రగా చేరుకున్నారు. అక్కడి నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు బస్సు యాత్రగా వచ్చారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలోని 107 గ్రామాల నుంచి 20 వేల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు కేరింతలు కొడుతూ ఉత్సాహంగా సామాజిక సాధికార బస్సు యాత్రలో పాల్గొన్నారు.

**జన సంద్రంగా మారిన ప్రధాన రహదారి**

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషిని వివరించేందుకు చేపట్టిన ఈ బస్సు యాత్రకు దారి పొడవునా జై జగన్.. జైజై జగన్, జిందాబాద్ వైఎస్సార్ సీపీ అన్న నినాదాలు మార్మోగాయి. పామర్రులోని ప్రధాన రహదారి కిలోమీటరు మేర జనంతో కిక్కిరిసింది. స్థానిక ఆరేపల్లి కల్యాణ మండపం వద్ద కల్లుగీత కార్మికులు బహూకరించిన మోకులను నాయకులు అభిమానంతో ధరించారు. అదే ప్రాంతంలో బీసీ వర్గానికి చెందిన కొందరు నాయకులు, కార్యకర్తలు అభిమానంగా బత్తాయిలతో చేసిన గజమాలను బస్సుకు వేశారు. మహిళలు పెద్దఎత్తున బస్సు యాత్రకు నీరాజనాలను అందించారు. మరి కొందరు బస్సు యాత్రను చూసేందుకు తరలివచ్చి సంఘీభావం తెలిపారు. యువకులు ఈలలు, కేకలు వేస్తూ బస్సు యాత్రలో సందడి చేశారు. పార్టీ నాయకులు పలువురు కుర్రకారుతో కలిసి చిందులు వేసి సందడి చేశారు.



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



బస్సుయాత్రలో పాల్గొన్న ఎంపీ నందిగం, మంత్రులు మేరుగ, జోగి రమేష్, ఎమ్మెల్యేలు పార్థసారథి, కైలే అనిల్, ముస్తఫా



ప్రజలను మైమరపించిన చండా మేళం

**జోష్ నింపిన ప్రసంగాలు**

సామాజిక సాధికార బస్సు యాత్రను పురస్కరించుకుని స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద ఏర్పాటు చేసిన సభ నేతల ప్రసంగాలతో దద్దరిల్లింది. మంత్రులు మేరుగ నాగార్జున, జోగి రమేష్, కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ నందిగం సురేష్ చేసిన ప్రసంగాలు జనాన్ని ఉత్తేజ పరిచాయి. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు ప్రసంగం ప్రజలను ఆలోచింపజేసింది. మంత్రులు, ఎంపీలు, నాయకుల ప్రసంగాలు సుమారు గంటన్నర సేపు జరగ్గా సభకు వచ్చిన జనాలు ఆద్యంతం ఆసక్తిగా ఆలకించారు. పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లతో పండుగ వాతావరణం నెలకొంది.

**గొర్రె పిల్లల బహూకరణ**

బస్సు యాత్రలో ర్యాలీ వస్తున్న పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథికి మొవ్వ మండలం కారకపాడు గ్రామానికి చెందిన అభిమానులు నాగనబోయిన సునీల్, మెరుగుమాల కాశీ గొర్రె పిల్లలను బహూకరించారు.

### నృత్యాలతో హోరెత్తిన పామర్రు
సామాజిక సాధికార బస్సు యాత్రను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన డప్పు విన్యాసాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తీన్మార్ డప్పుల మోత యువతను ఉత్తేజ పరిచింది. డప్పు విన్యాసాలు, తణుకుకు చెందిన చండా మేళం వినూత్న నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సామాజిక సాధికార బస్సు యాత్ర వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది.

### చేసిన అభివృద్ధే గెలిపిస్తుంది



నేను ప్రజా సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చాను. జీతానికి మాత్రం కాదు. నా ప్రత్యర్థులు తమ పబ్బం కోసం అసత్య ప్రచారాలు చేస్తున్నారు. వారు ఎన్ని నాటకాలు ఆడినా ఫలితం ఉండదు. పార్టీలకు అతీతంగా పామర్రు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమమే నా పార్టీని గెలిపిస్తుంది. పార్టీని నమ్ముకున్న నాయకులు, కార్యకర్తల బాగు కోసం ఎన్ని మెట్లయినా దిగి వారికి న్యాయం జరిగేలా చేస్తా.

– కైలే అనిల్‌కుమార్, పామర్రు ఎమ్మెల్యే

### నంబర్ వన్ సీఎం జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమంతో పాటు అభివృద్ధి చేస్తూ పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. దేశంలోనే నంబర్ వన్ ముఖ్యమంత్రిగా ఎదిగారు. విద్య, వైద్య రంగాల్లో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి సరికొత్త సంక్షేమ చరిత్ర సృష్టించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన ఆవశ్యకత ప్రజలపై ఉంది.

– ముస్తఫా, గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే

### బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పెద్ద పీట



గత పాలకులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను పట్టించు కోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యంగా ఈ వర్గాల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేశారు. మంత్రి వర్గంలో పెద్ద పీట వేశారు. బీసీలను రాజ్యసభకు పంపిన ఘనత జగన్‌కే దక్కింది. బడుగు బలహీన వర్గాల కష్టాన్ని గత ప్రభుత్వాలు దోచుకున్నాయి. సీఎం జగన్ మాత్రం వారి కష్టాన్ని గుర్తించి సముచిత స్థానం కల్పించారు.

– కొలుసు పార్థసారథి, పెనమలూరు ఎమ్మెల్యే

### బీసీ మహిళలకు ప్రాధాన్యం



బీసీ మహిళలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. జనరల్‌కు కేటాయించిన జెడ్పీ చైర్‌పర్సన్ పదవిని బీసీ మహిళనైన నాకు ఇచ్చారు. ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ ఏర్పడిన 60 ఏళ్లలో మొదటిగా బీసీ మహిళను చైర్ పర్సన్ చేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరొక సారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటే బీసీలకు మరింత మంచి జరుగుతుంది.

– ఉప్పాల హారిక, జెడ్పీ చైర్‌పర్సన్ కృష్ణాజిల్లా

# ఆర్థికాభివృద్ధికి బ్యాంకుల సహకారం తప్పనిసరి

**ఎంపీ వల్లభనేని బాలశౌరి**

మచిలీపట్నంటౌన్: సమాజంలో ఎవరైనా ఆర్థికాభివృద్ధి సాధించాలంటే బ్యాంకుల సహకారం కావాలని బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. నగరంలోని రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న కల్యాణమండపంలో యూనియన్ బ్యాంక్, ఇండియన్‌బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం రుణ మేళా జరిగింది. మూడు బ్యాంకుల ఆధ్వర్యంలో రూ.69.69 కోట్ల మేర రుణాలు ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథి బాలశౌరి మాట్లాడుతూ.. వ్యాపారం చేసే వారికి బ్యాంకులు రుణాలు ఇస్తాయని, సక్రమంగా తిరిగి చెల్లించాలని సూచించారు. అర్హులైన వ్యాపారులు, నిరుద్యోగులు తమ అర్హతను బట్టి ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్, పాన్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ పత్రాలతో రుణానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సబ్సిడీ రుణాలిచ్చేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని కోరారు. యూనియన్ బ్యాంక్ రూ.38 కోట్లు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.29.50 కోట్లు, ఇండియన్ బ్యాంక్ రూ.2.19 కోట్ల మేర రుణాలు ఇచ్చేందుకు ముందుకొచ్చాయన్నారు. మచిలీపట్నం ప్రాంతంలో రోల్డ్‌గోల్డ్, మత్స్య, పశుపోషణ, తదితర రంగాలపై ఆధారపడి జీవించే వారు అధికంగా ఉన్నారని, వారితో పాటు చేతివృత్తులతో జీవిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కూడా రుణాలు మంజూరు చేయాలని బ్యాంక్ అధికారులను ఎంపీ బాలశౌరి కోరారు.



డ్వాక్రా మహిళలకు రుణం చెక్కు అందజేస్తున్న ఎంపీ బాలశౌరి, బ్యాంక్ అధికారులు

**శరవేగంగా పోర్టు నిర్మాణం**

మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎంపీ బలశౌరి తెలిపారు. పోర్టు నిర్మాణానికి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ దాదాపు రూ.4 వేల కోట్ల రుణం ఇచ్చిందన్నారు. రానున్న రోజుల్లో స్టోరేజీ కంటైనర్లు, రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లు, పెట్రో కెమికల్స్ ప్రాజెక్టులు తదితర పోర్టు ఆధారిత పరిశ్రమలు ఈ ప్రాంతంలో ఏర్పాటవుతాయని తెలిపారు. భారత చిత్రపటంలో మచిలీపట్నం కూడా పోర్టు సిటీగా ప్రముఖ స్థానానికి ఎదుగుతుందని ధీమా వ్యక్తంచేశారు. పోర్టు నిర్మాణం అనంతరం ఏర్పడే పరిశ్రమలపై బ్యాంకర్లతో జిల్లా అధికారులు అవగాహన సదస్సు నిర్వహించాలని సూచించారు. ఆంధ్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య జన్మించిన మచిలీపట్నంలో ఆయన స్మారక మ్యూజియం త్వరలోనే ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కలెక్టర్ పి.రాజాబాబు, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి జి.వెంకట్రావు, యూనియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్, జోనల్ హెడ్ ఎం.రవీంద్రబాబు, రీజనల్ హెడ్ వెంకట్రావు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ వి.వి.ఫణిరామకుమార్, ఇండియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, లీడ్ బ్యాంక్ మేనేజర్ జయవర్ధన్ పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఓటర్ల తుది జాబితా

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు**

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ- 2024లో భాగంగా అత్యంత పారదర్శకంగా తుది జాబితాను రూపొందించాలని సంబంధిత అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. వచ్చే జనవరి ఐదో తేదీన తుది ఓటర్ల జాబితా ప్రకటించాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో దరఖాస్తుల పరిష్కారం, ఆన్‌లైన్‌లో సమాచారం నమోదు అత్యంత కచ్చితంగా ఉండేలా చూడాలన్నారు. జాబితా తయారీలో ఏ దశలో నిర్లక్ష్యం చూపినా బాధ్యులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ ప్రణాళిక రూపకల్పనపై జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.సంపత్ కుమార్‌తో కలిసి కలెక్టర్ ఢిల్లీరావు గురువారం సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అత్యంత స్వచ్ఛంగా, తప్పులు లేకుండా తుది ఓటర్ల జాబితా ఉండాలని స్పష్టంచేశారు. నిబద్ధత, చిత్తశుద్ధితో అధికారులు ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగస్వాములు కావాలని సూచించారు. నిర్దిష్ట గడువులోగా క్లయిమ్స్, అభ్యంతరాల దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. రీవెరిఫికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. మరణించిన వారి ఓట్ల తొలగింపులో నిబంధనలు తప్పక పాటించాలని స్పష్టం చేశారు. ప్రశాంత వాతావరణంలో, సజావుగా ఎన్నికల నిర్వహణకు అవసరమయ్యే జిల్లా ఎన్నికల నిర్వహణ ప్రణాళికలో పొందుపరచాల్సిన ప్రతి అంశంపై పూర్తిస్థాయిలో కసరత్తు చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్బన్, రూరల్ ప్రాంతాల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, రిసెప్షన్ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ సెంటర్లకు అవసరమైన ప్రాంతాలను, భవనాలను గుర్తించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికల సిబ్బందికి జిల్లా, నియోజకవర్గ స్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్వో ఎస్.వి.నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ అదితిసింగ్, ఆర్డీఓలు పి.సాయిబాబా, కె.మాధవి, కలెక్టరేట్ ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ సీహెచ్.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ, ఎస్టీ, బీసీలంతా జగన్ వెంటే..

**మంత్రి జోగి రమేష్**

పామర్రు: రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు చూసి ఎస్సీ, ఎస్టీ, బీసీలంతా నేడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో కలసి నడుస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. పామర్రులో సామాజిక సాధికార బస్సుయాత్రను పురస్కరించుకుని గురువారం స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ముఖ్యమంత్రులు ఖద్దరు చొక్కా నలగకుండా తిరిగేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి మంత్రులు, ఎమ్మెల్యే వరకూ సామాన్య ప్రజల మధ్య ఉంటూ వారి సాధక బాధకాలు తెలుసుకుని పనిచేస్తున్నట్టు చెప్పారు. చీఫ్ మినిస్టర్ టు కామన్‌మాన్ అని సీఎం జగన్ నిరూపించారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 60 శాతం పదవులు కట్టబెట్టి సామాజిక సాధికారతకు సీఎం జగన్ నిలువుటద్దంగా నిలిచారని కొనియాడారు. ఆయన పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీలంతా తలెత్తుకు తిరుగుతున్నామని, ఇది తమకెంతో గర్వంగా ఉందని పేర్కొన్నారు. గత నెల 26వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు విశేష స్పందన లభిస్తోందన్నారు.



మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్. చిత్రంలో ఎంపీలు నందిగం సురేష్, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యేలు ముస్తఫా, కైలే అనిల్‌కుమార్, సింహాద్రి రమేష్‌బాబు

**ముఖ్యమంత్రికి బ్రహ్మరథం**

సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ.. గతంలో చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీలపై చూసిన చిన్నచూపు, చీదరించుకున్న తీరును గ్రహించిన ఆయా వర్గాల ప్రజలు జగన్ మోహన్‌రెడ్డికి బ్రహ్మరథం పడుతున్నట్టు చెప్పారు. చంద్రబాబు గజదొంగని ఆయన చేసే కుట్రలు, కుతంత్రాల మాయలో పడొద్దని సీఎం జగన్‌కు మళ్లీ అధికారం కట్టబెట్టేందుకు ప్రతిఒక్కరం సైనికుల్లా పనిచేద్దామని పిలుపు నిచ్చారు. ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు ఎంతో సంతోషంతో ఉన్నారని చెప్పారు. మహిళలకు 50 శాతం, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 60 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ దేశంలోనే గొప్ప ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించారని అన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, అవనిగడ్డ, పెనమలూరు, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యేలు సింహాద్రి రమేష్‌బాబు, కొలుసు పార్థసారథి, మొహమ్మద్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

# 14 నుంచి నాగుల చవితి మహోత్సవాలు

మోపిదేవి(అవనిగడ్డ): మండల కేంద్రమైన మోపిదేవిలోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 14వ తేదీ నుంచి నాగుల చవితి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామని ఆలయ ఏసీ ఎన్.ఎస్.చక్రధరరావు తెలిపారు. దేవస్థానంలో ఆయన ఉత్సవాల కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చవితి మహోత్సవాలు 14 నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. కార్తిక మాసం నెల రోజులు పాటు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యక్షంగా, పరోక్షంగా అభిషేకాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. నాగుల చవితి సందర్భంగా 17వ తేదీ తెల్లవారుజాము 2.30 గంటలకు పుట్ట వద్ద పూజలు నిర్వహించి అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు. 26వ తేదీ సాయంత్రం 6.45 గంటలకు జ్వాలా తోరణం అనంతరం భక్తులకు నాగపుట్ట దర్శనం ఉంటుందని వివరించారు. ఈ నెల 14 నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు రోజూ ఉదయం ఆరు గంటలకు గర్భాలయంలో కార్తిక మాస దీక్ష అభిషేకాలు జరుగుతాయని వివరించారు. రూ.1,116 చెల్లించిన భక్తుల గోత్ర నామాలతో నిత్యం పరోక్షంగా పూజలు చేస్తామని తెలిపారు. డిసెంబర్ 11వ తేదీన శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి లోక కల్యాణార్థం లక్ష బిల్వార్చన అత్యంత వైభవంగా జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు బుద్ధు పవన్‌కుమార్ శర్మ, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ ఏసీ చక్రధరరావు, ప్రధానార్చకుడు పవన్‌కుమార్ శర్మ

## క్లుప్తంగా

### వ్యక్తి అనుమానాస్పద మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మద్యం మత్తులో ఉన్న వ్యక్తి ఆటోలో అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టినగర్ ఎర్రకట్ట రోడ్డులోని రామాలయం వీధిలో కొంత కాలంగా బాషా అనే వ్యక్తి ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. బాషా కూలీ పనులు చేస్తూ వచ్చిన డబ్బులు మద్యం కొనుగోలు చేసి తాగేవాడు. రాత్రిళ్లు రోడ్డు పక్కన నిలిపే ఆటోలలోనే నిద్రపోయేవాడు. గురువారం ఉదయం అదే ప్రాంతానికి చెందిన చప్పిడి రత్న కుమార్ తన ఆటో తీసేందుకు వెళ్లగా లోపల బాషా ఉలుకూ పలుకూ లేకుండా ఉన్నాడు. దీంతో చుట్టు పక్కల వారి సాయంతో 108కు సమాచారం అందించాడు. 108 సిబ్బంది బాషాను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై రత్నకుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు.

### ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంసాలిపేట ఎర్రకట్ట డౌన్‌కు చెందిన మన్నేపల్లి రాజేష్ ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తుంటాడు. గతంలో శాంతి అనే మహిళ పరిచయం కాగా గుణదల చర్చిలో పెళ్లి చేసుకున్నారు. లాక్‌డౌన్ సమయంలోనూ, అనారోగ్యంగా ఉన్న తరుణంలో తెలిసిన వారి వద్ద రాజేష్ అప్పులు చేశాడు. దీంతో కొంత కాలంగా మానసికంగా కుంగిపో సాగాడు. గురువారం మధ్యాహ్నం సమయంలో గాంధీనగర్ చెప్పుల షాపులో పనికి వెళ్లిన శాంతికి వీడియో కాల్ చేసిన రాజేష్ తాను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పాడు. దీంతో భయపడుతూ ఇంటికి వచ్చి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో ఘటనపై శాంతి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

# మిన్నంటిన జగన్నినాదం

- అట్టహాసంగా ప్రారంభమైన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం
- తొలి రోజు మొత్తం 22 సచివాలయాల పరిధిలో నిర్వహణ
- సంక్షేమం, అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యమని ఉద్ఘాటన



జగ్గయ్యపేటలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమం గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. తొలి రోజు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలోని 22 సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన నాలుగున్నరేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గణాంకాలతో సహా ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. సచివాలయాల పరిధిలో నాలుగున్నరేళ్లలో చేపట్టిన కార్యక్రమాల వివరాలు, నిధులతో కూడిన డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలో వివరించారు. గత చంద్రబాబు పాలనకు, ప్రస్తుత జగన్ పాలనను బేరీజు వేసుకోవాలని ప్రజలను కోరారు.

➡ జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జగ్గయ్యపేట పట్టణంలో 15వ సచివాలయం తొర్రగుంటపాలెం నందు, పెనుగంచిప్రోలు మండలం వెంకటాపురం, వత్సవాయి మండలం మక్కపేట గ్రామాలలో జరిగింది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పాల్గొని నాలుగున్నరేళ్ల పాలనలో ఆయా సచివాలయాల పరిధిలో పార్టీ జెండా ఆవిష్కరించారు. డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు.

➡ నందిగామ నియోజకవర్గ పరిధిలో నందిగామ పట్టణంలోని 9, 10 వార్డులు, చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ పాల్గొన్నారు. వీరులపాడు మండలం పొన్నవరం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన రావు పాల్గొని డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు.

➡ తిరువూరు నియోజకవర్గంలోని గంపలగూడెం మండలం అనుముల్లంక గ్రామంలో ఎమ్మెల్యే రక్షణనిధి పాల్గొని డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. తిరువూరు మండలం కాకర్ల విస్సన్నపేట మండలం కొండపర్వ, తిరువూరు నగరపంచాయతీ 6వ వార్డులోనూ కార్యక్రమం జరిగింది.

➡ మైలవరం నియోజకవర్గ పరిధిలోని గొల్లపూడి గ్రామం ఒకటో సచివాలయం పరిధిలో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధికి సంబంధించిన డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి ఒకటో సచివాలయం, కొండపల్లి మున్సిపాలిటీ ఒకటో సచివాలయ పరిధిలో పరిధిలో జరిగిన కార్యక్రమాల్లో నాయకులు పాల్గొన్నారు.

➡ విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని 34 డివిజన్ కేదారేశ్వరపేట 219 సచివాలయం పరిధిలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని పార్టీ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం డిస్ ప్లే బోర్డును ప్రారంభించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.

➡ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని 26వ డివిజన్ మారుతీనగర్‌లో 29వ సచివాలయం పరిధిలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అ వుతు శ్రీశైలజారెడ్డితో కలిసి సంక్షేమ పథకాలను వివరిస్తూ రూపొందించిన డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు.

➡ విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని 2వ డివిజన్ 24వ సచివాలయం పరిధిలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ పాల్గొని డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు.

## ఎయిర్‌పోర్టు కారిడార్ పనులు పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): గన్నవరం ఎయిర్‌పోర్టు కారిడార్ పనుల నాణ్యతలో రాజీ లేకుండా త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. గురువారం ఆయన కారిడార్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన రామవరప్పాడు రింగు నుంచి గన్నవరం వరుకు జరుగుతున్న కారిడార్ పనులలో నూతన మోడల్ ఫ్లోరింగ్ టైల్స్‌లను పరిశీలించి, ఆకర్షణీయంగా కనిపించే విధంగా అమర్చాలని సూచించారు. ఫుట్‌పాత్‌పై ఎలాంటి చెత్త, చెదారం లేకుండా నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని, జాతీయ రహదారి వెంబడి మెరుగైన పారిశుద్ధ్య విధానాన్ని అవలంభించాలని సూచించారు. అడిషనల్ కమిషనర్ కేవీ సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల ప్రసాద్, అసిస్టెంట్ హెల్త్ ఆఫీసర్ సురేష్ పాల్గొన్నారు.

## పూర్తి ఆరోగ్యవంతులుగా చేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా గుర్తించిన రిఫరల్ కేసులకు పూర్తి స్థాయి వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. వారి చేయి పట్టి నడిపించి పూర్తి ఆరోగ్యవంతులు అయ్యేలా చూడాలన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రిఫరల్ కేసులపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. తదుపరి చికిత్స అవసరమయ్యే రోగులకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు, సర్వజన ఆస్పత్రులు, బోధనాస్పత్రులు తదితరాల ద్వారా అవసరమైన చికిత్స అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. చికిత్స అనంతరం సరిగా మందులు తీసుకోవడం, సమయానికి డాక్టర్ వద్దకు వెళ్లడం తదితర ఫాలో అప్ సేవలు అందించేందుకు ఏఎన్ఎం, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆశా కార్యకర్తలు కృషిచేయాలని సూచించారు. రిఫరల్ కేసులను మ్యాప్ చేసిన ఆస్పత్రుల్లో చేర్చి, అవసరమైన చికిత్స అందించేందుకు జిల్లా, మండల, టాస్క్ ఫోర్స్ బృందాలు సమన్వయంతో పనిచేస్తూ చికిత్స విధానాన్ని పర్యవేక్షించాలన్నారు. రిఫరల్ కేసుల వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ అనుబంధ ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రత్యేక వైద్య నిపుణుల చేత రిఫరల్ కేసులకు వైద్య సేవలు అందించేలా చూడాలన్నారు. డీఎంహెచ్ఓ సుహాసిని, జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ బీసీకే నాయక్, ఆరోగ్య సురక్ష నోడల్ అధికారి మోతీ బాబు, తదితరులు పాల్గొన్నారు.






## ఆడుకుంటూ మృత్యు ఒడికి



సులేమాన్ అష్రఫ్ (ఫైల్)

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రమాదవశాత్తు డ్రెయిన్‌లో పడి ఐదేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై బాలుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాత రాజరాజేశ్వరిపేటలోని మణికంఠ మెడికల్‌షాపు 4వ లైన్‌లో షేక్ షర్మిల, సుభాని దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి నలుగురు సంతానం. 4వ సంతానమైన సులేమాన్ అష్రఫ్(5)కు బుధవారం ఒంట్లో బాగో లేకపోవడంతో స్కూల్‌కు పంపలేదు. సాయంత్రం వర్షం పడుతున్న తరుణంలో సులేమాన్ ఇంటి పక్కన ఉన్న పిల్లలతో కలిసి ఆడుకుంటున్నాడు. తల్లి షర్మిల ఇంట్లో పని చేసుకుంటుంది. సుమారు 7 గంటల సమయంలో బయటకు వచ్చిన షర్మిలకు సులేమాన్ కనిపించకపోవడంతో తోటి పిల్లలను అడిగినా ప్రయోజనం లేకపోయింది. దీంతో షర్మిల వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. ఇంటి ముందు ఉన్న నాలుగు అడుగుల వెడల్పు ఉన్న డ్రెయిన్‌లో ఏమైనా పడిపోయి ఉంటాడా అనే అనుమానంతో పోలీసులు డ్రెయిన్‌లో వెతికించారు. గురువారం ఉదయం పాతరాజరాజేశ్వరిపేట 6వ లైన్ చివరి డ్రెయినేజీలో రెండు చేతులు పైకి కనిపించాయి. తమ బిడ్డను గుర్తించిన ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపించారు. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌ల ఏర్పాటుకు చర్యలు



నిమ్రా కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ సంపత్‌కుమార్, సబ్‌కలెక్టర్ అదితిసింగ్

జూపూడి(ఇబ్రహీంపట్నం): రానున్న సార్వత్రిక ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు చెప్పారు. మండలంలోని నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలసి భవనాలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గతంలో కానూరు పీవీపీ సిద్ధార్థ కళాశాలలో స్ట్రాంగ్, కౌంటింగ్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాల పునర్విభజనతో ఎన్టీఆర్ జిల్లాలో స్ట్రాంగ్, కౌంటింగ్ రూమ్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 1781 పోలింగ్ కేంద్రాలు ఉండగా పార్లమెంట్‌కు ఒకటి, 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒక్కొక్కటి చొప్పున కౌంటింగ్ కేంద్రాలు, అదే ప్రాంగణంలో 3,562 ఈవీఎంలు భద్రపర్చేందుకు భవనాలు గుర్తించాలన్నారు. మేరీస్టెల్లా కళాశాలతో పాటు నిమ్రా కళాశాల భవనాలు పరిశీస్తున్నట్లు తెలిపారు. అనుకూలమైన భవనాలు గుర్తించి రాష్ట్ర ఎన్నికల అధికారికి నివేదిక ఇస్తామన్నారు. డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ఎన్నికల సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాసరావు, నిమ్రా కళాశాల అకడమిక్ డైరెక్టర్ టి.నారాయణమూర్తి పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్ పోటీలకు రాష్ట్ర జట్ల ఎంపిక

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విజయవాడలో డిసెంబర్ 11 నుంచి 16 తేదీ వరకు జరగనున్న అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టులోని క్రీడాకారుల ఎంపికను పూర్తి చేశామని ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.భానుమూర్తి రాజు తెలిపారు. చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ స్టేడియం ఆవరణలో వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులకు గురువారం పోటీలను నిర్వహించి ఎంపిక చేశారు.

## క్లుప్తంగా

### క్రీడల్లో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ కబాడీ చాంపియన్ షిప్‌లో శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ తెలిపారు. ఆ పోటీల్లో తమ విద్యార్థులు బి.కవిత, ఆర్.భారతి ఉన్న టీమ్ ద్వితీయ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. కవిత నేషనల్‌కి సెలక్ట్ అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు.

### కూలిన విద్యుత్ స్తంభాలు పునరుద్ధరణ



లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షాలకు సీతారామపురం కడియాల వారివీధిలో ఒక భారీ చెట్టు కుప్పకూలగా నాలుగు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈ విషయాన్ని స్థానిక 24వ కార్పొరేటర్ అనిత ద్వారా తెలుసుకున్న సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు వెంటనే వాటిని పునరుద్ధరించాలని ఆదేశించారు. దీంతో అధికారులు గురువారం ఉదయం ఆ ప్రాంతానికి చేరుకుని విరిగిన నాలుగు స్తంభాలను పునరుద్ధరించారు. ఆ పనులను కార్పొరేటర్ దగ్గరుండి పూర్తి చేయించారు.

### నేడు డయల్ యువర్ డీఎం


ఆటోనగర్(విజయవాడతూర్పు): డయల్ యువర్ డీఎం కార్యక్రమం శుక్రవారం జరుగుతుందని ఆటోనగర్ డీఎం ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బెంగళూరు, చెన్నయ్, విశాఖపట్నం, తిరుపతి, కర్నూల్, హైదరాబాద్‌తో పాటు పలు సుదూర ప్రాంతాలకు ప్రయాణించే వారు తమ సమస్యలను డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య సెల్ నెంబరు 9959225463 కి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై విజయవాడకు చెందిన మల్లిశెట్టి అనూష బృందానికి చెందిన కావ్య, వాత్సల్య, యజ్ఞ, శ్రీప్రియ, దుర్గా మల్లేశ్వరి, పూజిత, చైత్రలతో పాటు మరి కొంత మంది చిన్నారులు చక్కటి హావ భావాలతో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందచేశారు.

### టేబుల్ టెన్నిస్‌లో నగర విద్యార్థులకు పతకాలు



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఈ నెల 4, 5 తేదీల్లో గుంటూరులోని జెమ్ స్కూల్ ఆవరణలో జరిగిన 67వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14,17,19 పోటీల్లో పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో శిక్షణ తీసుకున్న విద్యార్థులు కృష్ణా జిల్లా తరఫున పాల్గొని వివిధ విభాగాల్లో పతకాలు పొందారని కోచ్‌లు దామోదర్ రెడ్డి, భార్గవి తెలిపారు. పతకాలు పొందిన విద్యార్థులను చెన్నుపాటి రామకోటయ్య స్టేడియంలో గురువారం అభినందించారు. అండర్-14 టేబుల్ టెన్నిస్‌లో బాలుర సింగిల్స్ విభాగంలో ఎస్.ఋషీల్ రజతం, బి.హర్షిత కాంస్య పతకాలు, అండర్ -17 బాలికల సింగిల్స్ విభాగంలో పి.స్నేహిత రజతం, ఎం.తన్వి కాంస్యం పొందారన్నారు. అండర్-17 బాలుర సింగిల్స్ విభాగంలో పి.సత్య బంగారు పతకం పొందారని చెప్పారు. స్కూల్ గేమ్స్ టీమ్ ఈవెంట్‌లో టేబుల్ టెన్నిస్ అండర్-14 విభాగంలో హర్షిత, రుషిల్, లోహిత్ బంగారు పతకం, అండర్-14 బాలికల విభాగంలో ఐశ్వర్య, ఉజ్వల కాంస్య పతకం సాధించారన్నారు. అండర్-17 బాలికల విభాగంలో సంహిత, తన్వి అండర్-17 బాలికల విభాగంలో పి.సత్య, పి.ఉపేంద్ర రజత పతకాలు సాధించారన్నారు

# జగనన్నతోనే సంక్షేమ పాలన

**వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్**



సంక్షేమ పథకాల పట్టికను ఆవిష్కరిస్తున్న దేవినేని అవినాష్ తదితరులు

గుణదల(విజయవాడతూర్పు): దళారులు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. 2వ డివిజన్ 24వ సచివాలయం పరిధిలో గురువారం నిర్వహించిన ఆంధ్రకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర భవిష్యత్, పేదల జీవితాలు బాగుపడుతున్నాయని చెప్పారు. ఈ సచివాలయం పరిధిలో దాదాపు 1500 మంది లబ్ధిదారులకు రూ.15 కోట్ల ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూర్చిందని పేర్కొన్నారు. తాము వస్తుంటే స్థానిక ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. ప్రజలు జగనన్నకు మద్దతు ఇవ్వటం చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ప్రారంభమైన ఈ కార్యక్రమం రాబోయే 30 రోజుల్లో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. టీడీపీ నాయకులు కేవలం తమ అనుకూల మీడియా, సోషల్ మీడియాలో మాత్రమే కనిపిస్తున్న ప్రస్తుత తరుణంలో వైఎస్సార్ సీపీ నాయకులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అండగా నిలుస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా మరోమారు ప్రజల ముంగిటకు దమ్ముగా, ధైర్యంగా వెళతామని తెలిపారు. గత ప్రభుత్వంలో మాదిరి జన్మభూమి కమిటీల దోపిడీ లేదని, టిడ్కో ఇళ్ల మోసం లేదని, కాల్‌మనీ, సెక్స్ రాకెట్ దందా లేకుండా ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కాబట్టి జగనే సీఎం కావాలి అని చెప్పారు. టీడీపీ హయాంలో జీడీపీ 22వ స్థానంలో ఉంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వరుసగా రెండేళ్లు 2వ స్థానానికి వచ్చిందని పేర్కొన్నారు. ఆ ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని వెల్లడించారు. 2వ డివిజన్ కార్పొరేటర్ అంబడిపూడి నిర్మలాకుమారి, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, మండల ఇన్‌చార్జ్ బుర్రి జగ్జీవన్ రావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ ప్రభుదాస్ పార్టీ నాయకులు కోటి నాగులు, కనపర్తి బాబు, సుభాషిణి, రవి ప్రకాష్, చెన్ను, మోయిన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు

**ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ సంపత్‌కుమార్**



మున్సిపల్ స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ సంపత్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 11వ తేది నిర్వహించనున్న భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాలకు త్వరితగతిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. స్టేడియంలో ఉత్సవాల ఏర్పాట్లను కలెక్టర్, జేసీ డాక్టర్ పి.సంపత్‌కుమార్, మున్సిపల్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అబుల్ కలాం జాద్ జయంతి ఉత్సవాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు. ఏర్పాట్లలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉత్సవాలకు 5 నుంచి 6 వేల మంది ముస్లిం మైనార్టీలు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ప్రధాన వేదిక నిర్మాణంతో పాటు రాష్ట్ర ఉన్నతాధికారులు, రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు ఆశీనులయ్యేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. అబుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఒకరికి జాతీయ పురస్కారంతో పాటు 8 మందికి అబుల్ కలాం లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు, 78 ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు, 78 మందికి ఉత్తమ విద్యార్థి అవార్డులు రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందజేస్తామని వెల్లడించారు. జాబితా ప్రకారం అవార్డు గ్రహీతలకు ముందుగానే సమాచారం అందించి వారికి కేటాయించిన స్థానాల్లో ఆశీనులు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పార్కింగ్ సౌకర్యం, పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు సూచించారు. ఏర్పాట్లు పరిశీలించిన వారిలో ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ మస్తాన్ వలి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి షాహి ఉన్నీషాబేగం, ట్రాన్స్ కో ఈఈ సుధాకర్, పోలీస్ అధికారులు ఉన్నారు.

# బయోస్టాటిస్టిక్స్‌పై వర్క్‌షాపు



జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాపు ప్రారంభించిన వీసీ డాక్టర్ కె.బాబ్జి, రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి

లబ్బీపేట(విజయవాడతూర్పు): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న బయోస్టాటిస్టిక్స్ పరిశోధనా పద్ధతులపై వర్క్‌షాపు గురువారం ప్రారంభమైంది. హెల్త్ యూనివర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్క్‌షాపును వైస్ చాన్సలర్ డాక్టర్ కె.బాబ్జి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలానుగుణంగా నాలెడ్జ్‌ని అప్‌గ్రేడ్ చేసుకోవాలని, ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్‌తో సమానంలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 28 మంది పీహెచ్‌డీ విద్యార్థులు, 300 మందికిపైగా అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు వంద మంది పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాజరయ్యారు. ఇలాంటి వర్క్‌షాపు నిర్వహించడం ఇదే మొదటి సారి అని హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికా రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ సుమితా శంకర్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరసింహం, ఏపీ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఐ రమేష్, డాక్టర్ సుధ తదితరులు పాల్గొన్నారు.

# ఆతిథ్య రంగం క్రియాశీలక పాత్ర



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కె.శ్యాంరాజు

ఆటోనగర్(విజయవాడతూర్పు):దేశస్థూల జాతీయ ఉత్పత్తిలో ఆతిథ్య రంగం క్రియాశీలక పాత్ర పోషిస్తుందని దక్షిణ భారత హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శ్యాంరాజు అన్నారు. విజయవాడ హోటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక భారతీనగర్‌లో గురువారం నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. శ్యాంరాజు మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరచి... అభివృద్ధి చేస్తే విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి సందర్శకుల తాకిడి పెరుగుతుందని తెలిపారు. హోటల్స్, రెస్టారెంట్ ద్వారా 18 శాతం ప్రభుత్వానికి పన్నుల రూపంలో జమ అవుతుందని చెప్పారు. సింగిల్ విండో ద్వారా లైసెన్స్ జారీని సులభతరం చేయాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి మాట్లాడుతూ వచ్చే ఏడాది 2024న విశాఖపట్నం వేదికగా దక్షిణ భారత హోటల్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మురళీఫార్ట్యూన్ అధినేత ముత్తవరపు మురళీకృష్ణ, లెమన్ ట్రీ అధినేత గోకరాజు గంగరాజు, గ్రేట్ హోటల్ అధినేత ఎం.రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

### పోరంకిలో గొలుసు దొంగతనం

పెనమలూరు: పోరంకిలో పట్టపగలు చైన్ స్నాచింగ్ జరిగింది. గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి లక్ష్మినరసమ్మ (64) గురువారం మధ్యాహ్నం స్టేట్ బ్యాంక్ ప్రాంతం నుంచి నడుచుకుంటూ గంగానమ్మ గుడి దాటి బంధువుల ఇంటికి వెళ్తున్నారు. ఆ సమయంలో అప్పటికే రోడ్డు పక్కన బైక్‌తో హెల్మెట్ ధరించి ఉన్న వ్యక్తి లక్ష్మినరసమ్మ పై ఒక్కసారిగా దాడి చేశాడు. ఆమె మెడలో ఉన్న 10 కాసుల రెండు బంగారు గొలుసులు తెంచుకుని బైక్‌పై పారిపోయాడు. దొంగ చేసిన దాడితో లక్ష్మినరసమ్మకు గాయాలయ్యాయి. వైద్యులు చికిత్స చేసి ఆమెకు నాలుగు కుట్లు వేశారు. జనసంచారం ఉన్న ప్రాంతంలో మహిళపై దాడి చేసి బంగారు గొలుసులు తెంచుకొని పారిపోవటంపై స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఘటనా స్థలం వద్దకు సీఐ టి.వి.వి.రామారావు వచ్చి పరిశీలించి బాధితురాలితో మాట్లాడారు. ఆధారాలు సేకరించామని నిందితుడిని త్వరలో పట్టుకుంటామని సీఐ రామారావు తెలిపారు.

### లేబర్ బోర్డులో రిజిస్ట్రేషన్ తప్పనిసరి

గన్నవరం: కార్మికులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.జయలక్ష్మి సూచించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ కార్మిక హక్కుల రక్షణకు పలు చట్టాలు ఉన్నాయని చెప్పారు. కార్మికులు తప్పకుండా లేబర్ బోర్డ్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని గుర్తింపు కార్డు పొందాలని తెలిపారు. ప్రమాదాలకు గురైనప్పుడు గాయపడిన, మరణించినా పరిహారం పొందవచ్చని చెప్పారు. బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సాహించడం చట్టరీత్యా నేరమన్నారు. రూ. 3 లక్షలలోపు వార్షిక ఆదాయం ఉన్నవారికి, పిల్లలు, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత న్యాయ సాయం అందించనున్నట్లు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరివీధి వెంకయ్య, ప్రధాన కార్యదర్శి జాస్తి తాతారావు, న్యాయవాదులు ఉన్నారు.

# 16 నుంచి కొమ్మినేని జిల్లాల పర్యటన

**ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రచారం**

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, యువత మొదలైన వర్గాల వారు ప్రభుత్వం నుంచి పొందిన ప్రయోజనాలపై ఆయా వర్గాలతో పాటుగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు సమగ్ర సమాచారం ఇవ్వడం కోసం ఈ నెల 16 తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా తాను పర్యటించనున్నామని సి.రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ గా తాను బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తి అయ్యిందని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన పాలనా సంస్కరణలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పరిశ్రమల స్థాపన వంటి అంశాలపై పూర్తి సమాచారాన్ని ప్రచారం చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. ఈ పర్యటనల్లో భాగంగా పాత్రికేయలతో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ నెల 16 తేదీ నుంచి రాయలసీమలోని కర్నూలు, పుట్టపర్తి, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో తాను పర్యటిస్తానని కొమ్మినేని శ్రీనివాసరావు వివరించారు.

# ప్రభుత్వ నిబంధనల మేరకే టీడీఆర్ బాండ్లు

**మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**



సమావేశంలో కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కమిటీ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం జరుగుతున్న నిర్మాణలకు మాత్రమే టీడీఆర్ బాండ్స్ ఇస్తామని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ వుండ్కర్ స్పష్టం చేశారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోగల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో గురువారం టీడీఆర్ బాండ్స్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కమిటీ చైర్మన్‌గా ఉన్న ఆయన నిర్వహించిన సమీక్షలో రీజనల్ డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (రాజమహేంద్రవరం), విజయవాడ సెంట్రల్, నార్త్, ఈస్ట్, వెస్ట్ నియోజకవర్గాల తహసీల్దార్లు అరుణ వల్లి, వెన్నెల శ్రీను, ఎం.మాధురి, వెంకట రామయ్య, పి.జాహ్నవి, డెప్యూటీ కమిషనర్ విజయవాడ నగర పాలక సంస్థ (రెవెన్యూ) డి.వెంకట లక్ష్మి, గాంధీనగర్ జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు ప్రసాద్ (గాంధీనగర్), కృష్ణప్రసాద్ (గుణదల), శ్రీచైతన్య (పటమట), డైరెక్టర్ టౌన్ ప్లానింగ్ ఏపీ సీఆర్‌డీఏ విజయవాడ ఎం వెంకట సుబ్బయ్యలతో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కమిటీని ఏర్పాటు చేశారు. ఇకపై ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) ఇవ్వాలన్నా, అంతకు ముందు పెండింగ్‌లో ఉన్న టీడీఆర్ బాండ్లు కచ్చితంగా ఈ కమిటీ పరిశీలించిన తరువాతే ఇవ్వాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ వుండ్కర్ అన్నారు. కమిటీ ముందు 15 ప్రతిపాదనలు పెట్టారు. ప్రతి 15 రోజులకు జరిగే సమీక్షా సమావేశంలో వచ్చిన ప్రతిపాదనలకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి టీడీఆర్ బాండ్లు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ రోజు ప్రతిపాదించిన 15 అభ్యర్ధనలు ప్రభుత్వ నిబంధనల మేరకు ఉన్నాయా లేదా అన్నది కమిటీ సభ్యులు పరిశీలించిన తరువాతే తరువాత సమావేశంలో సిఫార్స్ చేస్తారని తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులతోపాటు సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డిప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ సిరెన్ రాయ్, టీపీబీఓ వసీం బేగ్ తదితరులు పాల్గొన్నారు.

# అనధికారికంగా విద్యుత్ వినియోగిస్తే కఠిన చర్యలు

రామవరప్పాడు: విద్యుత్‌ను అనధికారికంగా వినియోగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆ శాఖ ఆపరేషన్ ఈఈ పి. హరిబాబు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో విద్యుత్ ఈఈ, ఏఈలు బృందాలుగా ఏర్పడి గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. వీటిలో గృహ వినియోగం 7-, వాణిజ్య వినియోగ సర్వీసులు 11, పరిశ్రమలు 1లో అదనపు లోడు వినియోగించడాన్ని, పలువురికి మల్టీపుల్ సర్వీసులు ఉండటాన్ని గుర్తించి కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈఈ హరిబాబు మాట్లాడుతూ విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తే జరిమానాతో సరిపెట్టకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

### నేడు డయల్ యువర్ పోలీస్ కమిషనర్

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణాతో నేరుగా ప్రజలు మాట్లాడేందుకు ప్రతి శుక్రవారం డయల్ యువర్ సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నారని కమిషనర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్యలో 0866-2490613 నంబర్‌కు ఫోన్ చేసి ప్రజలు తమ సమస్యలను నేరుగా సీపీకి తెలియజేయాలని సూచించారు.

# పేదలకు వరం.. జగనన్న ఆరోగ్య సురక్ష



రోగులను పరామర్శిస్తున్న దేవినేని అవినాష్

గుణదల (విజయవాడ తూర్పు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అమలుజేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదల పాలిట వరంలా మారిందని ఆ పార్టీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. 3వ డివిజన్ పరిధిలోని దాసరి అవంతి వీఎంసీ పాఠశాల ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన రూపొందించి అమలు పరుస్తున్న పథకాల ద్వారా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందుతున్నారని చెప్పారు. ముఖ్యంగా ఇటీవల ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం చరిత్రలో నిలిచిపోతుందని హర్షం వ్యక్తం చేశారు. పేదలకు అవసరమైన వైద్యాన్ని ఇంటి వద్దకే చేరువ చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. నైపుణ్యం కలిగిన వైద్యులు ప్రాథమిక స్థాయి నుంచీ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. దీని ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి తరహాలో వైద్యం అందుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందికి ఈ పథకం ద్వారా వైద్య సదుపాయం చేరువైందని వివరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, వైఎస్సార్ సీపీ నాయకులు ముసునూరి సుబ్బారావు, చిత్రం లోకేష్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గురువారం 14, 3, 18, 16 డివిజన్‌లలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ పేదరికం కారణంగా ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇలాంటి బృహత్తర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. నాడు మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకంను ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరోగ్యశ్రీని అమలు చేయడమే కాకుండా దానిని మరింత విస్తృతపర్చిందని చెప్పారు. కార్యక్రమంలో వీఎంసీ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు భీమిశెట్టి ప్రవల్లిక, చింతల సాంబయ్య, మండల అధ్యక్షులు ఉమ్మడిశెట్టి బహదూర్ పాల్గొన్నారు.

### క్రమశిక్షణతోనే విద్యార్థులకు విజయాలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): క్రమశిక్షణతో కూడిన విద్యాబోధనతో పాటు ఇంటర్నేషనల్ స్టాండర్స్ విద్యను అందించడంతో ఫిట్జీ విద్యార్థులు విజయాలు సాధిస్తున్నారని ఆ సంస్థ డైరెక్టర్ పిన్నెపు రమేష్‌బాబు అన్నారు. నగరంలోని ఫిట్జీ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. బృందావనకాలనీలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన వేడుకల్లో రమేష్‌బాబు మాట్లాడారు. విద్యార్థులు అంకితభావంతో విద్యనభ్యశిస్తే ఎంచుకున్న లక్ష్యాలను సాధించవచ్చునన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందచేశారు. అంతేకాక ఐఐటీ, ఐఐఐటీ, బీఐటీఎస్‌లో సీట్లు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. విద్యార్థులతో పాటు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ప్రకటన

నా క్లయింటు వులవకట్టి శివరామకృష్ణ, తండ్రి: వులవకట్టి బోసుబాబు, వయస్సు 45 సం॥లు, నివాసము: డోరు నెం. 14-16, తాడిగడప డొంక రోడ్డు, యనమలకుదురు గ్రామ, పెనమలూరు మండలం, కృష్ణాజిల్లా వారి నుండి సంజాయిషీ పొంది తెలియజేయునది ది. 25-10-2023న నివాసము యనమలకుదురు నుండి ఆశోక్‌నగర్ చౌదరిపేట మారుతున్న సమయములో కొన్ని డాక్యుమెంట్స్ మిస్ అయిన వాటిలో డాక్యుమెంట్ నెం. 802/2021, విజయవాడ, గుణదల, బాలబొమ్మ రెసిడెన్సీ అను పేరు గల గృహ సముదాయము నందలి 2వ అంతస్తులోని ఫ్లాట్ నెం. ఎస్.ఎఫ్-2కు హద్దులు: తూర్పు: అ. 33-0లు వెడల్పు గల రోడ్డు అ 40.0లు, దక్షిణం: ప్లాటు నెం. 9రు దాఖలా అల్లూరి సునిత గారి ఆస్తి అ. 46.0లు, పడమర: వి. సాయిరామకృష్ణ మరియు టి. సూర్యనారాయణ గారుల ఆస్తి అ. 40.0లు, ఉత్తరం: ప్లాటు నెం. 7రు దాఖలా ఈదుపల్లి సత్యనారాయణ గారి ఆస్తి అ. 46.0లు పై నాలుగు హద్దుల మధ్య చ.గ. 204.44 స్థిరాస్తి ఖాళీ సీవేజన స్థలము మరియు డాక్యుమెంట్ నెం. 5166/2021 మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ ఒరిజినల్ డాక్యుమెంట్ ది. 23-07-2021 డాక్యుమెంటు హద్దులు. ఉత్తరం: యుండవల్లి కోటయ్య స్థలం, దక్షిణం: షేక్ జానీ స్థలం, తూర్పు: వులవకట్టి రామయ్య స్థలం, పడమర: PWD బోడికాలవ మధ్య గల 40 సెంట్లు మాగాణి భూమి డాక్యుమెంట్స్ పోయినవి. సదరు డాక్యుమెంట్స్ ఎవరికైనా దొరికిన యెడల మా క్లైయింటుకు అప్పగించగలరు.

పి. సుధాకరరావు, B.A, LL.B.,
అడ్వకేట్ అండ్ నోటరీ
డి.నెం. 4-25-9/2, భీమునవారిపేట,
కొత్తపేట, విజయవాడ-1. సెల్.98481 49660

# బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి



స్పెషల్ సెక్రటరీ భరత్‌గుప్తాను కలిసి వినతిపత్రం అందజేస్తున్న సమాఖ్య ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్యవారు స్పెషల్ సెక్రటరీ భరత్‌గుప్తాకు గురువారం వినతిపత్రం అందజేశారు. సమాఖ్య అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం బ్రాహ్మణ కార్పొరేషన్ పనితీరు, బడ్జెట్, పథకాల అమలు, వేదవ్యాస స్కీంను అమ్మఒడి ద్వారా అమలుపర్చుట, బ్రాహ్మణ భవనానికి భూమి కేటాయింపు, ధూపదీప నైవేద్యం సొమ్ము పెంపుదల మొదలైన సమస్యలను వినతి పత్రంలో పేర్కొన్నారు. స్పెషల్ సెక్రటరీ భరత్‌గుప్తా స్పందించారని, సమస్యలను సీఎంకి వివరించి అతి త్వరలో అన్ని బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సమాఖ్య గౌరవ అధ్యక్షుడు యామిజాల నరసింహమూర్తి, తెలికేపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ యడవల్లి శ్రీనివాసశర్మ, పురాణంశేషు ఉన్నారు.

# 19న విజయవాడ మారథాన్

**5కే, 10కే, 21 కే విభాగాల్లో నిర్వాహణ**

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగర వాసులకు ఆరోగ్యంతో పాటు, నడకపై అవగాహన కలిగించేందుకు విజయవాడ రన్నర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 19న శ్రీరామ్ ఫైన్స్ విజయవాడ మారథాన్ నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు మణిదీపక్, నాగేశ్వరరావు తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో మారథాన్ వివరాలు వెల్లడించారు. ఏడు సంవత్సరాలుగా మారథాన్ నిర్వహిస్తున్నామని చెప్పారు. తాము నిర్వహిస్తున్న మారథాన్‌కు నగర వాసుల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ఈ మారథాన్‌ను 5కే, 10కే, 21 కే మూడు విభాగాలుగా నిర్వహిస్తుననట్లు వెల్లడించారు. రన్‌లో పాల్గొనే వారికి టీ షర్ట్, గుడి బ్యాగ్, టైమింగ్ చిప్ విత్ లైవ్ రేస్ డే ఫోటోస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. నిర్ణీత సమయంలో పూర్తి చేసిన వారికి ఈ సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ రన్ 19న ఉదయం జింఖానా గ్రౌండ్స్ వద్ద ప్రారంభమై బీఆర్‌టీఎస్ రోడ్డులో కొనసాగుతుందని తెలిపారు. విజేతలకు మెడల్స్ సర్టిఫికెట్స్ ఇస్తామన్నారు. పాల్గొనే వారు www.Vijayawadarunnerr.com వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో 'స్మార్ట్ విలేజ్' ఎండీ మృతి

**నర్సీపట్నం:** అనకాపల్లి జిల్లా శంకరం జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్మార్ట్ విలేజ్ ఎండీ ఇందుపూడి సుధాకర్ మృతి చెందాడు. నర్సీపట్నం నుంచి కారులో వెళ్తుండగా అనకాపల్లి శంకరం జాతీయ రహదారి డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనకాపల్లికి చెందిన సుధాకర్ స్మార్ట్ విలేజ్ సంస్థలో ఉద్యోగాల పేరుతో ఉత్తరాంధ్రాలోని వేలాది మంది నిరుద్యోగుల నుంచి భారీ మొత్తంలో నగదు కాజేశాడన్న ఆరోపణలున్నాయి. ఉద్యోగాల పేరుతో తమను మోసం చేశాడని సుధాకర్‌పై నిరుద్యోగులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ అధికారులు సుధాకర్‌ను అరెస్టు చేశారు. బెయిల్‌పై విడుదలై ప్రస్తుతం విచారణ ఎదుర్కొంటున్నాడు. ఆయనకు సంబంధించిన ఆస్తులను సీఐడీ అధికారులు సీజ్ చేశారు. ఆయన కొంతకాలంగా నర్సీపట్నంలోనే నివాసం ఉంటున్నాడు.

## ఆసక్తికర బోధనతో మెరుగైన ఫలితాలు

### సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు

**సాక్షి, అమరావతి:** విద్యార్థులు పాఠశాలవైపు మొగ్గు చూపాలంటే బోధన ఆసక్తికరంగా ఉండాలని, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు ప్రణాళికలు రచిస్తే, మెరుగైన ఫలితాలు వస్తాయని సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు సూచించారు. గురువారం విజయవాడలో 'వార్షిక వర్క్ ప్లాన్ అండ్ బడ్జెట్ తయారీ' అంశంపై అన్ని జిల్లాల సెక్టోరియల్ ఆఫీసర్లకు శిక్షణ సదస్సు నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి బడికి వచ్చేలా ఉపాధ్యాయులతో పాటు ఎంఈవోలు కూడా బాధ్యత తీసుకోవాలని సూచించారు. యూనిసెఫ్ ఎడ్యుకేషనల్ స్పెషలిస్ట్ గణేశ్ నిగమ్ ఉపాధ్యాయులకు డేటా పరిశోధన, సేకరణ, విశ్లేషణ తద్వారా విద్యా ప్రణాళిక రచన అంశాలపై తర్ఫీదు ఇచ్చారు. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి, సమగ్ర శిక్ష ఏఎస్పీడీ డాక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• తెలంగాణ

## పొంగులేటి ఇళ్లు, కార్యాలయాలపై ఐటీ దాడులు

**సాక్షి ప్రతినిధి, ఖమ్మం/సాక్షి, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కో–చైర్మన్, ఆ పార్టీ పాలేరు అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన ఇళ్లు, కార్యాలయాలపై గురువారం ఆదాయపన్ను (ఐటీ) అధికారులు ఏకకాలంలో దాడులు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నివాసాలతోపాటు హైదరాబాద్‌లోని నివాసాలు, కార్యాలయాలు, బంధువులు, ఉద్యోగుల ఇళ్లకు చెందిన 30కిపైగా ప్రాంతాల్లో ఈ తనిఖీలు జరిగాయి. తెల్లవారుజామున 5 గంటలకే హైదరాబాద్, ఖమ్మంలోని పొంగులేటి నివాసాలకు సీఆర్పీఎఫ్ బలగాలతో కలసి ఐటీ అధికారులు చేరుకున్నారు. సాయంత్రం 6 గంటల వరకు సోదాలు కొనసాగాయి.

# జనంపై భారం లేదు

- 2025 నాటికి స్మార్ట్ మీటర్లు కేంద్ర ఎలక్ట్రిసిటీ అథారిటీ నిబంధన
- దేశవ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాలు ఈ పనులు చేపట్టాయి
- 'ఆర్‌డీఎస్ఎస్' పథకంతో మీటరుకు రూ.1,350 వరకు గ్రాంటు
- రూ.20వేల కోట్ల భారమంటూ కాకి లెక్కలతో 'ఈనాడు' గగతప్పుడు కథనం



పృథ్వీతేజ్



పద్మజనార్దనరెడ్డి



సంతోషరావు

**సాక్షి, అమరావతి:** దేశవ్యాప్తంగా తొమ్మిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో స్మార్ట్ మీటర్ల ప్రక్రియ కొనసాగుతుంటే ఏపీ మినహా మరెవరూ స్మార్ట్ మీటర్లు అమర్చడం లేదంటూ నిస్సిగ్గుగా అబద్ధాలను అచ్చేస్తోంది ఈనాడు. ప్రభుత్వ, వాణిజ్య, పారిశ్రామిక సర్వీసులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తుంటే 'జనం జేబుకు చిల్లు' అంటూ వక్ర భాష్యాలు చెబుతోంది. ఆ కథనంలో దాచి పెట్టిన వాస్తవాలను ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కమ్‌లు) సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, జె.పద్మజనార్దనరెడ్డి, కె.సంతోషరావు గురువారం 'సాక్షి'కి వెల్లడించారు.

➡ విద్యుత్ పంపిణీ నష్టాల తగ్గింపు చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ 2025 నాటికి ప్రతి సర్వీసు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లు అన్నిటికి స్మార్ట్ మీటర్లను అమర్చాలనే నిబంధన విధించాయి. వినియోగదారులపై ఎటువంటి అదనపు భారం లేకుండా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఈ పథకాన్ని రూపొందించారు. ఈమేరకు దేశవ్యాప్తంగా డిస్కమ్‌లు చర్యలు చేపట్టాయి. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగానే టెండర్ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోంది.

➡ రాష్ట్రంలో 200 యూనిట్లు అంతకుమించి వాడకం ఉన్న సర్వీసులకు, ప్రభుత్వ సర్వీసులకు డిస్కమ్‌లు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు **చేస్తాయి.** తద్వారా పేద, మధ్య తరగ**తిపై** భారం లేకుండా చర్యలు తీసు**కు**న్నాయి. ప్రీపెయిడ్ మీటర్లలో కొ**త్త** టెక్నాలజీ ద్వారా అనేక ప్రయో**జ**నాలున్నాయి. బిల్లును ఎప్పటి**క**ప్పుడు తెలుసుకోవచ్చు. ఒకే**సారి** కాకుండా అవసరాన్ని బట్టి **చెల్లించ**వచ్చు. విద్యుత్ సరఫరా చేసే సమయం, నాణ్యతను తెలుసుకునే వీలుంది. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టవచ్చు. డబ్బులు కట్టలేదని లైన్‌మెన్ కరెంట్ నిలుపుదల చేసే పరిస్థితి ఉండదు. ప్రమాదాలు కూడా గణనీయంగా తగ్గుతాయి. ఆర్‌డీఎస్ఎస్ పథకంలో భాగంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు 2025 మార్చి వరకు గడువు ఉంది. రెండు నెలల వ్యవధిలో ఏర్పాటు చేయాలన్నది అవాస్తవం.

➡ దేశంలో 19.792 కోట్ల మంది వినియోగదారులకు స్మార్ట్ మీటర్లను అమర్చేందుకు ఆమోదం లభించింది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఛత్తీస్‌ఘడ్, బిహార్, అసోం, మణిపూర్, ఆంధ్రప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, మధ్యప్రదేశ్, త్రిపురలో 7.517 కోట్ల స్మార్ట్ మీటర్లను బిగించేందుకు టెండర్లను ఖరారు చేశారు. బిగించే ప్రక్రియ కొన్ని రాష్ట్రాల్లో కొనసాగుతోంది.

➡ మన రాష్ట్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు, వాణిజ్య భవనాలకు, పారిశ్రామిక వినియోగదారు**లకు, విద్యుత్** పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లకు, 11 కేవీ **ఫీడర్ల**కు కలిపి 42 లక్షల స్మార్ట్ మీటర్లను **బి**గించేందుకు డిస్కమ్‌లు చర్యలు చేప**ట్టా**యి. ఒక్కో సింగిల్ ఫేజ్ మీటర్‌కు నెలకు రూ.86.32, త్రీ–ఫేజ్ మీటర్‌కు **రూ**.176.02 చొప్పున 93 నెలల వ్యవ**ధిలో** టెండర్ దక్కించుకున్న సంస్థలకు **చెల్లించా**ల్సి ఉంటుంది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, పదేళ్ల పాటు నిర్వహణకు రూ.5 వేల కోట్లు వ్యయం కానుంది. అయితే ఆర్‌డీఎస్ఎస్ పథకం ద్వారా మీటరుకు రూ.1,350 వరకు కేంద్రం గ్రాంట్ ఇస్తుంది. ఇదంతా వదిలేసి రూ.20 వేల కోట్ల భారమంటూ 'ఈనాడు' కాకి లెక్కలతో తప్పుడు రాతలను అచ్చేసింది.

## ఇక ప్రత్యేక గుర్తింపుతోనే మొబైల్ నంబర్!

- యూనిక్ ఐడీ నంబర్‌తో జారీ చేసేందుకు కేంద్రం సన్నాహాలు
- ఎన్ని సిమ్‌లు ఉన్నా.. ఒకటే ఐడీ నంబర్
- సైబర్ వేధింపులు, ఆన్‌లైన్ మోసాల కట్టడికి నిర్ణయం

**సాక్షి, అమరావతి:** సైబర్ వేధింపులు, ఆన్‌లైన్ మోసాలను కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. ప్రతి మొబైల్ ఫోన్ వినియోగదారునికి 'యూనిక్ ఐడీ(ప్రత్యేక గుర్తింపు) నంబర్' కేటాయించాలని నిర్ణయించింది. ఓ వ్యక్తికి ఎన్ని మొబైల్ ఫోన్లు ఉన్నా, ఎన్ని సిమ్ కార్డులు ఉన్నా సరే.. ఐడీ నంబర్ మాత్రం ఒకటే ఉండేలా కార్యాచరణను రూపొందించింది. ఈ ఏడాది చివరినాటికే ఈ ప్రక్రియను ప్రారంభించాలని నిర్ణయించింది.

**జనాభా కంటే సిమ్‌కార్డులే అధికం..!**

మొబైల్ టెక్నాలజీ ప్రజలకు ఎంత సౌలభ్యంగా ఉందో.. సైబర్ నేరస్తులకు అంత ఉపయోగకరంగా మారిందన్నది వాస్తవం. దేశంలో అత్యధిక ప్రాంతాల్లో జనాభా కంటే మొబైల్ ఫోన్లు/సిమ్ కార్డులే అధికంగా ఉండటం గమనార్హం. 2022 డిసెంబర్ నాటికి దేశంలో 114 కోట్ల మొబైల్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో బీఎస్ఎన్ఎల్ కనెక్షన్లు 10.7 కోట్లుండగా.. ప్రైవేటు టెలికాం కంపెనీల కనెక్షన్లు 102 కోట్లకుపైనే ఉన్నాయి. దేశంలో ప్రస్తుతం అమలులో ఉన్న టెలికాం నిబంధనల మేరకు జమ్మూ–కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో మినహా మిగిలిన చోట్ల ఒక వ్యక్తి పేరిట గరిష్టంగా 9 సిమ్ కార్డులు ఉండవచ్చు. జమ్మూ–కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో గరిష్టంగా 6 సిమ్ కార్డులు ఉండవచ్చు. కానీ ప్రైవేటు టెలికాం కంపెనీల ఫ్రాంచైజీలు కొన్ని సిమ్ కార్డుల విక్రయంలో నిబంధనలను పాటించడం లేదు. దీంతో సైబర్ నేరస్తులు వేర్వేరు పేర్లతో ఫోన్ కనెక్షన్లు, సిమ్ కార్డులు తీసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. 2022లో భారత్‌లో జరిగిన సైబర్ మోసాలు, వేధింపుల్లో 65 శాతం దొంగ సిమ్‌కార్డులతో చేసినవేనని నేషనల్ సైబర్ సెల్ నివేదిక వెల్లడించింది. వేర్వేరు పేర్లతో సిమ్ కార్డులు తీసుకొని ఆన్‌లైన్ మోసాలకు పాల్పడటంతో పాటు సోషల్ మీడియాలో ఫేక్ ప్రొఫైల్స్ పెట్టి మహిళలను వేధింపులకు గురి చేస్తున్నారని ఆ నివేదిక పేర్కొంది. 2022లో దేశంలో నమోదైన మొత్తం నేరాల్లో.. సోషల్ మీడియాకు సంబంధించినవే 12 శాతం ఉండటం గమనార్హం.

**14 అంకెలతో యూనిక్ ఐడీ నంబర్..**

సోషల్ మీడియా వేధింపులు, ఆన్‌లైన్ మోసాల కట్టడికి దేశంలో మొబైల్ ఫోన్ల కనెక్షన్ల వ్యవస్థను గాడిలో పెట్టాలని కేంద్ర హోం శాఖ నిర్ణయించింది. టెలికాం శాఖతో కలసి కార్యాచరణను రూపొందించింది. మొబైల్ వినియోగదారులు అందరికీ యూనిక్ ఐడీ నంబర్ కేటాయించాలని నిర్ణయించింది. ఇది 14 అంకెలతో ఉండనుంది. ఓ వ్యక్తి పేరిట ఎన్ని ఫోన్ కనెక్షన్లు ఉన్నా సరే యూనిక్ ఐడీ నంబర్ మాత్రం ఒక్కటే ఉంటుంది. దేశంలో ఎక్కడ సిమ్ కార్డు కొనుగోలు చేసినా.. ఏ ప్రాంతంలో ఫోన్‌ను ఉపయోగిస్తున్నా సరే యూనిక్ ఐడీ నంబర్ మాత్రం అదే ఉంటుంది. వినియోగదారుల ఫోన్‌కు మెసేజ్ పంపించి.. ఓటీపీ ద్వారా నిర్ధారించి.. యూనిక్ ఐడీ నంబర్ కేటాయించాలని కేంద్ర టెలికాం శాఖ భావిస్తోంది. త్వరలో మార్గదర్శకాలు జారీ చేయనుంది.

**'అస్త్ర' అప్‌డేట్..**

సిమ్‌కార్డు మోసాలను అరికట్టేందుకు ఉద్దేశించిన కేంద్ర టెలికాం శాఖకు చెందిన 'అస్త్ర' సాఫ్ట్‌వేర్‌ను ఆధునీకరించనున్నారు. మొబైల్ కనెక్షన్ల కోసం సమర్పించిన గుర్తింపు కార్డులు, ఫొటోలు సక్రమంగా ఉన్నాయో, లేదో గుర్తించడంతోపాటు సంబంధిత దరఖాస్తుదారులకు అప్పటికే యూనిక్ ఐడీ నంబరు కేటాయించారా, లేదా అనే విషయాలను కూడా ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా పరిశీలించనున్నారు. తద్వారా నకిలీ సిమ్‌కార్డులు, వేర్వేరు పేర్లతో ఉన్న సెల్‌ఫోన్ కనెక్షన్లకు చెక్ పెడతారు. ఈ విధానం ద్వారా ఎక్కడైనా సైబర్ కేసు నమోదవ్వగానే.. నిందితులను సులభంగా గుర్తించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఆ సిమ్ కార్డు ఎవరి పేరుతో ఉంది.. యూనిక్ ఐడీ నంబర్‌తో సరిపోలుతోందా, లేదా అనే విషయాలను నిర్ధారించవచ్చని పేర్కొన్నారు.

## రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డి

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం నివారణకు మరింత మెరుగైన చర్యలు చేపట్టాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) డా.కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. ప్రతి నెల మొదటి, మూడవ శుక్రవారాల్లో 'విలేజ్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ డే'ను క్రమం తప్పకుండా నిర్వహించి.. వివిధ ఆరోగ్య అంశాలపై ప్రజలకు అవగాహన పెంపొందించాలని వైద్య, ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులకు సూచించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో ఆయన వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. బాలింతలు, చిన్నారులకు సకాలంలో పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా.. వారిని ఆ సమస్యల నుంచి విముక్తులను చేయవచ్చన్నారు. హైరిస్క్ ప్రెగ్నెంట్ మహిళల సమాచారాన్ని అందుబాటులో ఉంచుకుని.. వారి ఆరోగ్య పరిస్థితిని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. కౌమార బాలికల్లో రక్తహీనత, ఎదుగుదల లేకపోవడం, పౌష్టికాహార లోపాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంలో కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహించాలని సూచించారు. డిసెంబర్ నెలాఖరులోగా రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ స్కూళ్లలో చదివే విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు సంబంధించిన స్క్రీనింగ్ టెస్టులు పూర్తి చేసేలా ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలకు ఆదేశాలివ్వాలని పాఠశాల విద్యా శాఖను సీఎస్ ఆదేశించారు. బాల్య వివాహాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. 'హెల్తీ బేబీ షో' వంటివి నిర్వహించి.. ఉత్తమంగా నిలిచిన గ్రామాలకు అవార్డులివ్వాలని సూచించారు. అంతకుముందు వైద్య, ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమం, విద్యా శాఖలకు సంబంధించిన నిర్దేశిత సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు తీసుకుంటున్న చర్యలను.. సాధించిన లక్ష్యాలను సీఎస్ సమీక్షించారు. సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు ఎం.టి.కృష్ణబాబు, జి.జయలక్ష్మి, సురేశ్ కుమార్, జె.నివాస్, దివాన్ మైదీన్, భావన, జానకి, ఎం.గిరిజా శంకర్, కె.భాస్కర్ పాల్గొన్నారు.

• తెలంగాణ

## దర్శకుడు రాఘవేంద్రరావుకు హైకోర్టు నోటీసులు

**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ భూమి కేటాయింపునకు సంబంధించి సినీ దర్శకుడు కె.రాఘవేంద్రరావు సహా పలువురికి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణను జనవరి మూడో వారానికి వాయిదా వేస్తూ అప్పటిలోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. తెలుగు సినిమా పరిశ్రమ అప్పటి మద్రాసు నుంచి హైదరాబాద్‌కు వచ్చేటప్పుడు 1984లో బంజారాహిల్స్‌లోని అత్యంత విలువైన భూమిని ఎకరా రూ.8,500 చొప్పున రెండు ఎకరాలను ప్రభుత్వం కేటాయించిందని, దీన్ని పరిశ్రమ అభివృద్ధికి కాకుండా వాణిజ్య కార్యకలాపాలకు వాడుకుంటున్నారని నిర్మాత, దర్శకుడు ఈ.బాలకిషన్ 2012లో హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. అధికారులతో పాటు రాఘవేంద్రరావు, కృష్ణమోహన్‌రావు, చక్రవర్తి, విజయలక్ష్మి, అఖిలానందేశ్వరి, లాలసదేవిలను ప్రతివాదులుగా పేర్కొన్నారు. దీనిపై గతంలోనే హైకోర్టు నోటీసులు జారీ చేసినా ప్రైవేట్ పార్టీలకు అందలేదు. ఈ పిల్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం ముందుకు గురువారం మరోసారి విచారణకు వచ్చింది.

• తెలంగాణ

## ఒకేరోజు 1,129 నామినేషన్లు

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల దాఖలు ఘట్టం శుక్రవారం ముగియనుంది. గురువారం ఏకాదశి సుముహూర్తం కావడంతో భారీసంఖ్యలో అభ్యర్థులు తరలివచ్చి నామినేషన్లు వేశారు. రాష్ట్రంలోని మొత్తం 119 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో గురువారం రికార్డు సంఖ్యలో 1,129 నామినేషన్లు దాఖలైనట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో) కార్యాలయ వర్గాలు తెలిపాయి. బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గురువారం ఉదయం 11 గంటలకు గజ్వేల్‌లో, మధ్యాహ్నం 2 గంటలకు కామారెడ్డిలో నామినేషన్లు వేశారు. సిరిసిల్లలో మంత్రి కేటీఆర్, సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు కూడా నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లు ప్రారంభమైన నాటి నుంచి బుధవారం వరకు 119 శాసనసభ నియోజకవర్గాల్లో మొత్తం 1,188 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో) కార్యాలయం ప్రకటించింది. గురువారం నాటికి దాఖలైన మొత్తం నామినేషన్ల వివరాలను అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

**సొంత కారు లేని కేసీఆర్**

బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తన పేరిట విడిగా సొంత కారు, ద్విచక్ర వాహనం, వ్యవసాయ భూమి వంటివేవీ లేవని ఎన్నికల అఫిడవిట్లలో పేర్కొన్నారు. గురువారం గజ్వేల్, కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా కేసీఆర్ నామినేషన్లు వేశారు. ఈ సందర్భంగా తనతోపాటు సతీమణి ఆస్తులు, అప్పులు, కేసుల వివరాలను వెల్లడించారు.

పంచతంత్రం

## మంత్రి ప్రయాణిస్తున్న కారుపై రాళ్ల దాడి

### ఛత్తీస్‌గఢ్‌లో ఘటన

**బెమెతరా:** ఎన్నికల ప్రచారహోరులో మునిగిపోయిన ఛత్తీస్‌గఢ్‌లో మంత్రి వాహనశ్రేణిపై గుర్తుతెలియని వ్యక్తులు రాళ్ల దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో మంత్రి గురు రుద్ర కుమార్ తృటిలో తప్పించుకున్నారు. మరో వాహనం స్వల్పంగా ధ్వంసమైంది. ఈ వాహనంలో ఉన్న భద్రతా సిబ్బందికి చిన్నపాటి గాయాలయ్యాయి. వారికి దగ్గర్లోని ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్సచేశారు. బుధవారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నవాగఢ్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేస్తున్న రుద్రకుమార్ బెమెతరా జిల్లాలో గురువారం సాయంత్రం ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచారం ముగిశాక మంత్రి తిరుగుపయనమైన సందర్భంగా నవాగఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఝూల్ గ్రామం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లదాడికి పాల్పడ్డారని జిల్లా మహిళా ఎస్పీ భావనా గుప్తా చెప్పారు. నవాగఢ్ సిట్టింగ్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత అయిన దయాళ్‌దాస్ బఘేల్‌కు ఈసారి పార్టీ టికెట్ నిరాకరించింది. అహివారా ఎమ్మెల్యే అయిన రుద్రకుమార్‌ను ఈసారి నవాగఢ్ నుంచి పార్టీ బరిలో దింపింది. దీంతో దయాళ్‌దాస్ మద్దతుదారులే ఈ దాడి చేసి ఉంటారనే అనుమానాలు వినిపిస్తున్నాయి. తొలి దఫా కింద రాష్ట్రంలో 20 స్థానాలకు పోలింగ్ ఇప్పటికే పూర్తయింది. మిగతా స్థానాలకు నవంబర్ 17వ తేదీన పోలింగ్ జరగనుంది.

## ఐదేళ్లలో నక్సలిజం అంతం చేస్తాం

### ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హామీ

**జాష్‌పూర్:** ఛత్తీస్‌గఢ్ శాసనసభ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో నక్సలిజాన్ని అంతం చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. ఆయన గురువారం జాష్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. భూపేష్ బఘేల్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఛత్తీస్‌గఢ్‌లో గత ఐదేళ్లలో మత మార్పిడులు విచ్చలవిడిగా జరిగాయని ఆరోపించారు. గిరిజనులను బలవంతంగా మరో మతంలోకి మార్చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అవినీతి పెచ్చరిల్లిందని మండిపడ్డారు. రూ.వేల కోట్ల కుంభకోణాలు చోటుచేసుకున్నాయని చెప్పారు. మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో కాంగ్రెస్ ప్రభుత్వం కూరుకుపోయిందని అన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే అవినీతిపరులను జైలుకు పంపిస్తామని అమిత్ షా స్పష్టం చేశారు.

# 'నేర'గాళ్లను నెత్తినెట్టుకుంటున్నాయి!

**మధ్యప్రదేశ్‌లో క్రిమినల్ కేసులున్న అభ్యర్థులకు పార్టీల పట్టం**

- పోటీలో నిలిచిన 472 మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులు
- 200 మంది బీజేపీ, 196 మంది కాంగ్రెస్ అభ్యర్థులు కోటీశ్వరులు
- ఒక్క రూపాయి కూడా ఆస్తి లేదని ప్రకటించిన 12 మంది అభ్యర్థులు
- ఏడీఆర్ నివేదిక వెల్లడి




**సాక్షి, న్యూఢిల్లీ:** మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థులపై క్రిమినల్ కేసులున్నప్పటికీ రాజకీయ పార్టీలు 'డోంట్ కేర్' అనే విధంగా వ్యవహరిస్తున్నాయి. ఏరికోరి నేరచరితులకే పార్టీ టికెట్‌ను ఇస్తూ వారినే గెలుపు గుర్రాలుగా రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో 472 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) సంస్థ తన తాజా నివేదికలో వెల్లడించింది. గురువారం విడుదల చేసిన ఈ నివేదికలో మధ్యప్రదేశ్‌లో బరిలో నిలిచిన అభ్యర్థుల ఆస్తిపాస్తులు, నేర చరిత్ర తదితరాలను పొందుపరిచింది. అందులోని వివరాలను పరిశీలిస్తే..

**కొన్ని పార్టీల నుంచి 53 శాతం మంది నేరచరితులే**

మొత్తం అభ్యర్థులు 2,534లో 19 శాతం మందిపై అంటే 471 మందిపై క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. గతంలోనూ ఇదే సంఖ్యలో అభ్యర్థులు టికెట్ పొంది ఎన్నికల బరిలో నిలిచారు. ఈసారీ రాజకీయ పార్టీలు తమ పంథాను మార్చుకోకపోవడం విచారకరం. కొన్ని పార్టీల అభ్యర్థుల్లో 12 శాతం మందిపై క్రిమినల్ కేసులుంటే ఇంకొన్ని పార్టీల అభ్యర్థుల్లో ఏకంగా 53 శాతం మంది నేరచరితులే. అత్యధికంగా కాంగ్రెస్ పార్టీ నుంచి 121 మంది, బీజేపీ నుంచి 65 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తమ అఫిడవిట్లలో ప్రకటించినట్లు ఏడీఆర్, మధ్యప్రదేశ్ ఎలక్షన్ వాచ్ సంస్థలు వెల్లడించాయి. ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి 26 మంది, బహుజన్ సమాజ్‌పార్టీ(బీఎస్పీ) నుంచి 22 మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. 230 అసెంబ్లీ నియోజకవర్గాలున్న మధ్యప్రదేశ్‌లో ఈ నెల 17వ తేదీన జరగబోయే పోలింగ్‌లో మొత్తం 2,534 మంది అభ్యర్థులు తమ భవితవ్యాన్ని పరీక్షించుకోనున్నారు.

**రెడ్ అలర్ట్ నియోజకవర్గాలు 79**

711 మంది జాతీయ పార్టీల నుంచి, 103 మంది రాష్ట్ర పార్టీల నుంచి, 553 మంది రిజిస్టర్డ్ గుర్తింపు లేని పార్టీల నుంచి, 1167 మంది అభ్యర్థులు స్వతంత్రంగా పోటీ చేస్తున్నారు. 471 మందిపై సాధారణ క్రిమినల్ కేసులు ఉండగా 291 (11శాతం) మందిపై తీవ్రమైన క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. పార్టీల వారీగా పరిశీలిస్తే క్రిమినల్ కేసులు ఉన్న అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీలో 121 (53శాతం) మంది, బీజేపీలో 65 (28శాతం) మంది, ఆమ్ ఆద్మీ పార్టీలో 26 (39శాతం) మంది, బీఎస్పీలో 22 (12శాతం) మంది ఉన్నారు. మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నట్లు 24 మంది అభ్యర్థులు, హత్య సంబంధించిన కేసులు ఉన్నట్లు 10 మంది తమ అఫిడవిట్‌లలో పేర్కొన్నారు. ఇక 230 నియోజకవర్గాల్లో 79(34%) రెడ్ అలర్ట్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఏదైనా నియోజకవర్గంలో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది నేరచరితులు బరిలో నిలిస్తే ఆ నియోజకవర్గాన్ని 'రెడ్ అలర్ట్' స్థానం అంటారు. ఇలాంటి నియోజకవర్గాలు 2018 ఏడాది ఎన్నికల్లో 76 (33శాతం) ఉండటం చూస్తే 'నేర'గాళ్లు ఎంతగా ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములయ్యారో ఇట్టే తెలిసిపోతుంది.

**బీజేపీ, కాంగ్రెస్‌లో కోటీశ్వరుల హవా**

మొత్తం 2534 మంది అభ్యర్థులలో 727 మంది అంటే 29శాతం మంది అభ్యర్థులు కోట్లకు పడగలెత్తారు. ప్రధాన పార్టీల్లో వీరి సంఖ్య ఎక్కువగా ఉంది. బీజేపీ నుంచి 230 మంది పోటీచేస్తుంటే అందులో 87 శాతం మంది అంటే 200 మంది కోటీశ్వరులే. కాంగ్రెస్‌లో 85 శాతం(196) మంది, ఆమ్ ఆద్మీ పార్టీలో 59 శాతం(66) మంది, బహుజన్ సమాజ్ పార్టీలో 30 శాతం(54) మంది అభ్యర్థులు రూ.1 కోటి కంటే ఎక్కువ ఆస్తులకు అధిపతులు. రత్లామ్ నగర నియోజకర్గం నుంచి బరిలో నిలిచిన బీజేపీ అభ్యర్థి చేతన్య కశ్యప్ తనకు రూ.296 కోట్లకుపైగా ఆస్తులున్నట్లు ప్రకటించి ఈ జాబితాలో టాప్‌లో నిలిచారు. రూ.242 కోట్లకు పైగా ఆస్తులతో విజయ రాఘవగఢ్ నుంచి బీజేపీ అభ్యర్థి సంజయ్ సత్యేంద్ర పాఠక్, రూ.217 కోట్లతో ఇండోర్–1 కాంగ్రెస్ అభ్యర్థి సంజయ్ శుక్లా ఆ తర్వాత స్థానాల్లో నిలబడ్డారు. బరిలో నిలిచిన అభ్యర్థుల్లో 12 మంది తమకు కనీసం ఒక్క రూపాయి కూడా ఆస్తి లేదని ప్రకటించడం గమనార్హం. రుణాలు, అప్పుల్లో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థులే ముందు వరసలో నిల్చున్నారు. అందరికంటే ఎక్కువగా రూ.86 కోట్లకుపైగా అప్పులున్నట్లు బేతుల్ కాంగ్రెస్ అభ్యర్థి నిలయ్ వినోద్ డాగా ప్రకటించారు.

**952 మంది యువ అభ్యర్థులే**

విద్యార్హత విషయానికొస్తే మొత్తం అభ్యర్థుల్లో 5–12వ తరగతి చదువుకున్న అభ్యర్థులు 49 శాతం మంది ఉన్నారు. డిగ్రీ, అంతకంటే ఎక్కువ చదివిన వారు 44 శాతం మంది ఉన్నారు. 28 మంది అభ్యర్థులు నిరక్షరాస్యులు. ఆరుగురు అభ్యర్థులు తమ విద్యార్హతలను అఫిడవిట్లలో పేర్కొనలేదు. మొత్తం అభ్యర్థుల్లో 25–40 ఏళ్ల వయసువారు 38 శాతం మంది ఉన్నారు. 41–60 ఏళ్ల వయసు వారు 49 శాతం మంది ఉన్నారు. 61–80 ఏళ్ల వయసు వారు 13శాతం మంది ఉన్నారు. ఇద్దరి వయసు 80 సంవత్సరాలపైమాటే. మొత్తం అభ్యర్థుల్లో 10 శాతం అంటే 253 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. 2018 ఎన్నికల్లో మొత్తం అభ్యర్థుల్లో కేవలం 9 శాతం మందే మహిళా అభ్యర్థులు ఉన్నారు.

### భార్యాభర్తల నుంచి బావా మరదళ్ల దాకా...

# బరిలో బంధువులు

### రాజస్థాన్‌లో ఆసక్తి రేపుతున్న పోటీలు

**ఒకచోట భార్యాభర్తలు. మరోచోట బావా మరదళ్లు. ఇంకొన్ని స్థానాల్లో బాబాయ్–అబ్బాయ్–అమ్మాయ్. మరో దగ్గరేమో తండ్రీ కూతుళ్లు. రాజస్థాన్‌లో అసెంబ్లీ ఎన్నికల పోరు ఇలాంటి ఆసక్తికర సన్నివేశాలకు వేదికవుతోంది. పలు స్థానాల్లో బంధువుల మధ్య జరుగుతున్న ఈ పోటీలు రసవత్తరంగా మారుతున్నాయి...!**

రక్త సంబంధీకులు, దగ్గరి బంధువుల పరస్పర పోట్లాటలు రాజస్థాన్‌లో అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. ఇటువంటి స్థానాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు ఎంతో ఆసక్తి కలిగిస్తున్నాయి.

**దాంతారాంగఢ్: భార్యాభర్తల పోరు**

ఈ స్థానం రాష్ట్రవ్యాప్త ఆసక్తికి కారణమైంది. ఇక్కడ కాంగ్రెస్ తరఫున వీరేంద్ర సింగ్ బరిలో ఉన్నారు. ఆయనపై ఏకంగా భార్య రీటా పోటీ చేస్తున్నారు. జన్ నాయక్ జనతా పార్టీ తరఫున ఆమె బరిలో ఉన్నారు. వీరేంద్ర తండ్రి నారాయణ్ సింగ్ కాంగ్రెస్ అగ్ర నేత కావడం విశేషం. 2018లో ఆయన రాజకీయాల నుంచి తప్పుకున్నారు. కుమారుడికి టికెట్ ఇప్పించి గెలిపించుకున్నారు. అయితే వీరేంద్రకు కొంతకాలంగా భార్యతో గొడవలు ముదురుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏడాదిగా వారు విడిగా ఉంటున్నారు. ఎన్నికలు సమీపించగానే రీటా ఏకంగా భర్తపైనే బరిలో దిగారు!



**ధోల్‌పూర్: గోదాలో బావా మరదళ్లు**

ఇక్కడ బీజేపీ తరఫున శివచరణ్ కుష్వాహా పోటీ చేస్తున్నారు. అయితే కాంగ్రెస్ ఏకంగా ఆయన మరదలు శోభారాణికి టికెటిచ్చి బరిలో దించింది.

**అళ్వార్ (గ్రామీణ): తండ్రీ కూతుళ్ల సవాల్**

ఇక్కడ బీజేపీ జయరామ్ జాటవ్‌కు టికెచ్చింది. ఆయనతో విభేదాల నేపథ్యంలో కుమార్తె మీనాకుమారి ఏకంగా ఇండిపెండెంట్‌గా బరిలో దిగి తండ్రినే సవాలు చేస్తున్నారు! ఇద్దరు పరస్పరం జోరుగా విమర్శల వర్షం కురిపించుకుంటూ ఓటర్లకు యథా శక్తి వినోదం పంచుతున్నారు.

**నా కుమారుడికి ఓటు వేయొద్దు!**

ఖండార్ అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ తరఫున అశోక్ బైర్వా బరిలో ఉన్నారు. తండ్రి డాల్‌చంద్‌తో ఆయనకు చాలాకాలంగా వివాదాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'నా కొడుక్కు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటేయకండి' అంటూ డాల్‌చంద్ జోరుగా ప్రచారం చేస్తుండటం విశేషం. దాంతో ఏమీ చేయలేక అశోక్ తలపట్టుకుంటున్నారు.

**బాబాయ్–అబ్బాయ్–అమ్మాయ్**

భాద్రా అసెంబ్లీ స్థానంలో బీజేపీ నుంచి సంజీవ్ బెనీవాల్ పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ తరఫున ఆయన అన్న కుమారుడు అజిత్ బెనీవాల్ బరిలో దిగి బాబాయ్‌ని సవాలు చేస్తున్నారు. ఖేత్రీ అసెంబ్లీ స్థానంలోనూ ఇదే పరిస్థితి. ఇక్కడ కాంగ్రెస్ నుంచి మనీషా గుజ్జర్ పోటీలో ఉన్నారు. బీజేపీ తరఫున ఆమె బాబాయ్ ధర్మపాల్ బరిలో దిగారు. నాగౌర్‌లో బీజేపీ నుంచి జ్యోతీ మీర్ధా పోటీ చేస్తుంటే కాంగ్రెస్ తరఫున ఆమెకు బాబాయ్ వరసయ్యే హరేంద్ర మీర్ధా బరిలో ఉన్నారు. సోజత్ అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ నుంచి పీసీసీ ప్రధాన కార్యదర్శి నిరంజన్ ఆర్య బరిలో ఉన్నారు. బీజేపీ తరఫున ఆయన దగ్గరి బంధువు శోభా చౌహాన్ పోటీలో దిగారు.

**ఐఏఎస్ వర్సెస్ ఐపీఎస్**

బస్సీ అసెంబ్లీ స్థానంలో మరో రకం పోటీ నెలకొంది. మాజీ ఐఏఎస్ చంద్రమోహన్ మీనా బీజేపీ నుంచి పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ తరఫున ఆయనపై పోటీ చేస్తున్న లక్ష్మణ్ మీనా మాజీ ఐపీఎస్ అధికారి కావడం విశేషం. పైగా వీరిద్దరూ బంధువులే.

**రెండు పార్టీలకూ ప్రచారం**

జాట్ సామాజిక వర్గంలో బాగా పట్టున్న ప్రముఖ నేత రిచ్‌పాల్ మీర్ధాది మరో తరహా కథ. డెగానా స్థానంలో కాంగ్రెస్ టికెట్‌పై పోటీలో ఉన్న తన కుమారుడు విజయ్‌పాల్‌కు ఓటేయాల్సిందిగా ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు. మరోవైపు నగౌర్ అసెంబ్లీ స్థానంలో బీజేపీ టికెట్‌పై బరిలో దిగిన తమ్ముడి కూతురు జ్యోతీ మీర్ధా తరఫున స్వయంగా బరిలో దిగి ప్రచారం చేస్తున్నారు!

సాక్షి ఫ్యామిలీ
శుక్రవారం॥ 10-11-2023

ఫ్యాషన్




పట్టుబట్టలతోనే కాదు మనవైన సంప్రదాయ దుస్తులతోనూ వెలిగిపోవచ్చు.
మోడ్రన్ షేర్వాణీలను ధోతీ ప్యాంట్లతో మ్యాచ్ చేయచ్చు.
పర్యావరణ అనుకూలమైన డ్రెస్సులను ఎంచుకోవచ్చు.
పాత కాలం నాటి ప్రింట్లు, హ్యాండ్‌మేడ్ డిజైన్స్‌కి ప్రాధాన్యం ఇవ్వచ్చు.
ఎవర్‌గ్రీన్ లుక్‌తో రాబోయే రోజులను
ప్రకాశవంతంగా మార్చడానికి ఈ దీపావళి నుంచే మొదలుపెట్టవచ్చు.
పండగ రోజున దీపాలనే కాదు
సరికొత్త ట్రెండ్‌తో వార్డ్ రోబ్‌లను కూడా వెలిగించవచ్చు.
ప్రతి వేడుకలోనూ మెరిసిపోవచ్చు.

# వార్డ్ రోబ్‌లకూ వెలుగులు



## నియో–సంప్రదాయం

పాతకాలం నాటి కుర్తాలు, షేర్వాణీలు ఇప్పుడు కొత్తగా రూపాంతరం చెందాయి. ఈ దీపావళికి ఇవి ఎంతో అందంగా ఉంటాయి. అలాగే, లేయర్డ్ షేర్వాణీలు, ధోతీ ప్యాంట్‌లను ధరించవచ్చు. వీటిని మోడర్న్ డిజైన్, ఓల్డ్ ట్రెడిషన్‌తో మిళితం చేయచ్చు. ఈ మిక్స్ అండ్ మ్యాచ్ వల్ల సొగసైన రూపాన్ని పొందవచ్చు. ఇక నియాన్ కలర్స్ ఇప్పుడు ట్రెండ్‌లో ఉన్నాయి. వీటిలో బ్లూ, రెడ్, గ్రీన్, ఎల్లో కలర్స్ చాలా ప్రకాశవంతంగా ఉంటాయి. ఇవి సాధారణ రంగుల నుండి కాంతివంతంగా కనిపిస్తాయి.

## పర్యావరణ అనుకూలం

సరైన అవగాహనతో ఫ్యాషన్ పర్యావరణ అనుకూల బట్టల వైపు మొగ్గు చూపుతోంది. సేంద్రియ పత్తి, వెదురు, జనపనార బట్టలు స్థిరంగా ఉండటమే కాకుండా మట్టి సొబగులను కూడా వెదజల్లుతాయి. సురయ్యా, ఇతర ప్రముఖ బ్రాండ్‌లు ఈ ట్రెండ్‌లో ముందంజలో ఉన్నాయి.



## పేస్టల్స్ పెరుగుదల

దీపావళి ప్రకాశవంతమైన రంగులకు పర్యాయపదంగా ఉన్నప్పటికీ, లావెండర్, మింట్, బేబీ పింక్ పేస్టెల్ కలర్స్ పండుగ కళను పెంచుతాయి. ఈ రంగులు ప్రశాంతతతోపాటు రిచ్‌నెస్‌ను కళ్లకు కడతాయి.

## డిజిటల్ ప్రింట్లు సాంప్రదాయ మూలాంశాలు

సాంకేతికత మన జీవితంలోని ప్రతి రంగాన్నీ ప్రభావితం చేస్తున్నప్పుడు ఫ్యాషన్‌ను మాత్రం ఎందుకు వదిలివేయాలి... అందుకే, లోటస్ లేదా పీకాక్ ఫెదర్స్‌తో కూడిన భారతీయ సంప్రదాయ మూలాంశాలను ప్రదర్శించే డిజిటల్ ప్రింట్లు గొప్పగా కనిపిస్తున్నాయి. ఈ ప్రింట్లు, డిజైన్లు సంప్రదాయానికి ఆధునిక టచ్‌ను అందిస్తున్నాయి.

## పాతకాలపు డిజైన్ల పునరుద్ధరణ

బనారసీ సిల్క్స్, చికంకారి ఎంబ్రాయిడరీ, బంధని వంటి పాతకాలపు వస్త్రాల ఆకర్షణ మళ్లీ మళ్లీ ఆకట్టుకుంటుంది. డిజైనర్లు ఈ సంప్రదాయ వస్త్రాలను ఆధునిక దుస్తులలో డిజైన్ చేస్తున్నారు. మనదైన గొప్ప వారసత్వాన్ని దేశీయ కళాకారులు కాపాడుతున్నారు.

## చేతితో తయారు చేసిన పాదరక్షలు

పాదరక్షల్లో మన దేశీయ హస్తకళా నైపుణ్యం తనదైన ముద్ర వేస్తోంది. జూతీలు, కొల్హాపురీ, ఎంబ్రాయిడరీ ఇతర అలంకారాలతో చేతితో తయారు చేసిన పాదరక్షలలో దేనిని ఎంపిక చేసుకున్నా పండగ కళ కనిపిస్తుంది. ఇవి కళాకారుల నైపుణ్యానికి నిదర్శనంగా ఉండటమే కాకుండా, వేడుకలో ప్రత్యేకమైన టచ్‌ను అందిస్తాయి.





సమాజానికి మంచి ఆహారాన్నివ్వాలనుకుంది. ఖాద్యమ్... పేరుతో తినదగిన ఆహారాన్నిస్తోంది. 'వరల్డ్ ఫుడ్ ఇండియా'లోనూ నిరూపించుకుంది. దేశ రక్షణ కోసం కొండల్లో గుట్టల్లో డ్యూటీ చేసే సైన్యానికి మంచి ఆహారాన్నిచ్చే బాధ్యత చేపట్టింది. ఈ సందర్భంగా కట్టెకోల మాధవి విజయగాథ.

# జై జవాన్‌కు టిఫిన్ బాక్స్

రక్షణరంగంలో విధులు నిర్వర్తించే వారి ఆహారం ఎలా ఉండాలో నిర్దేశించడానికి డీఎఫ్ఆర్ఎల్‌లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం పని చేస్తూ ఉంటుంది. ఆ ప్రమాణాల మేరకు ఆహారం తయారు చేయడానికి అనుమతి సాధించారు ఓ తెలుగు మహిళ. ఈ అనుమతి సాధించడానికి ముందు ఆమె ఆహారం మీద అంతులేని పరిశోధన చేశారు. భూమిలో నాటే గింజ నుంచి పంట దిగుబడి, దినుసులను ప్రాసెస్ చేయడం, వండి చల్లార్చి డబ్బాల్లో ప్యాక్ చేయడం వరకు ప్రతిదీ ఒక చేతి మీదుగా నడిచినప్పుడే నిర్దేశించిన ప్రమాణాలను పాటించగలమని నమ్ముతారామె. సేంద్రియ పంట, వంటను ఈ నెల న్యూఢిల్లీలో జరిగిన 'వరల్డ్ ఫుడ్ ఇండియా' సదస్సులో ప్రదర్శించి మరోసారి నిరూపించారు. ఈ సందర్భంగా సాక్షితో తన అనుభవాలను పంచుకున్నారు హైదరాబాద్‌లో నివసిస్తున్న కట్టెకోల మాధవి.

**రైతులు విచిత్రంగా చూశారు!**

మాది సూర్యాపేట. నాన్న ఉద్యోగ రీత్యా నా చదువు మొత్తం హైదరాబాద్‌లోనే. నిజానికి నా చదువుకి, నేనెంచుకున్న ఈ రంగానికి సంబంధమే లేదు. బీఎస్సీ స్టాటిస్టిక్స్ చేసి కొంత కాలం టీచర్‌గా, ఆ తర్వాత బ్యాంకులో ఉద్యోగం చేశాను. మా వారు మైక్రో బయాలజీ చేసి హిమాలయ సంస్థలో ఉద్యోగం చేశారు. నెలలో ఇరవై రోజులు క్యాంపుల ఉద్యోగం ఆయనది. జీవితం ఇది కాదనిపించేది. మన జ్ఞానాన్ని సరిగ్గా ఒకదారిలో పెడితే గొప్ప లక్ష్యాలను సాధించవచ్చనిపించింది. సొంతంగా ఏదో ఒకటి చేయాలనే నిర్ణయానికి 2009లో వచ్చాం. నాలుగేళ్లపాటు సమాజం అవసరాలేమిటి, అందుబాటులో ఉన్న వనరులేమిటి అని అధ్యయనం చేశాం. సమాజంలో ఆరోగ్యకరమైన ఆహారం తప్ప అన్నీ ఉన్నాయని తెలిసింది. మేము 2014లో గ్రామాలకు వెళ్లి రైతులతో కొర్రలు పండిస్తారా అని అడిగినప్పుడు మమ్మల్ని వెర్రివాళ్లను చూసినట్లు చూశారు. కుగ్రామాలకు వెళ్లి మహిళలకు మా ఉద్దేశాన్ని వివరించాం. విత్తనాల నుంచి పంటకు అవసరమైన ఇన్‌పుట్స్ అన్నీ మేమే ఇస్తాం, మీరు పండించిన పంటను మేమే కొంటాం... అని భరోసా ఇచ్చాం. దాంతోపాటు వారు పండించే కంది పంట మధ్య చాళ్లలో చిరుధాన్యాలను పండించమని సూచించాం. ఒక కందిపంట సమయంలో చిరుధాన్యాలు మూడు పంటలు వస్తాయి. తమకు నష్టం ఏమీ ఉండదనే నమ్మకంతోపాటు మామీద విశ్వాసం కలిగిన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, రాజస్థాన్, సిక్కిం రాష్ట్రాల్లో మొత్తం 1350 మంది మహిళారైతులు మాతో కలిశారు. గ్రౌండ్ వర్క్ చేసిన తర్వాత 2018లో కంపెనీ ఖాద్యమ్‌ని రిజిస్టర్ చేశాం. ఖాద్యమ్ అనే సంస్కృత పదానికి అర్థం తినదగినది అని. పంట నుంచి మా ప్రయోగాలు వంటకు విస్తరించాయి.

**వండి చల్లబరుస్తాం!**

ఇడ్లీ, సాంబార్, చట్నీ వంటి ఆహార పదార్థాలు యంత్రాల్లోనే తయారవుతాయి. ఉడికిన వెంటనే మైనస్ నలభై డిగ్రీల ఉష్ణోగ్రతకు తీసుకువెళ్లడంతో వాటిలో ఉండే తేమ హరించుకుపోతుంది. ఇలా తయారైన ఆహారం ప్యాకెట్లలో తొమ్మిది నెలల పాటు నిల్వ ఉంటుంది. వేడినీటిలో ముంచితే ఐదు నిమిషాల్లో ఇడ్లీ మెత్తగా మారుతుంది, సాంబార్, చట్నీలు కూడా అంతే. మేము కనుగొన్న విజయవంతమైన ఫార్ములా ఇది. పోహా నుంచి స్పగెట్టీ, పాస్తా వరకు ఒక ఇంట్లో అన్ని తరాల వారూ ఇష్టపడే రుచులన్నింటినీ ఇలాగే చేస్తున్నాం. మొదట్లో రెడీ టూ కుక్ ఉత్పత్తుల మీద దృష్టి పెట్టాం. రోజూ వండి బాక్సు పట్టుకెళ్లడం కుదరని రోజుల్లో రెడీ టూ ఈట్ విధానాన్ని అనుసరించాం. ఆఫీస్‌కి టిఫిన్ బాక్స్ తేలిగ్గా తీసుకెళ్లడానికి, ప్రయాణాల్లో తీసుకెళ్లడానికి మా ఉత్పత్తులు చాలా అనువుగా ఉంటాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే సైన్యం అవసరాలకు తగినట్లు ఆహారాన్ని తయారు చేయడం పెద్ద సవాల్ అనే చెప్పాలి. మైసూర్‌లో ఉన్న డీఎఫ్ఆర్ఎల్‌కి ఎన్నిసార్లు వెళ్లామో లెక్క పెట్టలేం. యాభైసార్లకు పైగా వెళ్లి ఉంటాం. విమాన టిక్కెట్ల ఖర్చే లక్షల్లో వచ్చింది. సైంటిస్టులు సూచించిన నియమావళి ప్రకారం తయారు చేయడం, శాంపుల్ తీసుకెళ్లి చూపించడం, వాళ్లు చెప్పిన సవరణలను రాసుకుని హైదరాబాద్ రావడం, మేడ్చల్ దగ్గర బండ మాదారంలో ఉన్న మా యూనిట్‌లో తయారు చేసి మళ్లీ పట్టుకెళ్లడం... ఇలా సాగింది. మా ప్రయోగాల గురించిన ప్రతి వివరాన్నీ నోట్స్ సమర్పించాం. జీవితంలో ఓ గొప్ప లక్ష్యాన్ని సాధించాలనుకున్నాం, ఆ ప్రయాణంలో మేము లక్ష్యాన్ని చేరేలోపు ఉద్యోగంలో సంపాదించుకున్న డబ్బు రెండు కోట్లకు పైగా ఖర్చయిపోయింది. ఏ దశలోనూ వెనుకడుగు వేయకుండా దీక్షగా ముందుకెళ్లడమే ఈ రోజు విజేతగా నిలిపింది. ఏ- ఐడియా వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ఆర్థికంగానూ, మౌలిక వసతుల కల్పనలోనూ సహకరిస్తున్నాయి. మా ఉత్పత్తులు ఈ-కామర్స్ వేదికల మీద పన్నెండు దేశాలకు చేరుతున్నాయి. ఢిల్లీలో ఈ నెల మూడు నుంచి ఐదు వరకు 'వరల్డ్ ఫుడ్ ఇండియా' సదస్సు జరిగింది. అందులో స్టాల్ పెట్టమని ప్రభుత్వం నుంచి ఆహ్వానం రావడమే ఈ ప్రయత్నంలో మేము గెలిచామని చెప్పడానికి ఉదాహరణ'' అని వివరించారు ఖాద్యమ్ కో ఫౌండర్ మాధవి.

వరల్డ్ ఫుడ్ ఇండియా సదస్సులో...



డీఎఫ్ఆర్ఎల్... డిఫెన్స్ ఫుడ్ రీసెర్చ్ లాబొరేటరీ. కర్నాటక రాష్ట్రం మైసూర్‌లో ఉన్న ఈ సంస్థ డీఆర్‌డీవో (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్)లో ఒక విభాగం. రక్షణ రంగంలో విధులు నిర్వర్తించే వారికి నిల్వ ఉండే ఆహారాన్ని సరఫరా చేస్తుంది. పర్వత ప్రాంతాలు, లోయలు, గడ్డకట్టే మంచులో ఉండే ఆర్మీ క్యాంపుల్లో విధులు నిర్వర్తించేవారికి తాజా ఆహారాన్ని అందించడం కొన్ని సందర్భాల్లో సాధ్యం కాదు. అలాంటి సమయాల్లో వారి ఆకలి తీర్చేది... ముందుగానే వండి, శీతలపరిచి డబ్బాల్లో నిల్వ చేసిన ఆహారమే. అలా నిల్వ చేసే ఆహారాన్ని తయారు చేయడం అత్యంత క్లిష్టమైన పని. ఆహారం నెలల కొద్దీ నిల్వ ఉండాలి. అందులో పోషకాలు లోపించకూడదు.

– వాకా మంజులారెడ్డి
ఫొటో : నోముల రాజేశ్ రెడ్డి

వంటిల్లు

# వెచ్చటి వెలుగుల్లో తియ్యటి ఘుమఘుమలు

ఇల్లంతా దీపాల సందడి, టపాసుల వెలుగుల్లో చిన్నాపెద్దల చిరునవ్వులతో ఒకటే హడావుడి. స్వీట్లు చేయడానికి ఓపిక, సమయం రెండూ ఉండవు. అయినా పండగపూట మనింట్లో తయారైన తీపి రుచే వేరు. అందుకే సులభంగా చేసుకోదగిన తీపి ఘుమఘుమలతో వచ్చేసింది మనందరి వంటిల్లు....


## గుడ్ పారే



**కావలసినవి:**
మైదా – రెండు కప్పులు; నెయ్యి – పావు కప్పు; పాలు – అరకప్పు; బెల్లం – కప్పు; శొంఠి పొడి – టీస్పూను; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

**తయారీ:** మైదాపిండిలో నెయ్యివేసి కలపాలి ● తరువాత గోరువెచ్చని పాలుపోసి ముద్దలా కలిపి ఇరవై నిమిషాలు పక్కన పెట్టుకోవాలి ● ఇరవై నిమిషాల తరువాత పిండిముద్దను రెండు భాగాలు చేయాలి ● ఒక్కో భాగాన్నీ మందపాటి చపాతీలా వత్తుకుని అంగుళం పరిమాణంలో ముక్కలు చేయాలి ● మిగతాపిండిని కూడా ఇదే విధంగా చేయాలి ● ఇప్పుడు సలసల కాగుతోన్న నూనెలో ఈ ముక్కలను వేసి మీడియం మంట మీద వేయించాలి. రెండువైపులా గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారితే పారేలు రెడీ అయినట్లే, వెంటనే తీసేయాలి ● బెల్లాన్ని గిన్నెలో వేసి పావుకప్పు నీళ్లుపోసి స్టవ్ మీద పెట్టాలి. మీడియం మంట మీద బెల్లం కరిగి సిరప్‌లా తయారయ్యేంతవరకు మరిగించాలి ● అడుగు అంటకుండా తిప్పుతూనే ఉండాలి. సిరప్ తయారైన తరువాత శొంఠి పొడివేసి కలిపి దించేయాలి ● వేయించి పెట్టుకున్న పారేలను సిరప్‌లో వేసి కలుపుతూనే ఉండాలి. ఇలా కలుపుతూ ఉండగానే మిశ్రమం మొత్తం చల్లబడి గుడ్ పారేలు అతుక్కోకుండా విడివిడిగా వస్తాయి. ఇప్పుడు తీసి ప్లేటులో వేసి సర్వ్‌చేసుకోవాలి ● గాలి చొరబడని డబ్బాలో వేసి ఉంచితే నెలరోజులపాటు నిల్వ ఉంటాయి.

## కాజు పిస్తా రోల్స్



**కావలసినవి:** జీడిపప్పు – ఒకటిన్నర కప్పులు; పిస్తా పప్పు – ఒకటిన్నర కప్పులు; కండెన్స్‌డ్ మిల్క్ – ఒకటింబావు కప్పులు; గ్రీన్ ఫుడ్ కలర్ – ఐదు చుక్కలు; బటర్ – రెండు టేబుల్ స్పూన్లు; పంచదార పొడి – కప్పు; యాలకులపొడి – పావు టీస్పూను;

**తయారీ:** జీడిపప్పును దోరగా వేయించి, మెత్తగా గ్రైండ్ చేయాలి. ● గ్రైండ్ అయిన తరువాత జల్లెడపట్టి పొడిని తీసుకోవాలి. ●బాణలిలో వెన్న వేసి వేడెక్కనివ్వాలి. కరిగిన బటర్‌లో కండెన్స్‌డ్ మిల్క్ పోయాలి. ● నిమిషం పాటు పాలను కలుపుతూ ఉండాలి. తరువాత జీడిపప్పు పొడి వేయాలి. ● సన్నని మంటమీద తిప్పుతూ ఐదునిమిషాలు వేయించాలి. తరువాత దించేసి చల్లారనివ్వాలి. ●చేతులకు కొద్దిగా నెయ్యి రాసుకుని జీడిపప్పు మిశ్రమాన్ని ముద్దలా కలిపి పెట్టుకోవాలి. ● ఇప్పుడు పిస్తాపప్పుని దోరగా వేయించి మెత్తగా గ్రైండ్ చేయాలి. ● గ్రైండ్ చేసిన మిశ్రమాన్ని జల్లెడపట్టి మెత్తటి పొడిని తీసుకోవాలి. ● పిస్తా పొడిలో పంచదార పొడి, యాలకుల పొడి, ఫుడ్ కలర్ కొద్దిగా వేడి నీళ్లు చల్లుకుంటూ ముద్దలా కలపాలి. ● ఇప్పుడు జీడిపప్పు ముద్దను రెండు ముద్దలుగా చేసి, ఒక్కో ముద్దను మందపాటి చపాతీలా వత్తుకుని, కాస్త వెడల్పుగా ఉండేలా ముక్కలు కోయాలి. ● పిస్తా ముద్దను చిన్న ఉండలుగా చేసి, వీటిని పొడవాటి రోల్స్‌లా చుట్టుకోవాలి. ● జీడిపప్పు ముక్కపైన పిస్తా రోల్‌ను పెట్టి, జీడిపప్పు ముక్కను రోల్ చేయాలి. ● పిండి ముద్దను మొత్తాన్ని ఇలా రోల్ చేసి, పైన కుంకుమ పువ్వు, సిల్వర్ పేపర్‌తో గార్నిష్ చేస్తే కాజుపిస్తా రోల్స్ రెడీ.

## షీర్ పీరా

**కావలసినవి:** పంచదార – కప్పు; పాలపొడి – రెండు కప్పులు; బాదం పలుకులు – టేబుల్ స్పూను; జీడిపప్పు పలుకులు – టేబుల్ స్పూను; పిస్తా పలుకులు – టేబుల్ స్పూను; కిస్‌మిస్ – టేబుల్ స్పూను; యాలకులు – నాలుగు; నెయ్యి – టేబుల్ స్పూను; గార్నిష్ కోసం.... పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులు – టేబుల్ స్పూను (పెద్దసైజువి).

**తయారీ:** డ్రైఫ్రూట్స్ పలుకులు సన్నగా పొడవుగా ఉండేలా తీసుకోవాలి ● మందపాటి బాణలిలో పంచదార, కప్పు నీళ్లుపోసి మంటమీద పెట్టాలి ● తీగపాకం వచ్చేంత వరకు మరిగించాలి ● తీగపాకం వచ్చినప్పుడు సన్నమంటమీద ఉంచాలి ● ఇప్పుడు పాలపొడిని కొద్దికొద్దిగా వేస్తూ ఉండలు లేకుండా కలుపుతూ ఉండాలి ● పాలపొడి దగ్గర పడేంత వరకు కలుపుతూనే ఉండాలి ● దగ్గర పడుతున్నప్పుడు బాదం, జీడిపప్పు, పిస్తా పలుకులు, కిస్‌మిస్ ముక్కలను వేసి కలపాలి ● చివరిగా యాలకులను పొడిచేసి వేయాలి ● ప్లేటుకును నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని వేయాలి ● ప్లేటంతా సమంగా పరుచుకుని పైన కొద్దిగా పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులు చల్లాలి ● స్పూను పెట్టి పైన కూడా సమంగా వత్తుకుని ప్లేటుని రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● రెండు గంటల తరువాత నచ్చిన ఆకారంలో ముక్కలు కట్‌చేసి సర్వ్ చేసుకోవాలి.



## చిరోటీ



**కావలసినవి:** మైదా – ఒకటింబావు కప్పులు; సూజీ రవ్వ – కప్పు; నెయ్యి – రెండు టేబుల్ స్పూన్లు; ఉప్పు – చిటికెడు; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా; పంచదార – అరకప్పు; యాలకులు – మూడు; పిస్తా తురుము గార్నిష్‌కు సరిపడా.

**పేస్టుకోసం:** బియ్యప్పిండి – రెండు టేబుల్ స్పూన్లు; నెయ్యి – మూడు టేబుల్ స్పూన్లు.

**తయారీ:** కప్పు మైదా, సూజీరవ్వ, ఉప్పుని ఒక గిన్నెలో వేసి కలిపి పెట్టుకోవాలి ● బాణలిలో నెయ్యి వేసి వేడెక్కనివ్వాలి. కాగిన నెయ్యిలో కలిపి పెట్టుకున్న మైదా మిశ్రమాన్ని వేసి వేయించాలి. ● రెండు నిమిషాల తరువాత నీళ్లు చల్లుకుంటూ పూరీ పిండిలా కలుపుకోవాలి. ● పిండి ముద్ద తయారయ్యాక దానిపై తడిబట్టని కప్పి రెండుగంటలు పక్కన పెట్టుకోవాలి. ● ఇప్పుడు పంచదార, యాలకులను మిక్సీజార్‌లో వేసి మెత్తగా పొడిచేయాలి. ● కరిగించిన నెయ్యిని బియ్యప్పిండిలో వేసి, పేస్టులా కలిపి పెట్టుకోవాలి. ● రెండు గంటల తరువాత పిండి ముద్దను మరోసారి బాగా కలిపి దానిని చిన్నచిన్న ఉండలుగా చేయాలి. ● ఒక్కో ఉండను చపాతీలా వత్తుకోవాలి. ● మూడు చపాతీలు చేసిన తరువాత... ఒకదాని మీద ఒకటి పెట్టి పై చపాతీపైన టీస్పూను బియ్యప్పిండి పేస్టుని రాయాలి. తరువాత కొద్దిగా మైదాను చల్లాలి. ● ఇప్పుడు చపాతీని మడతలు వేయాలి. ఒక్కో మడతకు టీ స్పూను బియ్యప్పిండి పేస్టు, కొద్దిగా మైదాను చల్లుకుంటూ చపాతీ మొత్తాన్ని మడత వేయాలి. ● పూర్తయ్యాక చపాతీ రోల్స్‌ను అంగుళం ముక్కలుగా కట్ చేయాలి ● ఒక్కోముక్కను గుండ్రంగా చేసి పూరీలా వత్తుకోవాలి ● మరీ పలుచగా లేదా మరీ మందంగా కాకుండా ఒక మాదిరిగా వత్తుకుని మధ్యలో చిన్న రంధ్రం చేయాలి ● ఇప్పుడు ఈ చపాతీలను సలసల కాగుతోన్న నూనెలో వేసి మీడియం మంట మీద లేత బంగారు వర్ణంలోకి మారేంత వరకు వేయిస్తే చిరోటీ రెడీ ● చిరోటీలను ఒకదానిమీద ఒకటి పేర్చి, పైన పంచదార పొడి, పిస్తా తురుము చల్లి సర్వ్ చేసుకోవాలి.

● సక్సెస్ స్టోరీ


కిషన్ బగారియా

కిషన్‌ని చూసినప్పుడు చాలామందికి అమెరికన్ ఇన్వెంటర్, ఇంజనీర్ చార్లెస్ కెటరింగ్ ఒకప్పుడు చెప్పిన మాట తప్పకుండా గుర్తుకు వస్తుంది.

'ఇన్వెంటర్ అంటే చదువును మరీ సీరియస్‌గా తీసుకోని వ్యక్తి' అంటాడు చార్లెస్ కెటరింగ్. అతడు నవ్వులాటకు అన్నాడో, సీరియస్‌గా అన్నాడో తెలియదుగానీ అస్సాంకు చెందిన కిషన్ చదువును సీరియస్‌గా తీసుకోలేదు. లక్ష్యాన్ని మాత్రం సీరియస్‌గా తీసుకున్నాడు.

లక్ష్యం ఉన్న చోట క్రమశిక్షణ, అంకితభావం ఉంటాయి. విజయానికి దారిచూపుతాయి. కిషన్ విషయంలోనూ ఇది నిజమైంది.

ఒకప్పుడు 'కిషన్ బగారియా' అంటే పక్క గ్రామం వాళ్లకు కూడా తెలియదు.

ఇప్పుడు అస్సాం మొత్తం సుపరిచితమైన పేరు....కిషన్ బగారియా.

26 సంవత్సరాల కిషన్ బగారియా సృష్టించిన ఆల్–ఇన్–వన్ యాప్ 'టెక్స్.కామ్'ను అమెరికాకు చెందిన టెక్ కంపెనీ 'ఆటోమేటిక్ ఇంక్' రూ. 416 కోట్లకు కొనుగోలు చేసింది...

# చెఫ్ కాదు టెక్ జీనియస్

అస్సాంలోని దిబ్రుగఢ్‌లో ఎనిమిది, అగ్రేసేన్ అకాడమీలో తొమ్మిది, పదో క్లాస్ చదివాడు కిషన్. ఇంటర్నెట్ అతడి ప్రపంచంగా ఉండేది. రోజూ ఏదో ఒక కొత్త విషయం గురించి తెలుసుకోవడమో, నేర్చుకోవడమో చేసేవాడు. పన్నెండు సంవత్సరాల వయసులోనే యాప్స్ తయారీపై ఆసక్తి చూపించడం మొదలు పెట్టాడు. తన వినోదం కోసం చిన్న చిన్న యాప్స్ తయారుచేసేవాడు.

'వీడికి ఇంటర్నెట్ అందుబాటులో ఉంటే ప్రపంచంతో పనిలేదు' అని నవ్వుతూ ఇతరులతో చెప్పేవాడు తండ్రి మహేంద్ర బగారియా.

'ఎప్పుడు చూసినా కంప్యూటర్‌లో మునిగిపోయి కనిపిస్తావు. భవిష్యత్‌లో ఓ మంచి ఉద్యోగం చేయాలనే లక్ష్యం లేదా?' అని ఒక సందర్భంలో బంధువు ఒకరు కిషన్‌ను అడిగాడు.

'ఉద్యోగం చేయాలని లేదు. లక్ష్యం మాత్రం ఉంది' అన్నాడు కిషన్.

'ఏమిటి అది?' అని ఆసక్తిగా అడిగాడు బంధువు.

'సొంతంగా కంపెనీ పెట్టాలనేది నా లక్ష్యం' గంభీరంగా అన్నాడు కిషన్.

బంధువుతో పాటు అక్కడ ఉన్న వాళ్లు అందరూ బిగ్గరగా నవ్వారు. అలా నవ్విన వాళ్లందరికీ కిషన్ ఇప్పుడు తప్పనిసరిగా గుర్తుకు వచ్చి ఉంటాడు.

మరో సందర్భంలో...

'పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లు ప్రవర్తించకు. పగటికలల ప్రపంచం నుంచి బయటికి వచ్చెయ్. సొంతంగా కంపెనీ అంటే మాటలనుకున్నావా?' అంటూ ఒకప్పుడు తనకు హైస్కూల్‌లో చదువు చెప్పిన టీచర్ మందలించాడు.



ఇప్పుడు ఆ గురువు గారికి కిషన్ తప్పనిసరిగా గుర్తుకు వచ్చి ఉంటాడు.

ఎవరినీ ఎప్పుడూ తక్కువ అంచనా వేయవద్దు!


'డీల్ ఫైనలైజ్ కావడానికి మూడు నెలల సమయం పట్టింది. డీల్ ఓకే అయిన సందర్భంలో తట్టుకోలేని సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాను. ఇది కలా నిజమా! అనుకుంటూ ఒత్తిడికి గురయ్యాను. ఈ స్థితి నుంచి బయటపడడానికి కాస్త సమయం పట్టింది' అంటాడు కిషన్. 'మరి నెక్స్ట్ ఏమిటి?' అనే ప్రశ్నకు కిషన్ ఇచ్చిన జవాబు... 'టెక్స్.కామ్‌పై మరింత పనిచేయాల్సి ఉంది. వర్క్ కంటిన్యూ అవుతుంది'

కిషన్ రూపొందించిన 'ఆల్–ఇన్–వన్' యాప్ ట్విట్టర్, వాట్సప్, ఐ మెసేజ్, సిగ్నల్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్... మొదలైన యాప్‌లను ఒకే డ్యాష్‌బోర్డ్‌లో అందుబాటులోకి తెస్తుంది. యూజర్ కమ్యూనికేషన్ ప్రక్రియను సులభతరం చేసే యాప్ ఇది.

## యువర్స్

● సంక్షిప్తమైన డిజిటల్ డేటాను వినసొంపైన సంగీతంగా రూపొందించే ఆల్గొరిథంను రూపొందించాయి టాంపెర యూనివర్శిటీ (ఫిన్‌లాండ్), ఈస్టర్న్ వాషింగ్టన్ యూనివర్శిటీ పరిశోధక బృందాలు ● కోళ్లు అద్దంలో తమను తాము గుర్తు పడతాయని చెబుతుంది జర్మనీలోని యూనివర్శిటీ ఆఫ్ బాన్ పరిశోధన ● బొద్దుగా, ముద్దుగా ఉండే జంతువుల బొమ్మలను ఎక్కువగా చూస్తే ఏకాగ్రత పెరుగుతుందని చెబుతుంది 'ఎన్విరాన్‌మెంటల్ రిసెర్చ్ అండ్ పబ్లిక్ హెల్త్' ఇంటర్నేషనల్ జనరల్‌లో ప్రచురితమైన పరిశోధన పత్రం.

అవును... ఇది నిజమే!



### అడోరిక్ 8 ఇన్ వన్ ఎలక్ట్రానిక్ క్లీనర్

బ్రాండ్: అడోరిక్; డైమెన్షన్స్: 15×5×5 సెం.మీ; బరువు: 200 గ్రా.; మౌంటింగ్ హార్డ్‌వేర్: క్లీనింగ్ కిట్;
● ఎయిర్‌పాడ్ క్లీనింగ్ కిట్ ● ల్యాప్‌టాప్ క్లీనింగ్ కిట్
● స్క్రీన్ డస్ట్ బ్రష్ ● స్ప్రే బాటిల్



● టెక్.. టాక్

### రెడ్‌మీ ప్యాడ్

స్క్రీన్ సైజ్: 10.61 అంగుళాలు
డిస్‌ప్లే: 2000×1200;
మెమోరీ: 128జీబీ;
రిఫ్రెష్ రేట్: 90 హెచ్‌జడ్;
బ్యాటరీ: 8000 ఎంఏహెచ్;
ఓఎస్: ఆండ్రాయిడ్; స్పెషల్ ఫీచర్: ఎక్స్‌పాండబుల్ స్టోరేజ్




### యూట్యూబ్‌లో ఏఐ పవర్డ్ ఫీచర్స్

యూట్యూబ్ కొత్త జెనరేటివ్ ఏఐ పవర్డ్ ఫీచర్స్‌ను పరీక్షిస్తుంది. టాపిక్స్ ఆధారంగా ఈ ఏఐ ఫీచర్‌లు కామెంట్స్‌ను సమరైజ్ చేయడానికి, క్యాటగిరైజ్ చేయడానికి ఉపకరిస్తాయి. కన్వర్‌సేషనల్ టూల్ మనం చూస్తున్న వీడియోకి సంబంధించిన సందేహాలకు సమాధానం చెబుతుంది. కంటెంట్‌కు సంబంధించి మరిన్ని వివరాలు తెలుసుకోవాలనుకునే వారికి ఇది ఉపయోగపడుతుంది. ఈ సమయంలో వీడియోప్లేబ్యాక్‌కు అంతరాయం కలగదు. కామెంట్స్ ఆధారంగా వేగంగా, సులభంగా కొత్త కంటెంట్ క్రియేట్ చేయడానికి క్రియేటర్‌లకు కామెంట్ సమరైజ్ ఫీచర్ ఉపయోగపడుతుంది. ఒక టాపిక్‌కు సంబంధించి వర్గీకరించిన వ్యక్తిగత కామెంట్స్‌ను క్రియేటర్‌లు డిలిట్ చేయడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది.




### గూగుల్ స్కాన్ టెక్స్ట్

జీ బోర్డ్ (ఆండ్రాయిడ్) కోసం గూగుల్ 'స్కాన్ టెక్స్ట్' ఫీచర్‌ని రూపొందించే పనిలో ఉంది. లెన్స్ యాప్ ఇమేజ్‌ల నుంచి టెక్స్ట్ రెకగ్నైజ్ చేసినట్లే ఈ కొత్త ఫీచర్ 'ఆప్టికల్ క్యారెక్టర్ రెకగ్నైజ్'తో ఫోన్ కెమెరాలోని ఫొటోల నుంచి టెక్స్ట్‌ను ఎక్స్‌ట్రాక్ట్ చేస్తుంది. యూజర్‌లు తాము కోరుకున్న చోట పేస్ట్ చేయవచ్చు. గత కొన్ని నెలలుగా గూగుల్ జీ బోర్డ్ కోసం కొత్త ఫీచర్‌లను తీసుకువచ్చింది. అందులో 'రీసైజ్ ఆప్షన్' ఒకటి. కీబోర్డ్ హైట్‌ను అడ్జస్ట్ చేసుకోవడానికి ఇది యూజర్‌లకు ఉపయోగపడుతుంది.



● గేమింగ్: నేడే విడుదల


### యుద్ధం పిలిచిన చోట



ఫస్ట్–పర్సన్ షూటర్ వీడియో గేమ్ కాల్ ఆఫ్ డ్యూటీ: మోడ్రన్ వార్‌ఫేర్ నేడు విడుదల అవుతుంది. గత గేమ్స్‌లాగే ఈ గేమ్‌లోనూ రియలిస్టిక్, మోడ్రన్ సెట్టింగ్‌లు కనువిందు చేస్తాయి. మల్టీ–నేషనల్ స్పెషల్ ఆపరేషన్స్ యూనిట్ టాస్క్ ఫోర్స్ ప్రత్యేక ఆకర్షణ. 'కాల్ ఆఫ్ డ్యూటీ' సిరీస్ గత గేమ్స్‌లో ఉన్న ఫీచర్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన ఫీచర్‌లు కూడా ఉంటాయి.

ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్
జానర్: ఫస్ట్–పర్సన్ షూటర్ మోడ్స్: సింగిల్–ప్లేయర్, మల్టీప్లేయర్

● ఇంగ్లిష్ ఇడియమ్స్




**ఎట్ ది డ్రాప్ ఆఫ్ ఏ హ్యాట్**

మనం ఏ పని చేయాలన్నా కాస్తో కూస్తో ఆలోచించి మరీ చేస్తాం. అలా కాకుండా అప్పటికప్పుడు తోచినట్లు చేసే సందర్భంలో వాడే మాట... ఎట్ ది డ్రాప్ ఆఫ్ ఏ హ్యాట్.

*ఉదా: హీ ఈజ్ రెడీ టు ఫైట్ ఎట్ ది డ్రాప్ ఆఫ్ ఏ హ్యాట్*

**వోల్ట్–ఫేస్**

నమ్ముకున్న అభిప్రాయం, సిద్ధాంతాలు, ప్లాన్ ఆఫ్ యాక్షన్‌లో అకస్మాత్తుగా మార్పు వచ్చే సందర్భంలో వాడే మాట...వోల్ట్–ఫేస్. *ఉదా: ఇన్ 1986 హీ మేడ్ ఏ వెరీ పబ్లిక్ అండ్ డ్రామటిక్ పొలిటికల్ వోల్ట్–ఫేస్ ఫ్రమ్ లెఫ్ట్ టు రైట్*

● మ్యూజిక్ వరల్డ్

### వరం లాంటి స్వరం

'వీరే ది వెడ్డింగ్' సినిమాతో బాలీవుడ్ సింగర్‌గా అరంగేట్రం చేసింది లీసా మిశ్రా. యూనిక్ వాయిస్‌తో ప్రేక్షకులను మెప్పించింది. తనకు ఇష్టమైన పాటలు పాడి సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లలో పోస్ట్ చేసే మిశ్రా చికాగోలో డాటా–ఎనలిస్ట్‌గా ఉద్యోగం చేసింది. సంగీతాన్నే కెరీర్ చేసుకోవడానికి అమెరికా నుంచి ముంబై వచ్చింది. రెండు సంవత్సరాల క్రితం ప్రఖ్యాత సింగర్ లేడీ గాగాతో కలిసి మ్యూజిక్ ప్రోగ్రామ్ చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో మిశ్రాకు ఎనిమిది లక్షల ఫాలోవర్స్ ఉన్నారు. తన యూట్యూబ్ చానల్‌కు మూడు లక్షలమంది సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు.

'మ్యూజిషియన్‌గా పేరు తెచ్చుకోవడానికి నాకు యూట్యూబ్ ఎంతో ఉపయోగపడింది. నా సంగీతం ప్రపంచ వ్యాప్తంగా చాలామందికి పరిచయం కావడానికి సోషల్ మీడియా ఉపయోగపడింది. కష్టాల్లో ఉన్నప్పుడు ఓదార్పులా, ఒత్తిడిని జయించే శక్తిలా నా సంగీతం ఉండాలనుకుంటాను. చాలామందికి మన విజయం తప్ప ఆ విజయం కోసం గతంలో పడిన కష్టం గురించి తెలియదు. దీంతో ఓవర్ నైట్ సక్సెస్ అంటుంటారు' అంటుంది సింగర్–సాంగ్ రైటర్ లీసా మిశ్రా.



## సినిమా

### గోవా టు హైదరాబాద్


● ఎన్టీఆర్

హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'దేవర'. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా, సైఫ్ అలీఖాన్ విలన్ రోల్ చేస్తున్నారు. ఇటీవల గోవాలో మొదలైన ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్ పూర్తయినట్లు తెలిసింది. ఈ షెడ్యూల్‌లో ఎన్టీఆర్, జాన్వీ.. ఇలా ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. అలాగే 'దేవర' నెక్స్ట్ షెడ్యూల్ డిసెంబరులో హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని సమాచారం. కల్యాణ్‌రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలోని తొలి భాగం 'దేవర పార్ట్ 1' ఏప్రిల్ 5న విడుదల కానుంది.

### ఆ కథలు నాకు ధైర్యాన్నిచ్చాయి – సమంత



''నా జీవితంలో విడాకులు, నా సినిమాలు వరుసగా పరాజయం చెందడం.. ఆరోగ్య సమస్యలు (మయోసైటిస్).. ఇలా అన్నీ ఒకేసారి చుట్టుముట్టడంతో ఎంతో కుంగిపోయాను'' అని సమంత అన్నారు. ఓ ఇంటర్వ్యూలో ఆమె ఈ విధంగా పేర్కొన్నారు. అదే ఇంటర్వ్యూలో సమంత ఇంకా మాట్లాడుతూ– ''జీవితంలో ఎవరికైనా ముఖ్యమైనది వివాహం. నా వైవాహిక జీవితం విఫలమైంది.. ఆరోగ్యం క్షీణించింది. అదే టైమ్‌లో నా సినిమాలూ ప్రేక్షకులను మెప్పించలేదు. ఈ సమస్యలతో సుమారు రెండేళ్లు జీవితంలో ఎంతో కుంగిపోయాను. అప్పుడు బుక్స్ చదవటం మొదలుపెట్టాను. ఆరోగ్య సమస్యలను ఎదుర్కొని, మళ్లీ సినిమాలు చేసిన నటుల గురించి, జీవితంలో ట్రోలింగ్‌కి, మానసిక ఒత్తిడికి గురైన వారు ఎలా కోలుకున్నారో తెలుసుకున్నాను. వారి కథలు చదవడం నాకెంతో ఉపయోగపడింది. వారిలా నేనూ చేయగలననే ధైర్యం వచ్చింది. ఈ దేశంలో ఎందరో స్టార్స్ ఉన్నారు. అందరిలో నాక్కూడా గుర్తింపు రావడం గొప్ప అదృష్టం. నా లైఫ్‌లోని ఒడిదుడుకులు బహిర్గతమైనందుకు నాకు బాధ లేదు. ఇక్కడ నాలా ఇబ్బందులు పడేవారు ఎందరో ఉన్నారు. వారందరూ నాలాగే పోరాడాలని ఆశిస్తున్నాను'' అన్నారు.

### కన్నప్పలో ఎంట్రీ


● మోహన్‌బాబు, శరత్‌కుమార్

సీనియర్ నటులు మంచు మోహన్‌బాబు, శరత్‌కుమార్ 'కన్నప్ప' మూవీ సెట్స్‌లో ఎంట్రీ ఇచ్చారు. మంచు విష్ణు కలల ప్రాజెక్ట్‌గా రూపొందుతోన్న చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో అవా ఎంటర్‌టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీపై నటుడు, నిర్మాత మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ మూవీ చిత్రీకరణ ప్రస్తుతం న్యూజిల్యాండ్‌లో జరుగుతోంది. హీరో ప్రభాస్, మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్ వంటి స్టార్స్ ఈ చిత్రంలో నటించనున్న విషయం తెలిసిందే. తాజాగా నటుడు మంచు మోహన్‌బాబు, శరత్ కుమార్ 'కన్నప్ప'లో భాగమైనట్లు ప్రకటించి, వారిద్దరూ కలిసి ఉన్న ఫొటోని విడుదల చేశారు. ''శివ భక్తుడు కన్నప్ప జీవిత చరిత్ర చుట్టూ ఈ చిత్రకథ తిరుగుతుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

### తొలి ప్రయత్నంలోనే హిట్టవడం ఆనందం – నిర్మాత అల్లు అరవింద్


● అల్లు అరవింద్, వంశీ నందిపాటి

'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో గౌరీకృష్ణ నిర్మించిన ఈ సినిమాను గీతా ఆర్ట్స్‌కు చెందిన వంశీ నందిపాటి ఈ నెల 3న విడుదల చేశారు. ఈ సినిమా బ్లాక్‌బస్టర్ దిశగా ముందుకు వెళ్తోందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా వంశీ నందిపాటిని ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ అభినందించారు. వంశీ మంచి అభిరుచిగలవాడని, మొదటి ప్రయత్నంలో చిరస్మరణీయమైన హిట్ అందుకోవడం తనకు ఆనందంగా ఉందని అల్లు అరవింద్ అన్నారు. ఈ సినిమాను హిట్ చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపేందుకు ఈ యూనిట్ నవంబరు 10 నుంచి ఆంధ్రాలో పర్యటించనుందని కూడా ఆయన వెల్లడించారు.

### ప్రతి కథకు పలు కోణాలు ఉంటాయి – అవసరాల శ్రీనివాస్


● అవసరాల, చైత్ర, రుక్మిణి, హేమంత్, అనుదీప్, వివేక్, రక్షిత్ శెట్టి

రక్షిత్ శెట్టి హీరోగా నటించిన కన్నడ చిత్రం 'సప్తసాగరదాచే ఎల్లో: సైడ్ బి'. హేమంత్ రావు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్, చైత్ర జె. ఆచార్ హీరోయిన్లుగా నటించారు. ఈ ఏడాది విడుదలైన 'సప్తసాగరదాచే ఎల్లో: సైడ్ ఏ' సినిమాకు ఇది సీక్వెల్. 'సప్తసాగరదాచే ఎల్లో: సైడ్ బి' సినిమాను తెలుగులో 'సప్తసాగరాలుదాటి సైడ్ బి'గా టీజీ విశ్వ ప్రసాద్, వివేక్ కూచిభొట్ల ఈ నెల 17న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశానికి ఓ అతిథిగా హాజరైన అవసరాల శ్రీనివాస్ మాట్లాడుతూ– ''ప్రతి కథకు పలు కోణాలు ఉంటాయి. 'సైడ్ ఏ'లో కనిపించని కోణాలు ఏమైనా 'సైడ్ బి'లో కనిపిస్తాయా? అని ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నాను'' అన్నారు. ''సప్తసాగరాలు దాటి సైడ్ ఏ'కు లభించిన ప్రేక్షకాదరణ 'సైడ్ బి'కి కూడా లభిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు మరో అతిథి కేవీ అనుదీప్. రక్షిత్‌శెట్టి మాట్లాడుతూ– ''అతడే శ్రీమన్నారాయణ', '777 చార్లీ', 'సప్త సాగరాలు దాటి సైడ్ ఏ' చిత్రాలపై తెలుగు ప్రేక్షకులు చూపించిన ప్రేమ, ఆదరణ 'సప్త సాగరాలు దాటి సైడ్ బి'కి కూడా లభిస్తాయని ఆశిస్తున్నాను' అన్నారు. ''నా జీవితంలో తారసపడిన కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా 'సప్త సాగరాలు దాటి..' సినిమా కథ రాసుకున్నాను'' అన్నారు హేమంత్ రావు. ''సప్తసాగరాలు దాటి: సైడ్ ఏ'కు లభించినట్లే 'సైడ్ బి'కీ ప్రేక్షకాదరణ లభిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు వివేక్ కూచిభొట్ల.

### అవార్డుల కంటే ప్రేక్షకుల గుర్తింపే ముఖ్యం – దర్శకుడు రాజు మురుగన్



''అవార్డుల కోసం సినిమాలు తీయాలనే ఆలోచన నాకు ఉండదు. ప్రేక్షకులు ఇచ్చే గుర్తింపు, ప్రేమ, అభిమానం, ఆప్యాయత చాలా ముఖ్యం. అవార్డులు వస్తే అదనపు బోనస్‌గా భావిస్తాను. ప్రేక్షకుల ప్రేమ, అభిమానంతో పాటు 'జోకర్' చిత్రానికి జాతీయ అవార్డు తీసుకోవడం నాకు గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. 'జపాన్' కూడా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుంది'' అని దర్శకుడు రాజు మురుగన్ అన్నారు. కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'జపాన్'. ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో అన్నపూర్ణ స్టూడియోస్ విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా రాజు మురుగన్ మాట్లాడుతూ– ''నేను సినిమాల్లోకి రావడానికి చార్లీ చాప్లిన్‌గారే స్ఫూర్తి. మూకీ చిత్రాలతోనే ఎన్నో ఆలోచనలు, భావోద్వేగాలను రేకెత్తించారు ఆయన. ఇక కార్తీగారిని దృష్టిలో పెట్టుకునే 'జపాన్' కథ రాశాను. కార్తీ, నిర్మాతలు ప్రభు, ప్రకాశ్‌గార్ల సహకారంతోనే 'జపాన్' చిత్రం ఇంత గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది. ఒక దర్శకుడిగా చిన్నా పెద్దా అని కాకుండా అన్ని రకాల సినిమాలు చేయాలనుకుంటున్నాను'' అన్నారు.

### కథే హీరో – దినేష్ తేజ్

దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ హీరో హీరోయిన్లుగా నటించిన లవ్ స్టోరీ ఫిల్మ్ 'అలా నిన్ను చేరి..'. మారేష్ శివన్ దర్శకత్వంలో కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో దినేష్ తేజ్ మాట్లాడుతూ– ''జీవితంలోని ఓ దశలో ప్రేమ ముఖ్యమా? లక్ష్యం ముఖ్యమా? అంటూ ప్రతి మధ్యతరగతి అబ్బాయి గురయ్యే సంఘర్షణను ఇందులో చూపించాం. ఈ సినిమాలో నేను కొత్తగా కాస్త కమర్షియల్ రోల్‌లో నటించాను. ఓ మంచి సినిమా చూశామనే ఫీలింగ్‌తో ప్రేక్షకులు థియేటర్స్ నుంచి బయటకి వస్తారని చెప్పగలను. కథ ఉంటేనే ఏమైనా చేయగలం. అందుకే కథే హీరో అని నమ్మే వ్యక్తిని నేను. ప్రేక్షకులు మెచ్చుకునే కథల్లో భాగం కావాలనుకుంటాను'' అన్నారు.



### నిర్మాత వేణుగోపాల్ మృతి


● వేణుగోపాల్

'నక్షత్రం'(2017) సినిమా నిర్మాతల్లో ఒకరైన ఎస్‌వీఎస్ వేణుగోపాల్(60) బుధవారం రాత్రి మృతిచెందారు. కాచిగూడ నుంచి మహబూబ్‌నగర్ వెళుతున్న రైలు నుంచి ఆయన ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందారు. సీరియల్స్ నిర్మాతగా ఆయన బుల్లితెర ప్రేక్షకులకు సుపరిచితులే. 'ఆనందో బ్రహ్మ' (1996) సీరియల్‌తో నిర్మాతగా ఆయన ప్రస్థానం మొదలైంది. దాదాపు పది సీరియల్స్ నిర్మించారాయన. 'ప్రియురాలు పిలిచె' ఆయన తీసిన చివరి సీరియల్. 'తులసీదళం' సీరియల్‌కి నంది అవార్డు అందుకున్నారు వేణుగోపాల్. సినిమా నిర్మాతగా 'నక్షత్రం' ఆయన తొలి చిత్రం.. అదే చివరి చిత్రం కూడా. హీరో చిరంజీవి నటించిన తొలి టీవీ షో 'విజయం వైపు పయనం'కి వేణుగోపాల్ నిర్మాత. ఈ షోకి యండమూరి వీరేంద్రనాథ్ దర్శకత్వం వహించారు. వేణుగోపాల్‌కి భార్య, ఇద్దరు కుమారులున్నారు. వేణుగోపాల్ మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. నేడు ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. కాగా 'నక్షత్రం' సినిమా నిర్మాతల్లో ఒకరైన సజ్జు మాట్లాడుతూ– ''వేణుగోపాల్‌గారు రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందారు. ఆయన ఆత్మహత్య చేసుకున్నాడన్నది అవాస్తవం. ఆయనకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవు'' అన్నారు.

### నాలుగేళ్లు పరిశోధన చేశాను – దర్శకుడు ఓంకార్ శ్రీనివాస్



హన్సిక టైటిల్ రోల్ చేసిన తాజా చిత్రం 'మై నేమ్ ఈజ్ శృతి'. ఓంకార్ శ్రీనివాస్ దర్శకత్వంలో బురుగు రమ్యా ప్రభాకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఓంకార్ శ్రీనివాస్ మాట్లాడుతూ– ''కొన్ని సినిమాలకు దర్శకత్వ విభాగంలో చేసిన నాకు 'మై నేమ్ ఈజ్ శృతి' దర్శకుడిగా తొలి చిత్రం. ఓ అమ్మాయి జీవితంలో జరిగిన వాస్తవ ఘటన స్ఫూర్తిగా తీసుకుని ఈ చిత్రకథ రాసుకున్నాను. స్కిన్ మాఫియా గురించిన స్క్రీన్‌ప్లే బేస్డ్ ఫిల్మ్ ఇది. హన్సికగారి అమ్మగారు స్కిన్ డాక్టర్ కావడంతో ఈ కథకు హన్సికగారు బాగా కనెక్ట్ అయ్యారు. జీవితంలో ఓ కలను నిజం చేసుకునేందుకు గ్రామం నుంచి సిటీకి వచ్చిన శృతి (హన్సిక పాత్ర పేరు) స్కిన్ మాఫియా ట్రాప్‌లో ఎలా చిక్కుకుంది? ఆ తర్వాత తనను తాను ఏ విధంగా కాపాడుకోగలిగింది? అనేది ఈ చిత్రం కథాంశం. మగవారికంటే మహిళలు చాలా స్ట్రాంగ్‌గా ఉంటారని, పెప్పర్ స్ప్రేలు లేకపోయినా తలలో ఉండే ఓ సేఫ్టీ పిన్‌తో కూడా ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోగలరని ఈ సినిమాలో చూపించాం. ఈ సినిమా కోసం నాలుగేళ్లు పరిశోధన చేశాను'' అని అన్నారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
10-11-2023

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ ▽ | నిఫ్టీ ▽ |
|---|---|
| 143 | 48 |
| 64,832 | 19,395 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

| సూచీ | విలువ | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 13,651 | △ | 5 |
| డోజోన్స్ | 34,083 | ▽ | 29 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,456 | △ | 54 |
| డాక్స్ | 15,223 | △ | 71 |
| షాంఘై | 3,053 | △ | 1 |
| నికాయ్ | 32,647 | △ | 480 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

**బులియన్** రూ.లలో

ముంబై

| | |
|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 59,830 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 56,980 |
| వెండి (కేజీ) | 70,300 |

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | కరెన్సీ | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | | 82.51 | 84.18 |
| £ | బ్రిటన్ పౌండ్ | | 100.58 | 103.20 |
| € | యూరో | | 87.74 | 90.78 |
| ¥ | జపాన్ ఎన్ (100) | | 54.40 | 55.96 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | | 51.85 | 56.06 |
| S$ | సింగపూర్ డాలర్ | | 59.11 | 61.34 |
| SAR | సౌదీ రియాల్ | | 22.88 | 21.35 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | | 21.78 | 23.57 |
| ¥ | చైనా యువాన్ | | 10.31 | 12.38 |

## ఇక కెనరా బ్యాంక్ వంతు...

5 బేసిస్ పాయింట్ల వడ్డీరేటు పెంపు

**న్యూఢిల్లీ:** నిధుల సమీకరణ వ్యయ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్‌ఆర్)ను ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్ – ఐదు బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) పెంచింది. ఇటీవలే ప్రైవేటు రంగ దిగ్గజం– హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఇదే స్థాయిలో కొన్ని కాలపరిమితులపై ఎంసీఎల్‌ఆర్‌ను పెంచిన సంగతి తెలిసిందే. అయితే కెనరా బ్యాంక్ మాత్రం అన్ని కాలపరిమితులపై రుణ రేటును పెంచింది. దీనితో ఎంసీఎల్‌ఆర్‌కు అనుసంధానమైన అన్ని రుణాలపై వడ్డీరేట్లు పెరగనున్నాయి. పెంచిన రేట్లు ఈ నెల 12వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. కెనరా బ్యాంక్ తాజా రెగ్యులేటరీ ఫైలింగ్ ప్రకారం – సాధారణంగా ఆటో, వ్యక్తిగత, గృహ రుణాలకు ప్రాతిపదికన అయిన ఏడాది ఎంసీఎల్‌ఆర్ 8.70 శాతం నుంచి 8.75%కి చేరింది. ఓవర్‌నైట్, నెల, మూడు నెలలు, ఆరు నెలల ఎంసీఎల్‌ఆర్ రేట్లు కూడా 5 బేసిస్ పాయింట్ల చొప్పున పెరిగాయి.

## హెచ్‌ఏఎల్‌తో ఎయిర్‌బస్ జట్టు



**న్యూఢిల్లీ:** దేశీయంగా విమానాల మెయింటెనెన్స్, రిపేర్, ఓవరాలింగ్ (ఎంఆర్‌వో) రంగాన్ని మరింత పటిష్టం చేసే దిశగా హిందుస్తాన్ ఏరోనాటిక్స్ (హెచ్‌ఏఎల్)తో ఎయిర్‌బస్ జట్టు కట్టింది. కమర్షియల్ విమానాల సర్వీసుల విభాగంలోకి ప్రవేశించేందుకు హెచ్‌ఏఎల్‌కు ఈ ఒప్పందం తోడ్పడనుంది. భారత్‌ను సమగ్ర ఎంఆర్‌వో హబ్‌గా తీర్చిదిద్దాలని తాము లక్ష్యంగా నిర్దేశించుకున్నామని, ఎయిర్‌బస్‌తో తమ నాసిక్ విభాగం ఒప్పందం ఇందులో భాగమేనని హెచ్‌ఏఎల్ సీఈవో (ఎంఐజీ కాంప్లెక్స్) సాకేత్ చతుర్వేది తెలిపారు. ఒప్పందంలో భాగంగా ఏ320 రకం విమానాలకు సంబంధించిన టూల్ ప్యాకేజీని ఎయిర్‌బస్ అందిస్తుంది. అలాగే ఎంఆర్‌వో కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక కన్సల్టింగ్ సర్వీసులు, తమ డిజిటల్ ప్లాట్‌ఫామ్ (ఎయిర్‌బస్ వరల్డ్)కు యాక్సెస్ అందిస్తుంది.

## రిలయన్స్, ఇన్ఫీ, టీసీఎస్ షేర్లు పడేశాయ్



19,400 దిగువకు నిఫ్టీ • సెన్సెక్స్ నష్టం 143 పాయింట్లు

**ముంబై:** రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు 1% పతనంతో సూచీలు గురువారం నష్టాలు చవిచూశాయి. నిఫ్టీ మళ్లీ 19,400 పాయింట్ల దిగువకు చేరింది. మిశ్రమ అంతర్జాతీయ సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్లు వరుస విక్రయాలు ఇందుకు తోడయ్యాయి. ఇంట్రాడేలో 280 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్ చివరికి 143 పాయింట్లు పతనమై 64,832 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 86 పాయింట్ల పరిధిలో కదలాడింది. ఆఖరికి 48 పాయింట్లు నష్టపోయి 19,395 వద్ద నిలిచింది. సూచీలు ఉదయం స్వల్ప లాభాల్లో కదలాడినా, వెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. తదుపరి కోలుకున్న ప్రతిసారీ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఎఫ్‌ఎంసీజీ, ఇంధన, మెటల్, ఐటీ, టెక్, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లు నష్టాలు చవిచూశాయి. ఫార్మా, ఆటో, రియల్టీ షేర్లకు స్వల్ప కొనుగోళ్ల మద్దతు లభించింది. విదేశీ ఇన్వెస్టర్లు 12 రోజూ అమ్మకాలకు పాల్పడుతూ రూ.1,712 కోట్ల విలువైన ఈక్విటీను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,512 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియా, యూరప్ మార్కెట్లు ట్రేడింగ్‌లో అధిక భాగం నష్టాల్లో ట్రేడైనప్పటికీ.. చివరికి స్వల్ప లాభాలతో గట్టెక్కాయి.

- సంస్థాగత కొనుగోలుదారుల(క్యూఐబీ) దన్నుతో అస్కి ఆటోమేటివ్ ఐపీఓ చివరి రోజు నాటికి 51.14 రెట్ల అధిక స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా కంపెనీ 2.06 కోట్ల షేర్లు జారీ చేయగా 105 కోట్ల బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ కోటా 142.41 రెట్లు, సంస్థాగతేర ఇన్వెస్టర్ల విభాగం 35.47 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల కోటా 5.70 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి.
- నష్టాల మార్కెట్లోనూ వెల్‌స్పన్ కార్ప్ షేరుకు భారీ డిమాండ్ నెలకొంది. క్యూ2లో నికర అమ్మకాలు 16% పెరగడం ఇందుకు కారణమైంది. బీఎస్‌ఈలో 5% పెరిగి రూ.480 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 9% ర్యాలీ చేసి రూ.496 వద్ద ఏడాది గరిష్టాన్ని అందుకుంది.
- సెప్టెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు నిరాశపరచడంతో శ్రీ రేణుకా షుగర్స్ షేరు 4% నష్టపోయి రూ.50 వద్ద స్థిరపడింది.

## 2026 నాటికి ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీలు

ఆర్చర్ ఏవియేషన్, ఇంటర్‌గ్లోబ్ డీల్

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా 2026 నాటికల్లా పూర్తి ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీ సర్వీసులను ప్రారంభించనున్నట్లు ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్ తెలిపింది. ఇందుకోసం ఆర్చర్ ఏవియేషన్ సంస్థతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. ఎయిర్ ట్యాక్సీలతో ఢిల్లీలోని కనాట్ ప్లేస్ నుంచి హర్యానాలోని గురుగ్రామ్‌కి 7 నిమిషాల్లో చేరుకోవచ్చని పేర్కొంది. రోడ్డు మార్గంలో 27 కి.మీ. దూరం ఉండే ఈ ప్రయాణానికి సాధారణంగా 60–90 నిమిషాలు పడుతోందని వివరించింది. పట్టణ ప్రాంతాల్లో ఎయిర్ ట్యాక్సీలతో పాటు కార్గో, లాజిస్టిక్స్, ఎమర్జెన్సీ సర్వీసుల కోసం ఎలక్ట్రిక్ విమానాలను వినియోగించే అవకాశాలను కూడా ఇరు సంస్థలు పరిశీలించనున్నట్లు ఇంటర్‌గ్లోబ్ తెలిపింది. ఇండిగో పేరిట ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్ విమానయాన సర్వీసులు అందిస్తోంది. ఎలక్ట్రికల్ వర్టికల్ టేకాఫ్, ల్యాండింగ్ (ఈవీటీవోఎల్) విభాగంలో ఆర్చర్ ఏవియేషన్ కార్యకలాపాలు సాగిస్తోంది.



## అరబిందో ఫార్మా లాభం రూ. 752 కోట్లు

- ఆదాయం రూ. 7,219 కోట్లు
- రూ. 3 డివిడెండ్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఔషధ రంగ దిగ్గజం అరబిందో ఫార్మా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 752 కోట్ల నికర లాభం ప్రకటించింది. గతేడాది ఇదే వ్యవధిలో నమోదైన రూ. 409 కోట్లతో పోలిస్తే లాభం దాదాపు 84 శాతం ఎగిసింది. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 5,739 కోట్ల నుంచి 26 శాతం పెరిగి రూ. 7,219 కోట్లకు చేరింది. రెండో త్రైమాసికంలోనూ భారీగా విక్రయాలు నమోదయ్యాయని, వివిధ మార్కెట్లలో పటిష్టమైన పనితీరు సాధించామని కంపెనీ వైస్ చైర్మన్ కె. నిత్యానంద రెడ్డి తెలిపారు. కొత్తగా మరిన్ని ఉత్పత్తులను ప్రవేశపెట్టనుండగా, కీలక ప్రాజెక్టులు తుది దశల్లో ఉన్నాయని ఆయన చెప్పారు. వీటి దన్నుతో భవిష్యత్‌లోను పటిష్టమైన వృద్ధిని సాధించడం కొనసాగించగలమని పేర్కొన్నారు. రెండో త్రైమాసికంలో ఫార్ములేషన్స్ విభాగం ఆదాయం 29 శాతం పెరిగి రూ. 5,968 కోట్లకు చేరింది. అమెరికా మార్కెట్ సుమారు 36 శాతం ఎగిసి రూ. 3,385 కోట్లుగా నమోదైంది. కన్సాలిడేటెడ్ ఆదాయంలో దీని వాటా 47 శాతంగా ఉంది. సమీక్షాకాలంలో అమెరికాలో అరబిందో ఫార్మా 19 ఉత్పత్తులను ప్రవేశపెట్టింది. యూరప్ మార్కెట్ 17 శాతం పెరిగి రూ. 1,769 కోట్లకు, గ్రోత్ మార్కెట్స్ 25 శాతం పెరిగి రూ. 564 కోట్లకు చేరాయి. పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై కంపెనీ రూ. 300 కోట్లు వెచ్చించింది.



బీఎస్‌ఈలో అరబిందో షేరు 1.50 శాతం పెరిగి రూ. 951 వద్ద ముగిసింది.

## అదానీ పోర్ట్స్ లాభం ఫ్లాట్

క్యూ2లో రూ. 1,762 కోట్లు

**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ప్రయివేట్ రంగ దిగ్గజం అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం స్వల్ప వృద్ధితో రూ. 1,762 కోట్లకు చేరింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 1,738 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 5,649 కోట్ల నుంచి రూ. 6,952 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 3,752 కోట్ల నుంచి రూ. 4,477 కోట్లకు పెరిగాయి. నిర్వహణ లాభం(ఇబిటా) 49% ఎగసి రూ. 7,429 కోట్లకు చేరింది. ఈ ఏడాది ప్రథమార్ధం(ఏప్రిల్–సెప్టెంబర్)లో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 12,894 కోట్ల ఆదాయం సాధించినట్లు అదానీ పోర్ట్స్ సీఈవో కరణ్ అదానీ తెలిపారు. 203 మిలియన్ మెట్రిక్ టన్నుల(ఎంఎంటీ) కార్గో పరిమాణం నమోదైనట్లు వెల్లడించారు. తొలి ఆరు నెలల్లో 8 పోర్టులు రికార్డ్ కార్గో పరిమాణాన్ని సాధించినట్లు వివరించారు. ఈ జాబితాలో ముంద్రాసహా హజీరా, ఎన్నోర్, ధామ్రా, కృష్ణపట్నం, గంగవరం ఉన్నట్లు పేర్కొన్నారు.



ఫలితాల నేపథ్యంలో అదానీ పోర్ట్స్ షేరు 1.5% నీరసించి రూ. 806 వద్ద ముగిసింది.

## ఈక్విటీ ఫండ్స్‌లోకి భారీ పెట్టుబడులు

- అక్టోబర్‌లో రూ.20,000 కోట్లు రాక
- సిప్ రూపంలో రూ.17 వేల కోట్లు

**న్యూఢిల్లీ:** ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ అక్టోబర్‌లోనూ ఇన్వెస్టర్ల ఆదరణ చూరగొన్నాయి. నికరంగా రూ.20,000 కోట్లను ఆకర్షించాయి. సెప్టెంబర్‌లో వచ్చిన రూ.14,091 కోట్లతో పోలిస్తే 40 శాతానికి పైగా పెరిగాయి. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో నెలవారీగా వచ్చే పెట్టుబడులు రూ.16,928 కోట్ల మైలురాయిని చేరాయి. సిప్ రూపంలో ఒక నెలలో వచ్చిన గరిష్ఠ స్థాయి పెట్టుబడులు ఇవే కావడం గమనించొచ్చు. అక్టోబర్ నెల గణాంకాలను మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) గురువారం విడుదల చేసింది. అక్టోబర్ నెలలో నాలుగు కొత్త మ్యూచువల్ ఫండ్ పథకాలు నిధుల సమీకరణ కోసం మార్కెట్లోకి రాగా, ఇవి రూ.2,996 కోట్లను సమీకరించాయి.



- స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోకి అత్యధికంగా రూ.4,495 కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయి. గత కొన్ని నెలలుగా స్మాల్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్ పథకాలు పెద్ద మొత్తంలో పెట్టుబడులను ఆకర్షిస్తుండడం గమనించొచ్చు.
- థీమ్యాటిక్ ఫండ్స్ రూ. 3,896 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి.
- వరుసగా ఐదు నెలల పాటు పెట్టుబడులను కోల్పోయిన లార్జ్‌క్యాప్ పథకాల దశ మారింది. ఇవి నికరంగా రూ.724 కోట్లను రాబట్టాయి.
- డెట్ మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లోకి నికరంగా రూ.42,634 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. సెప్టెంబర్‌లో డెట్ విభాగం నుంచి నికరంగా రూ.లక్ష కోట్లు బయటకు వెళ్లడం గమనార్హం.
- డెట్‌లో లిక్విడ్ ఫండ్స్ రూ.32,694 కోట్లను ఆకర్షించాయి. గిల్ట్ ఫండ్స్‌లోకి రూ.2,000 కోట్లు వచ్చాయి.
- గోల్డ్ ఈటీఎఫ్‌లోకి రూ.841 కోట్లు వచ్చాయి.
- అన్ని విభాగాల్లోకి కలిపి అక్టోబర్‌లో రూ.80,528 కోట్లు వచ్చాయి.
- మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ నిర్వహణలోని ఆస్తులు (ఏయూఎం) సెప్టెంబర్ చివరికి ఉన్న రూ. 46.58 లక్షల కోట్ల నుంచి రూ. 46.71 లక్షల కోట్లకు పెరిగాయి.

## అశోక్ లేలాండ్ లాభం హైస్పీడ్



క్యూ2లో రూ. 561 కోట్లు

**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ఆటో రంగ దిగ్గజం అశోక్ లేలాండ్ ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం దాదాపు మూడు రెట్లు ఎగసి రూ. 561 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 199 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 8,266 కోట్ల నుంచి రూ. 9,638 కోట్లకు జంప్ చేసింది. భారీ, మధ్యతరహా వాణిజ్య వాహన దేశీ విక్రయాలు 18 శాతం వృద్ధితో 29,947 యూనిట్లకు చేరాయి. తేలికపాటి వాణిజ్య వాహన అమ్మకాలు మాత్రం 17,040 యూనిట్ల నుంచి 16,998 యూనిట్లకు స్వల్పంగా తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో అశోక్ లేలాండ్ షేరు 1.7% బలహీనపడి రూ. 171 వద్ద ముగిసింది.

---

# సాక్షి స్పోర్ట్స్



## భారత జూనియర్ మహిళల హాకీ జట్టు కెప్టెన్‌గా ప్రీతి

ఈనెల 29 నుంచి డిసెంబర్ 10 వరకు చిలీలో జరిగే జూనియర్ మహిళల ప్రపంచకప్ హాకీ టోర్నీలో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. 18 మంది సభ్యులతో కూడిన భారత జట్టుకు హరియాణాకు చెందిన ప్రీతి కెప్టెన్‌గా వ్యవహరించనుంది. మొత్తం 16 జట్లను నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. లీగ్ దశలో భారత్ గ్రూప్ 'సి'లో కెనడాతో నవంబర్ 29న, జర్మనీతో నవంబర్ 30న, బెల్జియంతో డిసెంబర్2న తలపడుతుంది. 2022 జూనియర్ ప్రపవపంచకప్‌లో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది.

**భారత జట్టు:** ప్రీతి (కెప్టెన్), రుతుజా (వైస్ కెప్టెన్), ఖుష్బూ, మాధురి కిండో (గోల్‌కీపర్లు), నీలమ్, జ్యోతి సింగ్, రోప్నీ కుమారి, మహిమా టెటె, మంజూ చోర్సియా, జ్యోతి ఛత్రి, హీనా బానో, సుజాత కుజుర్, సాక్షి రాణా, ముంతాజ్ ఖాన్, అన్ను, దీపిక సోరెంగ్, మోనిక టొప్పో, సునెలితా. రిజర్వ్: నిరూపమా దేవి, ఈదుల జ్యోతి.

## జ్యోతి సురేఖకు స్వర్ణం, రజతం

ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్

**బ్యాంకాక్:** ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ రెండు పతకాలు గెలిచింది. గురువారం ముగిసిన ఈ టోర్నీలో విజయవాడకు చెందిన 27 ఏళ్ల జ్యోతి సురేఖ మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో రజతం, టీమ్ విభాగంలో స్వర్ణం సాధించింది. వ్యక్తిగత విభాగం ఫైనల్లో జ్యోతి సురేఖ 145–145 (8/9) 'షూట్ ఆఫ్'లో భారత్‌కే చెందిన పర్ణీత్ కౌర్ చేతిలో ఓడిపోయింది. నిర్ణీత 15 బాణాల తర్వాత ఇద్దరి స్కోర్లు సమంగా నిలిచాయి. విజేతను నిర్ణయించేందు ఇద్దరికి ఒక్కో షాట్ అవకాశం ఇచ్చారు. జ్యోతి సురేఖ బాణం 8 పాయింట్ల వృత్తంలోకి వెళ్లగా... పంజాబ్‌కు చెందిన 18 ఏళ్ల పర్ణీత్ కౌర్ 9 పాయింట్ల షాట్‌తో తొలి అంతర్జాతీయ వ్యక్తిగత స్వర్ణ పతకం సొంతం చేసుకుంది. జ్యోతి సురేఖ, అదితి స్వామి, పర్ణీత్ కౌర్‌లతో కూడిన భారత బృందం కాంపౌండ్ టీమ్ ఫైనల్లో 234–233తో చైనీస్ తైపీని ఓడించి పసిడి పతకాన్ని దక్కించుకుంది. ఇప్పటి వరకు ఏడుసార్లు ఆసియా చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న జ్యోతి సురేఖ ఓవరాల్‌గా 5 స్వర్ణాలు, 5 రజతాలు, 2 కాంస్య పతకాలు సాధించింది. మరోవైపు కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో అదితి–ప్రియాంశ్ జోడీ 156–151తో కనోక్‌నాపుస్–నవాయుత్ (థాయ్‌లాండ్) జంటను ఓడించి స్వర్ణ పతకాన్ని గెల్చుకుంది. పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగం కాంస్య పతక మ్యాచ్‌లో అభిషేక్ వర్మ 147–146తో జూ జేహూన్ (దక్షిణ కొరియా)ను ఓడించాడు.



## మెగ్ లానింగ్ గుడ్‌బై

- అంతర్జాతీయ మహిళల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఆస్ట్రేలియా స్టార్
- ఏడు ప్రపంచకప్ టైటిల్స్‌లో భాగస్వామి

**మెల్‌బోర్న్:** మహిళల క్రికెట్‌కే మకుటం లేని మహారాణి మెగ్ లానింగ్. ఆటతో, సారథ్య నైపుణ్యంతో ఆస్ట్రేలియా జట్టుకు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించిన ఈ విజయవంతమైన సారథి, 13 ఏళ్ల ఫలప్రదమైన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికింది. ఆస్ట్రేలియా అమ్మాయిల క్రికెట్లో ఎవర్‌గ్రీన్ 'మెగాస్టార్'గా కెప్టెన్ లానింగ్‌కు పెట్టింది పేరు. 31 ఏళ్ల వన్నె తగ్గని ఈ క్రికెటర్ తన ప్రతిభా పాటవాలతో ఏకంగా ఏడు ప్రపంచకప్ విజయాల్లో భాగమైంది. ఇందులో ఐదు టైటిల్స్ ఆమె కెప్టెన్సీలోనే వచ్చాయి. గతేడాది లానింగ్ సారథ్యంలో ఆసీస్ మహిళల జట్టు కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణ పతకాన్ని గెలిచింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో దక్షిణాఫ్రికా ఆతిథ్యమిచ్చిన టి20 ప్రపంచకప్‌లో జట్టును విజేతగా నిలిపాక మళ్లీ ఆమె బరిలోకి దిగలేదు. ఆరోగ్య సమస్యలతో ఇంగ్లండ్, వెస్టిండీస్ పర్యటనలకు దూరంగా ఉంది.

**ఇలా అరంగేట్రం:** జన్మతః సింగపూర్ అమ్మాయి అయిన మెగ్... న్యూజిలాండ్‌తో 2010లో జరిగిన టి20తో అంతర్జాతీయ అరంగేట్రం చేసింది. కెరీర్‌లో ఆఖరి మ్యాచ్ కూడా ఈ ఫార్మాట్‌లోనే ఆడింది.

**అలా సంచలనం:** పిన్న వయసు (21 ఏళ్లు)లోనే కెప్టెన్ అయిన 'ఆసీస్ యంగెస్ట్ క్రికెటర్'. ఒక వన్డే సిరీస్‌లో అత్యధిక పరుగులు (1232) చేసిన కెప్టెన్‌గా ఘనత. టి20ల్లో అత్యధికంగా వంద మ్యాచ్‌ల్లో సారథ్యం వహించిన తొలి కెప్టెన్‌గానూ రికార్డు. మెగ్ లానింగ్ మొత్తం 179 మ్యాచ్‌ల్లో కెప్టెన్‌గా వ్యవహరించగా, ఆమె కెప్టెన్సీలో ఆసీస్ జట్టు 146 మ్యాచ్‌ల్లో గెలిచింది.



**'కప్'ల కహాని:** రెండు వన్డే వరల్డ్‌కప్‌లు (2013, 2022), ఐదు టి20 ప్రపంచకప్ (2012, 2014, 2018, 2020, 2023)లలో విజయవంతమైన కెప్టెన్‌గా, బ్యాటర్‌గా నిరూపించుకుంది. లానింగ్ సారథ్యంలో ఆసీస్ 2022 వన్డే వరల్డ్‌కప్‌లో, 2014, 2018, 2020, 2023 టి20 వరల్డ్‌కప్‌లో విజేతగా నిలిచింది.

**బ్యాటింగ్‌లో సునామీ:** న్యూజిలాండ్‌తో జరిగిన వన్డేలో కేవలం 45 బంతుల్లోనే వేగవంతమైన సెంచరీ సాధించిన ఆసీస్ క్రికెటర్‌గా రికార్డు.

**కెరీర్ ప్రొఫైల్:** ఆరు టెస్టులు ఆడి 345 పరుగులు, 103 వన్డేల్లో 4602 పరుగులు సాధించింది. ఇందులో 15 సెంచరీలు, 21 ఫిఫ్టీలున్నాయి. 132 టి20ల్లో 3405 పరుగులు చేసింది. 2 శతకాలు, 15 అర్ధసెంచరీలున్నాయి. ఓవరాల్‌గా 241 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో కలిపి లానింగ్ 8,352 పరుగులు చేసింది.

## కివీస్‌కు సెమీస్ పిలుపు!

- న్యూజిలాండ్‌కు సెమీస్ బెర్త్ లాంఛనం
- శ్రీలంకపై 5 వికెట్లతో గెలుపు
- పాకిస్తాన్ ఆశలు గల్లంతు!

**గత ప్రపంచకప్ రన్నరప్ న్యూజిలాండ్ కీలక సమరంలో తమ సత్తా చాటింది. టోర్నీలో వరుసగా నాలుగు విజయాల తర్వాత నాలుగు పరాజయాలతో తమ పరిస్థితిని క్లిష్టంగా మార్చుకున్న కివీస్ ఆఖరి ఆటలో స్థాయికి తగ్గ ప్రదర్శనను కనబర్చి దాదాపు సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. చివరి మ్యాచ్‌లో శ్రీలంకను చిత్తు చేసిన ఆ జట్టు మరే జట్టుపై ఆధారపడకుండా తమ సెమీస్ అవకాశాలను తానే సృష్టించుకుంది. కివీస్ గెలుపుతో పాకిస్తాన్ సెమీస్ ఆశలు చేజారాయి. సాంకేతికంగా, అంకెల ప్రకారం పాక్ పూర్తిగా, అధికారికంగా నిష్క్రమించకపోయినా... అసాధ్యమైన, ఊహకు కూడా అందని తరహాలో ఆ జట్టు తర్వాతి మ్యాచ్‌లో గెలవాల్సిన నేపథ్యంలో వాస్తవికంగా చూస్తే పాక్ ఆట ముగిసినట్లే!**



**బెంగళూరు:** పదునైన బౌలింగ్, ఆపై దూకుడైన బ్యాటింగ్‌తో న్యూజిలాండ్ వరల్డ్‌కప్ లీగ్ దశను ఘనంగా ముగించింది. సెమీస్ అవకాశాలు నిలిచి ఉండాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో చెలరేగిన ఆ జట్టు తమ లక్ష్యాన్ని నిర్విఘ్నంగా పూర్తి చేసింది. గురువారం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఐదు వికెట్ల తేడాతో శ్రీలంకను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లంక 46.4 ఓవర్లలో 171 పరుగులకే ఆలౌటైంది. కుశాల్ పెరీరా (28 బంతుల్లో 51; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీ సాధించాడు. 10 ఓవర్లలోపే 70/5 స్కోరుతో కుప్పకూలేందుకు సిద్ధమైన లంక... చివర్లో మహీశ్ తీక్షణ (91 బంతుల్లో 38 నాటౌట్; 3 ఫోర్లు) రాణించడంతో ఈ మాత్రం స్కోరైనా సాధించగలిగింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ట్రెంట్ బౌల్ట్ (3/37)తో పాటు ఇతర కివీస్ బౌలర్లూ సత్తా చాటి ప్రత్యర్థిని పడగొట్టారు. అనంతరం న్యూజిలాండ్ 23.2 ఓవర్లలో 5 వికెట్లకు 172 పరుగులు సాధించింది. కాన్వే (42 బంతుల్లో 45; 9 ఫోర్లు), రచిన్ రవీంద్ర (34 బంతుల్లో 42; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 74 బంతుల్లోనే 86 పరుగులు జోడించి విజయానికి పునాది వేయగా, మిచెల్ (31 బంతుల్లో 43; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఫలితంతో న్యూజిలాండ్ సెమీస్‌కు చేర డం దాదాపుగా ఖాయం కాగా... కివీస్ ఓటమిపై ఆశలు పెట్టుకున్న పాక్, అఫ్గానిస్తాన్‌కు నిరాశ తప్పలేదు.

**స్కోరు వివరాలు**

**శ్రీలంక ఇన్నింగ్స్:** నిసాంక (సి) లాథమ్ (బి) సౌతీ 2; పెరీరా (సి) సాన్‌ట్నర్ (బి) ఫెర్గూసన్ 51; మెండిస్ (సి) రచిన్ (బి) బౌల్ట్ 6; సమరవిక్రమ (సి) మిచెల్ (బి) బౌల్ట్ 1; అసలంక (ఎల్బీ) (బి) బౌల్ట్ 8; మాథ్యూస్ (సి) మిచెల్ (బి) సాన్‌ట్నర్ 16; ధనంజయ (సి) మిచెల్ (బి) సాన్‌ట్నర్ 19; కరుణరత్నే (సి) లాథమ్ (బి) ఫెర్గూసన్ 6; తీక్షణ (నాటౌట్) 38; చమీర (సి) బౌల్ట్ (బి) రచిన్ 1; మదుషంక (సి) లాథమ్ (బి) రచిన్ 19; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (46.4 ఓవర్లలో ఆలౌట్) 171. వికెట్ల పతనం:** 1–3, 2–30, 3–32, 4–70, 5–70, 6–104, 7–105, 8–113, 9–128, 10–171. **బౌలింగ్:** బౌల్ట్ 10–3–37–3, సౌతీ 8–0–52–1, ఫెర్గూసన్ 10–2–35–2, సాన్‌ట్నర్ 10–2–22–2, రచిన్ 7.4–0–21–2, ఫిలిప్స్ 1–0–3–0.

**న్యూజిలాండ్ ఇన్నింగ్స్:** కాన్వే (సి) ధనంజయ (బి) చమీర 45; రచిన్ (సి) ధనంజయ (బి) తీక్షణ 42; విలియమ్సన్ (బి) మాథ్యూస్ 14; మిచెల్ (సి) అసలంక (బి) మాథ్యూస్ 43; చాప్‌మన్ (రనౌట్) 7; ఫిలిప్స్ (నాటౌట్) 17; లాథమ్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 2; మొత్తం (23.2 ఓవర్లలో 5 వికెట్లకు) 172. వికెట్ల పతనం: 1–86, 2–88, 3–130, 4–145, 5–162. బౌలింగ్: మదుషంక 6.2–0–58–0, తీక్షణ 7–0–43–1, ధనంజయ 2–0–22–0, చమీర 4–1–20–1, మాథ్యూస్ 4–0–29–2.

### ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | పా | నె.ర.రే. |
|---|---|---|---|---|---|
| భారత్ | 8 | 8 | 0 | 16 | 2.456 |
| దక్షిణాఫ్రికా | 8 | 6 | 2 | 12 | 1.376 |
| ఆస్ట్రేలియా | 8 | 6 | 2 | 12 | 0.861 |
| న్యూజిలాండ్ | 9 | 5 | 4 | 10 | 0.743 |
| పాకిస్తాన్ | 8 | 4 | 4 | 8 | 0.036 |
| అఫ్గానిస్తాన్ | 8 | 4 | 4 | 8 | -0.338 |
| ఇంగ్లండ్ | 8 | 2 | 6 | 4 | -0.885 |
| బంగ్లాదేశ్ | 8 | 2 | 6 | 4 | -1.142 |
| శ్రీలంక | 9 | 2 | 7 | 4 | -1.419 |
| నెదర్లాండ్స్ | 8 | 2 | 6 | 4 | -1.635 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

### ప్రపంచకప్‌లో నేడు

దక్షిణాఫ్రికా × అఫ్గానిస్తాన్

**వేదిక:** అహ్మదాబాద్

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

### 287 పరుగుల తేడాతో గెలిస్తేనే పాక్ ముందుకు...

అక్షరాలా 287 పరుగులు... శనివారం ఇంగ్లండ్‌పై ఇంత భారీ తేడాతో విజయం సాధిస్తేనే పాకిస్తాన్ జట్టు ముందంజ వేసే అవకాశం ఉంటుంది. అంటే పాకిస్తాన్ ముందుగా బ్యాటింగ్ చేసి కనీసం 300 పరుగులు చేస్తే ఇంగ్లండ్‌ను 13 పరుగులకు పరిమితం చేయాలి! 350 చేస్తే 63 పరుగులకు, 400 చేస్తే 112 పరుగులకు పరిమితం చేయాల్సి ఉంటుంది. వన్డేల్లో ఇప్పటివరకు ఒక్కసారి కూడా పాక్ జట్టు 400 పరుగుల స్కోరు దాటలేదు. ఇంగ్లండ్ ఏ జట్టుకూ 400 పరుగులు సమర్పించుకోలేదు. ఇంగ్లండ్‌ను నిలువరించడం సంగతేమో కానీ పాక్ ప్రస్తుత ఫామ్ చూస్తే ఆ జట్టే కనీసం 300 పరుగులు చేసే స్థితిలో లేదు. అసలు 287 పరుగులు చేస్తే గానీ లెక్క రాసే అవకాశం కూడా లేదు! ఇక ఇంగ్లండ్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంటే మాత్రం టాస్ వద్దే పాక్ జట్టు ఖేల్ ఖతం. ఎందుకంటే ఎంతటి లక్ష్యమైనా పాక్ 3 ఓవర్లలోపే ఛేదించాల్సి ఉంటుంది! ఇది ఏ రకంగానూ ఊహకు కూడా అందనిది. ఇక నేడు దక్షిణాఫ్రికాపై అఫ్గానిస్తాన్ అయితే ఏకంగా 438 పరుగుల తేడాతో గెలవాలి కాబట్టి మరో చర్చే అనవసరం. దీనిని పక్కన పెడితే ఈ నెల 15న ముంబైలో భారత్, న్యూజిలాండ్ మధ్య తొలి సెమీఫైనల్... 16న కోల్‌కతాలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య రెండో సెమీఫైనల్ జరగడం ఖాయం.

## 'టాప్' మహారాష్ట్ర

ముగిసిన జాతీయ క్రీడలు

**పనాజీ (గోవా):** జాతీయ క్రీడల్లో మహారాష్ట్ర 1994 తర్వాత తొలిసారి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. గురువారం ముగిసిన ఈ క్రీడల్లో మహారాష్ట్ర 80 స్వర్ణాలు, 69 రజతాలు, 79 కాంస్యాలతో కలిపి మొత్తం 228 పతకాలతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఓవరాల్ చాంపియన్ హోదాలో రాజా భళీంద్ర సింగ్ ట్రోఫీని మహారాష్ట్ర సొంతం చేసుకుంది. పురుషుల విభాగంలో తమిళనాడు స్విమ్మర్ శ్రీహరి నటరాజ్ 'ఉత్తమ అథ్లెట్'గా... మహిళల విభాగంలో ఒడిశా జిమ్నాస్ట్‌లు సంయుక్త, ప్రణతి నాయక్ 'ఉత్తమ అథ్లెట్స్'గా ఎంపికయ్యారు. 42 క్రీడాంశాల్లో 11 వేలకుపైగా క్రీడాకారులు ఈ క్రీడల్లో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ 7 స్వర్ణాలు, 5 రజతాలు, 15 కాంస్యాలతో కలిపి 27 పతకాలతో 19వ స్థానంలో... తెలంగాణ 4 స్వర్ణాలు, 10 రజతాలు, 11 కాంస్యాలతో కలిపి 25 పతకాలతో 22వ స్థానంలో నిలిచాయి. ముగింపు వేడుకలకు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

### పతకాల పట్టిక (టాప్-5)

| | స్వర్ణాలు | రజతాలు | కాంస్యాలు | మొత్తం |
|---|---|---|---|---|
| మహారాష్ట్ర | 80 | 69 | 79 | 228 |
| సర్వీసెస్ | 66 | 27 | 33 | 126 |
| హరియాణా | 62 | 55 | 75 | 192 |
| మధ్యప్రదేశ్ | 37 | 36 | 39 | 112 |
| కేరళ | 36 | 24 | 27 | 87 |







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.